www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 321
మంగళవారం 27-1-2026
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.7:06 తదుపరి దశమి, నక్షత్రం: భరణి ఉ.11:09 తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.10:18-11:47, దుర్ముహూర్తం: ఉ.9:06-9:51, రా.10:16-11:05, అమృతఘడియలు: శేషం ఉ.8:08, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 6:03
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


సోమవారం ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో ఆర్మీ దివ్యాస్త్ర యూనిట్ ప్రదర్శించిన అత్యాధునిక డ్రోన్లు

యుద్ధ భేరి.. సంగీత కచేరి

ఢిల్లీలో అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

తొలిసారి బ్యాటిల్ ఆరే ఫార్మాట్‌లో సైన్యం కవాతు

2,500 మంది కళాకారులతో వందేమాతరం ప్రదర్శన

ప్రత్యేక ఆకర్షణగా కీరవాణి బాణీలు

10


పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ నజీర్

ప్రజల్లో మళ్లీ విశ్వాసం!

కొన్నేళ్లు రాష్ట్రానికి దిశ, దశ లేదు

రాజధాని పనులు నిలిచిపోయాయి

పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది

కూటమి ప్రభుత్వ విధ్వంబాటుతో ఫలితాలు కనిపిస్తున్నాయి: గవర్నర్

అమరావతిలో గణ..తంత్రం

రాష్ట్ర రాజధానిలో తొలిసారి వేడుకలు

పోటెత్తిన ప్రజలు, రైతులు, విద్యార్థులు

గ్యాలరీలు సరిపోక బయటే నిలబడిన వైనం

స్ఫూర్తి నింపిన పోలీసు దళాల కవాతు

రాష్ట్రాభివృద్ధికి సూచికగా శకటాల ప్రదర్శన

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

హాజరైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్

అమరావతిలో ప్రభుత్వం తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకలకు విశేష స్పందన లభించింది. త్రివర్ణ పతాక రెపరెపలతో రాజధాని తళుకులీనింది. రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత సాధనకు ప్రభుత్వం సంకల్పించిన వేళ, ఈ ప్రయత్నాలను స్వాగతిస్తూ పెద్దఎత్తున రైతులు, విద్యార్థులు, ప్రజలు ఈ వేడుకల్లో భాగమయ్యారు. కవాతులు స్ఫూర్తిని నింపితే, శకటాలు కనువిందు చేశాయి.

11


గణతంత్ర పరేడ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్

సుజలాం.. సస్యశ్యామలాం!

జల సవ్వడులు..

కేంద్ర నిధులతో రాష్ట్రమంతా జలకళ



రెండు దశల్లో 10 వేల కోట్లు

రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం

రాయలసీమ, నెల్లూరు, ప్రకాశంలో పండ్ల తోటలు, సాగునీటికి ఊతం

మౌలిక సదుపాయాలూ అభివృద్ధి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం

గరిష్ఠ స్థాయిలో 'పూర్వోదయ' నిధులకు యత్నం

సంబంధిత శాఖలపై నేడు సీఎం కీలక సమీక్ష

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కేంద్ర పథకాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోవడం... భారీగా కేంద్ర నిధులు సాధించడం... రాయలసీమ, ప్రకాశం, పశ్చిమ నెల్లూరు జిల్లాలను 'సస్యశ్యామలం' చేయడం! దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, పొలాలకు 'సుజలాలు' ప్రవహించడం! ఈ రెండు బృహత్ లక్ష్యాలు పూర్తి చేసే దిశగా ప్రణాళికలు రూపుదిద్దుకోనున్నాయి. దీనికి నిధులు ఇచ్చేందుకు కేంద్రం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. గ్రామీణాభివృద్ధి, జల వనరులకు సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాల నుంచి రాష్ట్రానికి రూ.10వేల కోట్లు వచ్చే అవకాశం కనిపిస్తోంది. రెండు దశల్లో రూ.10,000 కోట్లు రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అలాగే... పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూ.14,100 కోట్లు అవసరమని ఇప్పటికే గుర్తించారు. కేంద్రం అమలు చేస్తున్న 'పూర్వోదయ' పథకం ద్వారా గరిష్ఠ స్థాయిలో నిధులు సాధించేందుకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కేంద్రం నుంచి అందే ఈ నిధులను సమర్థంగా వినియోగించుకుని, సత్వర ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని

మిగతా 12వ పేజీలో...

పాలనలో సాంకేతికతకు పెద్దపీట

ఉద్యోగులపై పనిభారం తగ్గించేందుకు చర్యలు

కృత్రిమ మేధతో త్వరితగతిన సమస్యల పరిష్కారం

టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా 2026

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

12


సోమవారం ఆర్టీజీఎస్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'గ్రూప్-2'పై నత్తనడక!

గ్రూప్-2 నోటిఫికేషన్ ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. ఓవైపు తుది ఫలితాల కోసం అభ్యర్థులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తుంటే.. మరోవైపు ఆలస్యమయ్యే కొద్దీ కొత్తగా న్యాయ వివాదాలు పుట్టుకొస్తున్నాయి. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో ఫలితాలు వెలువరించే అవకాశం వచ్చినా, ఏపీపీఎస్సీ పలు కారణాలతో దానిపై ముందుకెళ్లలేదు. దీంతో ఇప్పుడు రోస్టర్, క్రీడా కోటా వివాదాలు ఫలితాల వెల్లడికి అడ్డంకిగా మారాయి. నోటిఫికేషన్ జారీ చేసి రెండేళ్లు దాటిపోయినా.. ఇప్పటికీ తుది ఫలితాలను విడుదల చేయకపోవడంతో అభ్యర్థుల్లో ఆవేదన పెరుగుతోంది. ఈ జాప్యం వల్ల ఫలితాల్లో పారదర్శకత లోపిస్తుందేమోనన్న కొత్త చర్చ కూడా తలెత్తుతోంది.

రెండేళ్లు దాటినా పూర్తికాని నియామకాలు

మెయిన్స్ పరీక్ష జరిగి దాదాపు ఏడాది

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా

తుది ఫలితాల వెల్లడికి కుదరని ముహూర్తం

న్యాయ వివాదాలతో ఇంతకాలం ఆలస్యం

హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ముందుకెళ్లని ఏపీపీఎస్సీ.. పుట్టుకొస్తున్న కొత్త కేసులు

'రోస్టర్' కేసు పెండింగ్‌తో ఆగిన గ్రూప్-1

అభ్యర్థుల్లో పెరుగుతున్న ఆందోళన, ఆవేదన

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం 2023 డిసెంబరు 7న జారీ అయిన గ్రూప్-2 నోటిఫికేషన్ ప్రక్రియ నేటికీ నత్తనడకన సాగుతోంది. ప్రిలిమ్స్, మెయిన్స్, సర్టిఫికెట్ల పరిశీలన వంటి కీలక దశలు పూర్తి చేసుకున్నప్పటికీ.. తుది ఫలితాల వెల్లడికి మోక్షం కలగడం లేదు. ఉద్యోగార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2023కు ముందు 2018లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలైంది. అంటే ఇప్పటివరకు ఏడేళ్ల కాలంలో రెండు నోటిఫికేషన్లు మాత్రమే వచ్చాయి. సకాలంలో నోటిఫికేషన్లు లేకపోవడంతో 2023 చివర్లో భారీ

మిగతా 3వ పేజీలో...


ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్‌తో ప్రధాని మోదీ

శిఖరాగ్ర సదస్సులో అధికారిక ప్రకటన

ట్రంప్ ఆంక్షల నేపథ్యంలో ప్రాధాన్యం

రక్షణ రంగంలోనూ భాగస్వామ్యం!

ఉద్యోగాల కోసం యూరప్‌కు వెళ్లడం భారతీయులకు ఇక సులువు!

అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం

ప్రపంచ సుస్థిరతకు, సుసంపన్నతకు భారత్ కీలకం: ఉర్సులా వాన్ డెర్

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. నేడే

తగ్గనున్న యూరోపియన్ కార్ల ధరలు!

15 వేల యూరోలకు మించి ఉన్న కార్లపై సుంకాలు 110% నుంచి 40 శాతానికి

కాలక్రమంలో 10 శాతానికి తగ్గే అవకాశం

ఏడాదికి 2 లక్షల కార్లకు మాత్రమే వర్తింపు!

విద్యుత్తు వాహనాలపై మాత్రం ఐదేళ్లపాటు సుంకాల తగ్గింపునకు నో అన్న ఇండియా!

ఐదేళ్ల తర్వాత వాటిపైనా తగ్గించే అవకాశం

తగ్గనున్న స్కోడా, ఆడీ, వోల్వో, ఫోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ, బెంజ్, లాండ్ రోవర్, డిఫెండర్ ధరలు

లాంబోర్ఘిని, మసెరాటి, పోర్ష వంటి ఖరీదైన కార్లూ..

10



10

రూ.2 లక్షలు దాటనున్న తులం బంగారం

అంతర్జాతీయ విపణిలో తొలిసారి 5000 డాలర్ల మార్కును దాటిన ట్రాయ్ ఔన్సు బంగారం ధర

ఈ ఏడాదే 7000 డాలర్లనూ దాటే చాన్స్

లండన్ బులియన్ అసోసియేషన్ అంచనా


అక్రమాల గుట్టు తేల్చరా!?

జగన్ ప్రభుత్వం నాటి ఇసుక బిల్లుల క్లియరెన్స్‌కు ఏపీఎండీసీలో కదలిక.. నిపుణులతో కమిటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం నాటి ఇసుక బకాయిలను చెల్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) సిద్ధమవుతోంది. నాడు అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చినా.. నేతల ఒత్తిళ్లు, పీజీఆర్ఎస్‌లో వరుస ఫిర్యాదులతో ఒత్తిడి పెరుగుతుండటంతో బకాయిలను సెటిల్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా బిల్లుల చెల్లింపుపై అధ్యయనం కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో గత జగన్ ప్రభుత్వంలో నియమితులై, ఇప్పటికీ ఎండీసీలో కీలక హోదాలోనే కొనసాగుతున్న ఓ వైస్ ప్రెసిడెంట్, ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ముఖ్య ఆర్థిక అధికారి(సీఎఫ్ఓ), ఫైనాన్స్, అకౌంట్స్ విభాగం చూసే డిప్యూటీ జనరల్ మేనేజర్, కంపెనీ కార్యదర్శి, ఆడిట్ విభాగం అధికారి సభ్యులుగా ఉంటారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాలను ప్రైవేటు కంపెనీ జేపీ వెంచర్స్‌కు అప్పగించడానికి ముందు ఏడాదిపైనే ఏపీఎండీసీ నేతృత్వంలో ఇసుక నిర్వహణ జరిగింది. అప్పట్లో నాటి అధికార వైసీపీ నేతలు కొందరు తమ ప్రధాన అనుచరులు, బినామీలను ముందుపెట్టి ఇసుక కాంట్రాక్టులు తీసుకున్నారు. కొందరు నిజంగానే పారదర్శకంగా టెండర్లు దక్కించుకున్నారు. 2019 సెప్టెంబరు నుంచి 2021 వరకు ప్రైవేటు ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇచ్చేవరకు ఏపీఎండీసీనే ఇసుక వ్యాపారాన్ని చూసుకుంది. ఈ సమయంలో

మిగతా 12వ పేజీలో...







వైసీపీ జెండా నీడలో చెలరేగిన అరాచకం...
రౌడీయిజంతో నరకాన్ని చవిచూసిన రాష్ట్ర ప్రజానీకం !
ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు అయోమయం... అంధకారం !

ఆ చీకటిని చీల్చుకుంటూ...
వెలిగిన ఒక చిరు దీపం...
సామాన్యుడి గొంతుకై గర్జించిన

YUVA GALAM

యువగళం – ప్రజాగళం





భావితరాల భవిష్యత్తు కోసం కదిలిన ఆ పాదాల స్పర్శకు తెలుగునేల పులకించింది... పల్లె పల్లెనూ పలకరిస్తూ... బిక్కసచ్చి బ్రతుకుతున్న ప్రజానీకాన్ని చైతన్య పరుస్తూ... ప్రజా బలం తోడుగా 226 రోజులు -3132 కి.మీ.ల దూరం సాగిన ప్రయాణ ప్రభంజనం... రాక్షస పాలనకు చరమగీతం పాడింది !

స్వర్ణాంధ్ర పునర్నిర్మాణం కోసం కదిలిన శ్రీ నారా లోకేష్ గారి పాదముద్రలను మననం చేసుకుంటూ... నేటికీ పాదయాత్ర ప్రారంభించి 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నా వెన్నుతట్టి ప్రోత్సహించి, నా వెన్నంటే ఉండి నడిపిస్తున్న...



శ్రీ నారా లోకేష్ గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు

భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి
శాసనమండలి సభ్యులు, జోన్ IV కోఆర్డినేటర్, పులివెందుల.



అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కవాతు విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న ఇండియన్ ఆర్మీ కంటింజెంట్, ద్వితీయ బహుమతి అందుకుంటున్న విశాఖ ఏపీఎస్పీ 16వ బెటాలియన్, ప్రోత్సాహక బహుమతి స్వీకరిస్తున్న కేరళ పోలీస్ కంటింజెంట్, అన్ ఆర్మ్‌డ్ కవాతు విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ద్వితీయ బహుమతి స్వీకరిస్తున్న బాలికల ఎన్‌సీసీ

విద్యుత్తు గ్రిడ్ బలోపేతానికి 9319.30 కోట్లు

- 55 ప్రాజెక్టుల ద్వారా గ్రిడ్‌కు 8,853 ఎంవీఏ అదనపు సామర్థ్యం
- గణతంత్ర వేడుకల్లో ట్రాన్స్‌కో జేఎండీ ప్రవీణ్ చంద్

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు గ్రిడ్‌ను బలోపేతం చేసి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా గ్రిడ్‌ను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో సుమారు రూ.9319.30 కోట్ల అంచనా వ్యయంతో 55 ట్రాన్స్మిషన్ ప్రాజెక్టులు చేపడుతున్నామని ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. సోమవారం విజయవాడలోని విద్యుత్తు సౌధలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెన్కో ఇన్‌చార్జి ఎండీ పుల్లారెడ్డితో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ 'ఇటీవల 3,240 ఎంవీఏ అదనపు సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, 950 సర్క్యూట్ కిలోమీటర్ల కొత్త ట్రాన్స్మిషన్ లైన్లు ఏర్పాటు చేశాం. కొత్తగా చేపడుతున్న 55 ప్రాజెక్టుల ద్వారా మరో 8,853 ఎంవీఏ సామర్థ్యం జత కలుస్తుంది. 1,558 సర్క్యూట్ కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. గత ఏడాది కాలంగా ట్రాన్స్‌కో చేపట్టిన చర్యల ఫలితంగా విద్యుత్తు పంపిణీ నష్టాలను రికార్డు స్థాయిలో 2.6 శాతానికి తగ్గించగలిగాం. ఏపీలో ప్రస్తుతం మొత్తం 21,153 మెగావాట్ల స్థాపిత విద్యుత్తు సామర్థ్యం ఉంది. అందులో పునరుత్పాదక శక్తి 37% కాగా, 22% విద్యుత్తు ఉత్పత్తిని అందిస్తుంది. 2024-25లో రాష్ట్రం 13,712 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్తు డిమాండ్‌ను నమోదు చేసింది. రాష్ట్రంలో 6,020 మెగావాట్ల సామర్థ్యం గల 6 పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు రానున్నాయి' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లు జేవీరావు, ఏకేవీ భాస్కర్, ఎన్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు వి.ఉష, ఎం.సుజయ్‌కుమార్, అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని విద్యుత్తు సౌధలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడుతున్న ట్రాన్స్‌కో జేఎండీ ప్రవీణ్ చంద్

'గ్రూప్-2'పై నత్తనడక!

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో 905 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది. వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ఇచ్చిన ఏకైక గ్రూప్-2 నోటిఫికేషన్ ఇదే. 2024 ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్ పరీక్షలు జరిగాయి. ఆ తర్వాత ఏడాదికి 2025 ఫిబ్రవరి 23న మెయిన్స్ జరిగాయి. 4.04 లక్షల మంది ప్రిలిమ్స్ రాయగా.. మెయిన్స్‌కు 92,250 మంది ఎంపికయ్యారు. వారిలో సర్టిఫికెట్ల పరిశీలనకు 2,559 మంది అర్హత సాధించారు. ఆ ప్రక్రియ కూడా పూర్తవగా.. కోర్టు కేసులు, ఇతర కారణాలతో తుది ఫలితాలు మాత్రం విడుదల కావట్లేదు.



ఇవీ వివాదాలు

రాష్ట్ర ప్రభుత్వం అంతకుముందున్న రోస్టర్ విధానం స్థానంలో కొత్తగా హారిజంటల్ రోస్టర్ విధానం ప్రవేశపెట్టింది. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, క్రీడా కోటా అభ్యర్థులకు ఈ విధానంతో సమాన అవకాశాలు లభిస్తాయి. అయితే గత విధానం తరహాలో ఏ పోస్టు ఎవరికి వస్తుందనేది హారిజంటల్ రిజర్వేషన్‌లో కచ్చితంగా అంచనా వేయలేరు. కాగా, అసలు ఈ రోస్టర్‌లోనే తప్పులున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. దానిపై చాలాకాలం విచారణ అనంతరం గత డిసెంబరు 30న హైకోర్టు ఆ పిటిషన్లను కొట్టివేసింది. కాగా, మరో ముగ్గురు క్రీడా కోటా అభ్యర్థులు క్రీడా కోటా అంశంపై హైకోర్టును ఆశ్రయించారు. అప్పటికే చాలాకాలం అయినందున క్రీడా కోటాలో ఇద్దరు అభ్యర్థులకు రెండు పోస్టులు రిజర్వ్ చేసి, ఫలితాలపై ముందుకెళ్లాలని న్యాయస్థానం ఆదేశించింది. కొట్టేసిన రోస్టర్ వివాదంలో ఇప్పుడు మరో పిటిషన్ హైకోర్టులో దాఖలైంది. దానిని న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. దీనిపై వాదనలు మొదలైతే.. తుది తీర్పు వెల్లడికి ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి. ఇలా కేసులు నమోదవుతూ, ఫలితాలు ఆగిపోతూ ఉంటే తామేం చేయాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయంటూ..

హైకోర్టు స్పష్టతనిచ్చినా ఏపీపీఎస్సీ ఫలితాల వెల్లడిపై నిర్ణయం తీసుకోలేకపోతోంది. మొత్తం 905 పోస్టుల్లో క్రీడా కోటా కింద 21 పోస్టులున్నాయి. వాటిలో రెండు పోస్టులు రిజర్వ్ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. హారిజంటల్ రిజర్వేషన్ విధానంలో ఆ రెండు పోస్టులు ఎక్కడ వస్తాయో చెప్పలేమని, ఆ రెండు పోస్టులను పక్కనపెట్టి ముందుకెళ్తే, తుది ఫలితాల అనంతరం మళ్లీ వివాదాలు తలెత్తుతాయని ఏపీపీఎస్సీ అభిప్రాయపడుతోంది. అప్పుడు మళ్లీ మొదటి నుంచీ తిరిగి పోస్టింగులు మార్చాల్సి వస్తుందని భావిస్తోంది. కాగా, గ్రూప్-1 ఫలితాల కోసమే గ్రూప్-2 ఫలితాలను ఆపేశారని అభ్యర్థులు సందేహిస్తున్నారు. ఎందుకంటే గ్రూప్-1 ఫలితాలపైనా రోస్టర్ కేసు పెండింగ్‌లో ఉండటంతో ఫలితాలు ఆగిపోయాయి. గ్రూప్-1, 2 నోటిఫికేషన్లలో తుది ఫలితాలకు ఎంపికైన అభ్యర్థులు సుమారు 20 మంది రెండింట్లోనూ ఉన్నారు. దీంతో ముందు గ్రూప్-2 ఫలితాలు ఇస్తే... వారిలో కొందరు తర్వాత ఇచ్చే గ్రూప్-1లోనూ ఎంపికైతే గ్రూప్-2 ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోతారు. ఆ పోస్టులు తర్వాత నోటిఫికేషన్లకు క్యారీ ఫార్వార్డ్ అవుతాయి. ఇలా కాకూడదనే ఉద్దేశంతోనే ఫలితాలను ఆపేస్తున్నారని, 10-20 మంది కోసం వేలాది మందిని ఆందోళనకు గురిచేస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

అభ్యర్థుల్లో పలు అనుమానాలు

పలు కారణాలతో గ్రూప్-2 ఫలితాలు ఆగిపోగా.. అభ్యర్థులు మాత్రం అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. న్యాయ వివాదాలు పరిష్కారమై ఫలితాలు ఇచ్చే పరిస్థితి ఉన్నా, ఆ సమయంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. కొన్ని పోస్టుల్లో కావాల్సిన వారి కోసం ఫలితాలు ఆపుతున్నారంటూ ప్రచారం మొదలైంది. ఈ అంశంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి కనిపిస్తోంది. హైకోర్టు ఫలితాలు ఇవొచ్చని చెప్పినా, ఇవ్వకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోందని, 2 వేల మందికి పైగా అభ్యర్థులు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని టీడీపీ నాయకులు అంటున్నారు. వీలైనంత త్వరగా ఫలితాలు వెల్లడిస్తే భవిష్యత్తు నోటిఫికేషన్లకు అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

చిక్కినట్టే చిక్కి.. తప్పించుకున్న పులి

కొయ్యలగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఏజెన్సీవాసులను ఇంకా పులి భయం వీడలేదు. ఆదివారం కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడులోని ఒక రైతుకు చెందిన మొక్కజొన్న తోటలో పులి తిష్ఠ వేసిన విషయం విదితమే. దాని కదలికలను పరిశీలించేందుకు అటవీ అధికారులు తోట చుట్టూ ట్రాప్ కెమెరాలను అమర్చారు. దాన్ని బంధించేందుకు నలువైపులా బోన్లు సిద్ధం చేశారు. దీంతో పులి దాదాపు చిక్కినట్టేనని అంతా భావించారు. అయితే సోమవారం సాయంత్రం వరకు మొక్కజొన్న తోటలోనే ఉన్న పులి ఆపై బిల్లిమిల్లి, మర్రిగూడెం గ్రామాల వైపునకు వెళ్లినట్టు అడుగుజాడలను బట్టి సోమవారం ఉదయం గుర్తించారు. ఆ ప్రాంతంలోని రైతులంతా తమ పశువులను ఇళ్ల వద్దకు తరలించడంతో.. సోమవారం రాత్రి వరకు పులి నుంచి ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రోన్ కెమెరాలతో దాని ఆచూకీ కనిపెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.



పెద్దపులి అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

గల్ఫ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

- భారతీయ కాన్సుల్ జనరల్స్ ఆధ్వర్యంలో జెడ్డా, దుబాయ్, రియాధ్‌లో కార్యక్రమాలు
- దుబాయ్‌లో వేడుకల్లో పాల్గొన్న శశి థరూర్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను గల్ఫ్ దేశాల్లో ప్రవాసీయులు ఘనంగా జరుపుకొన్నారు. సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిగిన కార్యక్రమంలో భారతీయ కాన్సుల్ జనరల్ ఫహద్ ఖాన్ సూరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలను చదివి వినిపించారు. సూరి స్వస్థలం కర్నూలు నగరం కావడం విశేషం. రియాధ్‌లో భారత రాయబారి సోహల్ అహ్మద్ పతాకవిష్కరణ చేశారు. దుబాయిలో వర్షం కురుస్తున్నా పెద్ద సంఖ్యలో భారతీయులు త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని కాన్సులేట్‌కు చేరుకున్నారు. అక్కడ కాన్సుల్ జనరల్ సతీశ్ శివన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పాల్గొన్నారు. బహ్రెయిన్‌లో తెలుగు కళా సమితి తన కార్యాలయ ప్రాంగణంలో వేడుకలను నిర్వహించింది. ఆ సంస్థ అధ్యక్షుడు జగదీశ్ పతాకవిష్కరణ చేశారు. ఆబుధాబి, మస్కట్, కువైత్, దోహా నగరాల్లోనూ వేడుకలు జరిగాయి. జెడ్డా, రియాధ్, దమ్మాం, జుబైల్, తాయిఫ్, తబూక్ నగరాల్లోని భారతీయ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.



జెడ్డాలో జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న భారతీయ కాన్సుల్ జనరల్ ఫహద్ ఖాన్ సూరి

ప్రశంస.. బదిలీ రెండూ ఒకే రోజు!

- కలికిరి సీఐకి వింత అనుభవం



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ రామచంద్ర



కలికిరి పోలీసుస్టేషన్‌లో విధుల నుంచి రిలీవ్ అవుతున్న సీఐ

కలికిరి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలికిరి ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రకు గణతంత్ర దినోత్సవం రోజున వింత అనుభవం ఎదురైంది. ఉత్తమ విధి నిర్వహణలో ఆయనకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం లభించింది. మదనపల్లెలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమక్షంలో ఎస్పీ ధీరజ్ ఈ పురస్కారాన్ని అందజేశారు. దాంతోపాటు బదిలీ ఉత్తర్వులు కూడా ఇచ్చా రు. దీంతో సీఐ రామచంద్ర వెంటనే కలికిరి పోలీసుస్టేషన్ చేరుకుని విధుల నుంచి రిలీవ్ అయ్యారు. తదుపరి పోస్టింగ్ కోసం డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. డిసెంబరు 2న కలికిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనను రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే బదిలీ చేయడం, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ ఎస్వీ భట్టి

తిరుమల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయ ంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర నం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



బొబ్బిలి సమీపంలో గజరాజుల స్వైరవిహారం

- పంటలు, ధాన్యం ధ్వంసం.. జనం బెంబేలు

బొబ్బిలి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏనుగులు స్వైరవిహారం చేస్తున్నాయి. దిబ్బగుడ్డివలస, రాజుపేట, సీతయ్యపేట గ్రామాల పరిధిలో సంచరిస్తున్నాయి. పిల్ల ఏనుగులతో కలిపి 8 ఏనుగులు పొరుగున ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం, మక్కువ మండలాల సరిహద్దు నుంచి బొబ్బిలి పట్టణ సమీపానికి వచ్చేశాయి. మూడు రోజులుగా మొక్కజొన్న పంటను, రైతులు కళ్లాల్లో నిల్వచేసిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి మండలం రాజుపేట గ్రామంలో ఆదివారం తిష్ఠవేయడంతో గ్రామస్థులు రాత్రివేళ ఇళ్లకు చేరుకోవడానికి భయపడ్డారు. సీఐ సతీశ్‌కుమార్ పోలీసు వాహనంలో వారిని గ్రామానికి తరలించారు. ఏనుగులకు ఆహారం దొరకకపోవడం, విశాఖ-రాయపూర్ వెళ్లే రైళ్ల రాకపోకల శబ్దాలతో ఏనుగులు ఇక్కడి నుంచి కదలడం లేదని అటవీ అధికారులు తెలిపారు.



బొబ్బిలి పట్టణానికి సమీపంలో ఏనుగుల కదలికలను గమనిస్తున్న ట్రాకర్స్

శంబర జాతరకు వెళ్లేది ఈ దారిలోనే..

ఉత్తరాంధ్రలో ప్రతిష్ఠాత్మకమైన మక్కువ మండలంలోని శంబర పోలమాంబ జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ జాతరకు విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివెళుతుంటారు. మంగళవారం అమ్మవారి సిరిమాను జాతర జరుగుతుంది. వేల సంఖ్యలో భక్తజనం వెళతారు. బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస మీదుగా మక్కువ, శంబర వెళ్లే రూటులో భక్తులంతా రాకపోకలు సాగిస్తారు. ఏనుగుల సంచారం ఉందని తెలియడంతో వారంతా టెన్షన్ పడుతున్నారు.

సెల్ టవర్ ఎక్కిన టీడీపీ కార్యకర్త

- కుమార్తె విషయంలో పోలీసులు న్యాయం చేయలేదంటూ ఆవేదన

కొత్తచెరువు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం కదిరేపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ లక్ష్మీనారాయణ తన కుమార్తె విషయంలో పోలీసులు న్యాయం చేయలేదంటూ సోమవారం సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. కొత్తచెరువులోని బుక్కపట్నం రోడ్డులో ఉన్న సెల్‌టవర్‌ను తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఎక్కి టీడీపీ జెండా చేతపట్టుకుని నిరసనకు దిగాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ మారుతీశంకర్ అక్కడకు చేరుకుని కిందికి దిగిరావాలని లక్ష్మీనారాయణకు సూచించారు. సమస్య ఏంటని సీఐ ఫోన్‌లో అడగ్గా.. 'నీవే నాకు సమస్య. నా కుమార్తెకు న్యాయం చేయాలని 4 నెలలుగా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా.. న్యాయం చేయలేదు' అంటూ ఫోన్ కట్ చేశాడు. విషయం కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు కొత్తచెరువుకు చేరుకున్నారు. లక్ష్మీనారాయణ కుమార్తె శ్రావణి మాట్లాడుతూ... తనకు భర్తతో విభేదాలు తలెత్తడంతో విడాకులకు దరఖాస్తు చేసుకున్నామని, భర్త వద్ద ఉన్న బంగారం ఇప్పించాలంటూ సీఐ వద్దకు తన తండ్రి, తాను వెళ్లామని చెప్పారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి.. తరువాత తన భర్తకు మద్దతుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త తరపు వారు లంచం ఇవ్వడంతోనే సీఐ అడ్డం తిరిగారని ఆరోపించారు. ఆమె భర్తను అక్కడికి పిలిపించి, న్యాయం చేస్తామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో లక్ష్మీనారాయణ ఉదయం 11.30 గంటల సమయంలో టవర్ దిగాడు.



కిందకు దిగి వచ్చిన లక్ష్మీనారాయణ

టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కృషి

- రాష్ట్రంలో తొలి టెంపుల్ టూర్ కారవాన్‌ను ప్రారంభించిన మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక శాఖ అధ్వర్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో కారవాన్‌లను ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భక్తులకు వెసులుబాటు కల్పించనున్నట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా రూపొందించిన కారవాన్‌ను సోమవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



టెంపుల్ టూర్ కారవాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టూరిజం అధికారులు

విశాఖలో వించ్ పారాసెయిలింగ్

విశాఖపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా రుషికొండ సాగర తీరంలో వించ్ పారాసెయిలింగ్ (పడవ వెనుక పారాచూట్ సాయంతో గాలిలో ప్రయాణం) ట్రయల్ రన్ నిర్వహించారు. ఏపీటీడీసీ పిలిచిన టెండర్లలో నిర్వహణ హక్కులను కైవసం చేసుకున్న 'ఫన్ అడ్వంచర్స్' సంస్థ నిర్వాహకులు సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'పడవలో ఒకేసారి 15 మంది ప్రయాణికులు వెళ్లవచ్చు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్(ఎన్‌ఐడబ్ల్యూఎస్)లో శిక్షణ పొందిన ఒక డైవర్, ఇద్దరు సహాయకుల పర్యవేక్షణలో ఈ అడ్వంచర్ సాగుతుంది' అని వివరించారు.



వించ్ పారాసెయిలింగ్ (ఫైల్)

ప్రయాణికులను కాపాడి.. మృత్యు ఒడిలో ఒరిగి!

- విజయవాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ నాగరాజు గుండెపోటుతో మృతి

విజయవాడ బస్‌స్టేషన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అమరావతి ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడకు వేగంగా వస్తోంది. బస్సు బయలుదేరినప్పటి నుంచే డ్రైవర్ కె.నాగరాజు (42) అస్వస్థతగా ఉన్నారు. తల తిరగడం, ఛాతీలో నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. బస్సు చౌటుప్పల్ దగ్గరకు వచ్చేసరికి నాగరాజుకు తల తిరగటం, ఛాతీలో నొప్పి ఎక్కువయ్యాయి. గుండె పోటుగా భావించి, ఇక బస్సు తోలలేనని నిర్ణయించుకుని బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాలని.. వెనక వచ్చే మరో బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి చెప్పారు. బస్సులోని ప్రయాణికులకు కూడా ఇదే విషయం చెప్పారు. అటెండర్‌ను బస్సు వద్దే ఉంచి, ఆటోలో అతనొక్కడే సమీపంలోని ఆసుపత్రికి బయలుదేరి మార్గ మధ్యంలోనే ప్రాణాలు విడిచారు. నందిగామకు చెందిన నాగరాజు కానూరులో కుటుంబ సభ్యులతో ఉంటూ విజయవాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. నాగరాజుకు ఇద్దరు పిల్లలు. పాప దివ్యాంగురాలు. కుమారుడు ఐదో తరగతి చదువుతున్నాడు.



డ్రైవర్ నాగరాజు

అవయవదానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు

- ఇంజనీరింగ్ విద్యార్థి బ్రెయిన్ డెడ్
- గ్రీన్ చానల్ ద్వారా తిరుపతికి గుండె తరలింపు
- లివర్, కిడ్నీలు రమేశ్ హాస్పిటల్‌కు..
- కార్నియాలు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి బ్రెయిన్ డెడ్ అయినా.. ఆరుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం పినపాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పెరుగు అమర్ బాబు (22) తాడికొండ మండలం నిడుముక్కలలో ఈ నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆయనను గుంటూరులోని ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ అమర్‌బాబు సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవన్‌దాన్ కో ఆర్డినేటర్లు బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారికి అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. దీంతో వారు అవయవదానానికి అంగీకరించారు. సోమ వారం సాయంత్రం అవయవాల సేకరణ ప్రారంభించిన వైద్యులు.. అమర్ గుండెను తిరుపతికి తరలించాలని నిర్ణయించారు. పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు.. గ్రీన్‌చానల్ ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రత్యేక అంబులెన్స్‌లో అమర్ గుండెను గన్నవరం ఎయిర్‌పోర్టుకు తరలించారు. అక్కడి నుంచి విమానంలో తిరుపతికి పంపించారు. అమర్ కాలేయం, రెండు కిడ్నీలకు గుంటూరు రమేశ్ హాస్పటల్‌కు కేటాయించగా.. ఇక్కడ ముగ్గురు రోగులకు వాటిని అమర్చారు. రెండు కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు పంపించారు.



అమర్‌బాబు గుండెను తరలిస్తున్న రమేశ్ హాస్పిటల్స్ సిబ్బంది



అమర్‌బాబు కుటుంబసభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

వారి నిర్ణయం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే గల్లా మాధవి

అవయవదానంతో ఆరుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన అమర్‌బాబు కుటుంబ నిర్ణయం స్ఫూర్తిదాయకమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. సోమవారం రమేశ్ హాస్పిటల్స్‌కు వచ్చిన ఆమె.. అమర్‌బాబు తల్లి కోటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమర్‌బాబు మృతి దురదృష్టకరమని, ఇంత బాధలోనూ కుటుంబసభ్యులు మానవతా దృక్పథంతో అవయవదానానికి ముందుకు రావడం గొప్ప విషయమని అన్నారు.

నిషేధిత సిగరెట్ల రాకెట్ గుట్టురట్టు

- కాకినాడ జిల్లా తూరంగిలో రూ.1.75 కోట్ల విలువైన అన్ బ్రాండెడ్ నిల్వలు స్వాధీనం
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

కాకినాడ రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత, అన్ బ్రాండెడ్ సిగరెట్ల రాకెట్ గుట్టును విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. సోమవారం దాడులు నిర్వహించి సుమారు రూ.1.75 కోట్లు విలువ చేసే అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. తూరంగి బైపాస్ రోడ్డు సమీపంలో ఓ ఇంట్లో అక్రమంగా సిగరెట్ నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ, ఇంద్రపాలెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమ సిగరెట్ రాకెట్ మురా గుట్టురట్టు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ తాతారావు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడలోని సూర్యనారాయణపురానికి చెందిన పచ్చిగోళ్ల అప్పారావు రెండు నెలల కిందట తూరంగి శివారు ప్రాంతంలో ఓ ఇంట్లో గది అద్దెకు తీసుకున్నాడు. ఇతడు ఒడిసా, బిహార్‌లోని పాట్నా నుంచి నిషేధిత, అన్ బ్రాండెడ్ కల్తీ సిగరెట్లను కొనుగోలు చేసి, లారీల్లో తూరంగి తీసుకొచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నాడు. ఇక్కడి నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు పాన్‌షాపులకు బిల్లులు లేకుండా సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం చేసిన దాడుల్లో రూ.1.75 కోట్ల విలువ చేసే 311 బాక్సుల్లో ఉన్న 3,73,200 అన్ బ్రాండెడ్ సిగరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అప్పారావును అదుపులోకి తీసుకొని, తదుపరి విచారణ కోసం ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించారు. ఒక్కో పెట్టెపై రేటు రూ.40 ఉందని, కొన్నింటిపై రూ.64, రూ.100 ముద్రించి ఉందని తాతారావు తెలిపారు. ఈ సరుకును నిందితుడికి సరఫరా చేస్తున్న వారి పేర్లు, ఈ రాకెట్‌లో ఇంకెవరైనా ఉన్నారా? అనే వివరాలు పోలీసుల విచారణలో తేలుతుందన్నారు. అప్పారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు.



కాకినాడ జిల్లా తూరంగిలో ఓ ఇంట్లో అక్రమ సిగరెట్ ప్యాకెట్ల నిల్వలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పద్మప్రకాశాలు


పద్మ పురస్కారాల గ్రహీతల ఎంపికలో మోదీ ప్రభుత్వం సిఫార్సులు, రాజకీయ పలుకుబడులకు అతీతంగా, కేవలం దేశ సేవను, ఆయా రంగాల్లో వారి వారి ప్రతిభాపాటవాలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకొంటున్నదని చాలామంది నమ్మకం. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన అసాధారణ వ్యక్తులను గౌరవిస్తున్నారని, కిందిస్థాయి ప్రాతినిధ్యం బాగా పెరిగిందని వారంటారు. అయితే, అవార్డులకు ఎంపికైనవారు అర్హులా కాదా అన్నకంటే, ఎంపికలో రాజకీయ ప్రాథమ్యాలు పనిచేశాయన్న చర్చ ఇప్పుడూ తప్పడం లేదు. ఎన్నికలున్న ఏడాది అయితే సదరు జాబితాను మీడియా వేయికళ్ళతో తిరగేస్తూ, ప్రకటిత పద్మాల్లో ఏయే రాష్ట్రానికి ఎన్నెన్ని దక్కాయి, ఆయా పురస్కారాల ప్రభావం ఓటర్లమీద ఎంతమేరకు ఉంటుందన్న చర్చోపచర్చలతో తెగ ఊగిపోతూంటుంది.

ఈ ఏడాది మొత్తం అవార్డుల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అసోంలకు 37 దక్కాయి. ఆరునూరైనా స్టాలిన్‌ను అధికారంనుంచి దించేయాలని బీజేపీ పట్టుదలతో ప్రయత్నిస్తున్న తమిళనాడు 13 అవార్డులతో ప్రథమస్థానంలో ఉంది. అధికారానికి అరడుగుల దూరంలో ఉన్నామని, దీదీని గట్టిగా ఢీకొడితే గద్దెని గెలుచుకోవడం ఖాయమని నమ్ముతున్న పశ్చిమబెంగాల్ 11అవార్డులతో, కేరళ8 పురస్కారాలతో, ఐదింటితో అసోం ఉన్నాయి. రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ ఐదింటిలోనూ మూడు కేరళకు దక్కడం విశేషం. గత ఏడాది జూలైలో కన్నుమూసిన సీపీఎం నాయకుడు వి.ఎస్.అచ్యుతానందన్, ప్రముఖ ఆర్ఎస్ఎస్ నాయకులు నారాయణన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి కె.టి. థామస్ ఈ అవార్డు అందుకున్నారు. మిగతా రెండు పురస్కారాలు సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసురాలు ఎన్.రాజమ్‌కు, ఇటీవల కన్నుమూసిన ప్రసిద్ధ నటుడు, బీజేపీ మాజీ ఎంపీ ధర్మేంద్రకు లభించాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పలు అంశాల్లో విభేదించిన వారు అచ్యుతానందన్. పదహారేళ్ళక్రితమే పొలిట్‌బ్యూరోనుంచి బయటకువచ్చేసిన ఈయనను పార్టీలో అసమ్మతి గొంతులా కొందరు విశ్లేషకులు పరిగణిస్తారు. నంబూద్రిపాద్‌నుంచి ఇప్పటివరకూ సీపీఎం నాయకులు రత్నాలనీ, పద్మాలనీ తిరగ్గొడుతూ వచ్చిన విషయం తెలిసిందే. 2022లో బుద్ధదేవ్ భట్టాచార్యకు పద్మభూషణ్ ఇవ్వబోతే వద్దన్నారు. తమ పార్టీ విధానానికి అనుగుణంగా ఈ నిర్ణయం ఉన్నదని సీపీఎం అప్పట్లో సంతోషంగా వ్యాఖ్యానించింది. ఇప్పుడు అచ్యుతానందన్ కుమారుడు తన తండ్రికి మరణానంతరం ఈ గౌరవం ఇచ్చినందుకు కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేశారు, ఆ కుటుంబం నిర్ణయాన్ని తాము గౌరవిస్తున్నట్టుగా సీపీఎం రాష్ట్రనాయకత్వం ప్రకటించి, గతంలో తమ నాయకులు చేసిన తిరస్కారాలన్నీ వ్యక్తిగతమైనవని కూడా ఓ మాటన్నది. ముఖ్యమంత్రి విజయన్ ఈ పురస్కారం గురించి మాట్లాడదల్చుకున్నట్టు లేదు.

ఇక, నాలుగునెలలక్రితమే కేరళ నటుడు మోహన్‌లాల్‌ను దాదాసాహెబ్ ఫాల్కేతో సత్కరించిన కేంద్రం, ఇప్పుడు మరోనటుడు మమ్ముట్టిని పద్మభూషణ్‌తో గౌరవించింది. హిందూ ఎళవ కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ నారాయణ ధర్మ పరిపాలనాయోగం (ఎస్ఎన్‌డిపి) జనరల్ సెక్రటరీ వెల్లంపల్లి నటేశన్‌కు మరో పద్మభూషణ్ ఇవ్వడానికి కారణం ఆయన కుమారుడి పార్టీ భారత్ ధర్మ జనసేన కేరళలో ఎన్డీయే భాగస్వామి కావడమేనంటారు. 2024 లోక్‌సభ ఎన్నికలు కేరళలో బీజేపీకి మంచి ఉత్సాహాన్నిస్తే, ఇటీవలి స్థానికసంస్థల ఎన్నికలు భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పి. నారాయణన్ సహా రాష్ట్రానికి చెందిన ప్రముఖుల ఎంపికలో కొన్ని లెక్కలు ఉన్నాయని కొందరి వాదన. మొన్నటి లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్పూరీఠాకూర్, చౌదరీ చరణ్‌సింగ్ ఎంపికలోనూ ఓట్లు, జాట్ల అంచనాలున్నాయని కొన్ని విమర్శలు వచ్చాయి. 2021లో మరోవారంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉండగా నటుడు రజనీకాంత్‌కు 2019దాదా సాహెబ్ ఫాల్కే ప్రకటించినప్పుడు అంతా సంతోషించారు కానీ, దానిని నాలుగునెలల ముందు లేదా నాలుగువారాలు ఆగి ప్రకటించివుంటే మరింత గౌరవంగా ఉండేదని అన్నారు. పురస్కారాల గ్రహీతల ప్రతిష్ఠనుంచి పొందగలిగే రాజకీయ ప్రయోజనం ఏమేరకు ఉంటుందో తెలియదు కానీ, అటువంటి చర్చకు ఆస్కారమే లేనివిధంగా పాలకులు వ్యవహరించడం అవసరం.

వెనక్కి నడుస్తోన్న కాలచక్రం!

భవిష్యత్తును నూటికినూరుపాళ్లూ ఊహించటం కష్టం! నాయకుల ప్రవర్తనలు, రాజకీయ పరిణామాల విషయంలో అది మరింత నిజం! సమకాలీన పరిస్థితులను ఎంతో సునిశిత పరిశీలనాశక్తితో చూసేవారు కూడా భవిష్యత్తు పరిణామాల్లో కొన్నిటినే అంచనావేయగలరు. జరిగిన చరిత్రను లోతుగా మథించి, జరుగుతోన్న చరిత్రనూ సమగ్రంగా అవగాహన చేసుకుంటున్నప్పటికీ భవిష్యద్దర్శనానికి ఎన్నో పరిమితులు ఉంటాయి. అనుకోని సంఘటనలు, అనూహ్య పరిణామాలు అంచనాలను తారుమారు చేస్తాయి. కానీ కొన్ని పరిస్థితులు కొంత కాలం ఒకే ఒరవడిలో బలంగా కొనసాగుతూ ఉంటే భవిష్యత్తు రూపురేఖలు కాస్త స్పష్టంగానైనా తెలుస్తాయి.



ప్రొఫెసర్ చాల్మర్స్ జాన్సన్ 19 ఏళ్లక్రితం 'నెమిసిస్' (కర్మఫలం) అనే పేరుతో ప్రచురించిన పుస్తకంలో చేసిన విశ్లేషణే ఇందుకు నిదర్శనం. 1945 తర్వాత అమెరికా తన ఆధిపత్య విస్తరణ కోసం చేసిన అనేక అమానవీయ, అప్రజాస్వామ్య నిర్వాకాలకు కర్మఫలితాలను అనుభవిస్తోందనీ, ఒక్కొక్కటిగా అవన్నీ కళ్లముందు రూపుకడుతున్నాయనీ జాన్సన్ విశ్లేషించారు. ఆయన అంతటితో ఆగలేదు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి చివరిరోజులు సమీపిస్తున్నాయని భవిష్యద్దర్శనంలాగా అంచనా వేశారు. ఆయన చేసిన పదునైన సూత్రీకరణలనూ, వ్యాఖ్యలను చూస్తే అవి ఎంతగా ఇప్పటి పరిస్థితులకు సరిపోతాయో స్పష్టంగా తెలుస్తుంది. 'నెమిసిస్' (2007) రాసే నాటికి డోనాల్డ్ ట్రంప్ రాజకీయాల్లో ఒక శక్తిగా మారతారనీ సమీప భవిష్యత్తులో అమెరికా అధ్యక్షుడు అవుతారనీ ఎవరూ భావించలేదు. విచిత్రం ఏమిటంటే 'నెమిసిస్'లో వేసిన అంచనాలన్నిటినీ శక్తివంచన లేకుండా ట్రంప్ నిజసాక్షాత్కారం చేస్తున్నారు.

"ఒక దేశం ప్రజాస్వామ్యంగానో, సామ్రాజ్యంగానో ఉండగలదు. ఏకకాలంలో రెండుగా ఉండలేదు".

"రిపబ్లిక్ వ్యవస్థ ఒకసారి సామ్రాజ్యంగా మారితే.. తిరిగి పూర్వస్థితికి చేరుకోలేని రీతిలో దాని పతనం మొదలవుతుంది".

"అధ్యక్షపదవి అనేది రాజ్యాంగబద్ధంగా ఉండటం కాకుండా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని స్థాపించే సంస్థగా మారిపోతుంది".

"సామ్రాజ్య ఆధిపత్యం కోసం చేసే ఖర్చులు కేవలం ఆర్థికపరమైనవే కావు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం నాశనం కూడా వాటిల్లో భాగమే".

"సామ్రాజ్యాలు తప్పనిసరిగా ప్రతిఘటనను సృష్టిస్తాయి".

"చరిత్ర చెబుతున్న నిజం ఏమిటంటే ఏ సామ్రాజ్యమైనా తన ప్రజల స్వేచ్ఛను నాశనం చేయకుండా ఎక్కువ కాలం ఉండలేదు".

నెమిసిస్‌లో చేసిన ఈ సూత్రీకరణల్లో ఇప్పటి పరిస్థితులకు పూర్తిగా పొసగనిది ఒక్కటి కూడా లేదని చెప్పలేం. తీవ్రతలో తేడా ఉండొచ్చు. అన్నీ ఏదోవిధంగా కళ్లముందు కదులుతూనే ఉన్నాయి. సుంకాలపేరుతో దేశాలన్నిటినీ దారికి తెచ్చేందుకు... తారెత్తించటానికి తాను తీసుకుంటున్న చర్యలకూ నిర్ణయాలకూ ఆమోదముద్ర వేయకపోతే పరిణామాలు తీవ్రంగానే ఉంటాయని సుప్రీంకోర్టును ఉద్దేశించి పరోక్షంగా, ప్రత్యక్షంగా ట్రంప్ చేస్తున్న హెచ్చరికలు చూస్తుంటే న్యాయవ్యవస్థ ఎంత ఒత్తిడులకు గురవుతోందో అర్థమవుతోంది. అలాగే చట్టసభల్లో చర్చల్లేకుండా, ఆమోదం లేకుండా డిక్రీలెన్నో జారీ అవుతున్నాయి. విదేశాంగ విధానాలను విమర్శించే వారందరిపై నిఘాలు తీవ్రమయ్యాయి. విశ్వవిద్యాలయాల్లో భావప్రకటనా స్వేచ్ఛపై కట్టడులు పెరిగిపోతున్నాయి. గాజా నరమేధాన్ని విమర్శించే వారందరినీ యూదు వ్యతిరేకులుగా ముద్రవేసి వేధించటమూ ఇంకా ముగియలేదు. ప్రసారమాధ్యమాలపై ఎదురుదాడులూ సాధారణమయ్యాయి. బయటదేశాలపై చూపిస్తున్న సామ్రాజ్యవాద పోకడలతో అంతర్గతంగా ప్రజాస్వామ్యం బలహీనమవుతున్న పరిణామాలకు ఇవన్నీ నిదర్శనాలు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్–మాగా) మార్చటానికంటూ చేపడుతున్న ప్రతిచర్యా సామ్రాజ్యవాద ధోరణులకు పెద్దపీట వేస్తుంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నోరెత్తలేని స్థాయికి చేరుకుంటున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాల నుంచీ, సంస్థల నుంచీ వైదొలగటమే కాకుండా అవన్నీ అమెరికా ప్రయోజనాలకు అడ్డంకిగా మారాయని పదేపదే విమర్శలు చేయటంతో ప్రపంచమే ఇటీవలకాలంలో ఎరగని రాజకీయ సంక్షోభంలోకి జారుకుంటోంది. 'మాగా' అనేది అసలుసిసలైన జాతీయవాదమనీ దానికి అనుగుణంగా చేపట్టే ఏ చర్యనూ విమర్శించకూడదనే వైఖరి ముదిరిపోతోంది. అందుకే వెనెజువెలాపై దాడినీ ఆ దేశ అధ్యక్షుడి అరెస్టునూ తప్పని చెప్పటానికి అమెరికాలోని ప్రధాన ప్రసార మాధ్యమాలన్నీ సంకోచించాయి.

> ప్రొఫెసర్ చాల్మర్స్ జాన్సన్ 19 ఏళ్లక్రితం 'నెమిసిస్' (కర్మఫలం) రాసే నాటికి డోనాల్డ్ ట్రంప్ రాజకీయాల్లో ఒక శక్తిగా మారతారనీ సమీప భవిష్యత్తులో అమెరికా అధ్యక్షుడు అవుతారనీ ఎవరూ భావించలేదు. విచిత్రం ఏమిటంటే 'నెమిసిస్'లో వేసిన అంచనాలన్నిటినీ శక్తివంచన లేకుండా ట్రంప్ నిజసాక్షాత్కారం చేస్తున్నారు.

దేశభక్తి, జాతిగొప్ప పేరుతో చరిత్రలో జరిగిన దారుణాలు అన్నీ ఇన్నీ కావు. జాతిగొప్ప పరిరక్షణ పేరుతో అసమ్మతిని అణచివేయవచ్చు. మైనారిటీలను దేశ వ్యతిరేకులుగా ముద్రవేయవచ్చు. మతాల్లోని చెడులను విమర్శించే వారిని దేశ సంస్కృతికి ద్రోహంచేసే మహాపాపులుగా చిత్రీకరించవచ్చు. జాతి ఆధిక్యత కోసం విదేశీ భూభాగాలపై అనుచితంగా హక్కులనూ కోరొచ్చు. ఖండాలపైనే సర్వాధిపత్యమూ తమదేనని చాటనూ వచ్చు. జాతిభద్రత కోసం గ్రీన్‌ల్యాండ్‌ను కట్టబెట్టాలన్న దాన్ని సహజ కోరికగానూ భావించొచ్చు. అక్కడి ప్రజల ఇష్టాయిష్టాలతో పనిలేదు. మీరు డబ్బులకు అమ్ముడు పొండి.. అని గద్దిస్తే మారుమాట్లాడటానికి వీల్లేదు. మీ తలలకు వెలలు కడతాం అంటే.. సార్వభౌమత్వాన్ని వదులుకోవాల్సిందే. జాతి గొప్ప భావనలతో ఊగిపోయే నేతలకు పర్యావరణం పట్టదు. ఆర్కిటిక్ మంచు మహాఫలకాలు కరిగిపోయి, జలప్రవాహాలు ఏర్పడి, కొత్త సముద్రమార్గాలు ఏర్పడుతుంటే ప్రాకృతిక విపత్తులుగా అవి అనిపించవు. ఖనిజాలు (25–34 రకాల విలువైనవి), చమురు అన్వేషణలకు భారీ అవకాశాలుగానే అవి కనపడతాయి.



■ రాహుల్ కుమార్

పర్యావరణ బీభత్సాన్ని ఎదుర్కోవాలన్న తపన ఏ కోశానా ఉండదు. మానవాళికి కలిగే సమష్టిముప్పు గురించి గ్రహింపు ఉండనే ఉండదు. పశ్చిమార్ధగోళంలో గ్రీన్‌ల్యాండ్ ఉంది కాబట్టి దానిపై సహజ ఆధిపత్యం అమెరికాకే దక్కాలని వాదిస్తారు. వలసపాలన (1820లు) నుంచి విముక్తమై అప్పుడప్పుడే స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న అమెరికాఖండ దేశాల్లో యూరపు సామ్రాజ్యశక్తుల జోక్యం వద్దని నిర్దేశించిన రెండువందల ఏళ్లనాటి మన్రో సిద్ధాంతాన్ని పైకితెచ్చి దానికి డొన్రో సిద్ధాంతంగా కొత్తపేరుపెట్టి పశ్చిమార్ధగోళంలోని ఏ భాగంలోనైనా సైనికంగా వేలుపెట్టే హక్కు ఉందనీ దర్జాగా ప్రకటిస్తారు.

కెనడా మినహా పశ్చిమార్ధగోళంలో అన్ని దేశాల్లోనూ ఎప్పుడో ఒకప్పుడు ఆధిపత్యం కోసం అమెరికా జోక్యం చేసుకుంది. ఇప్పుడా పరిస్థితి పోయింది. అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని ఆహ్వానాలనూ, ఆ తర్వాత అలా చేరితే మీకే మంచిదన్న హెచ్చరికలనూ కెనడా అందుకోవాల్సి వచ్చింది. అవమానభారంతోనూ ఆగ్రహంతోనూ ఉన్న కెనడా చైనాతో బహుముఖ ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోటానికి నడుంకట్టింది. ట్రంప్‌కు అది ఆగ్రహాన్ని తెప్పించింది. 100 శాతం సుంకాలు తప్పవన్న హెచ్చరిక వెంటనే జారీ అయ్యింది. ట్రంప్ ఆరోపిస్తున్నట్లుగా గ్రీన్‌ల్యాండ్ పరిసరాల్లో చైనా, రష్యాలు కొత్తగా కార్యక్రమాలను ముమ్మరం చేయలేదు. ఒకవేళ చేసినా వాటితో చర్చలు జరిపి అంగీకారానికి రావొచ్చు. ఆ పని చేయకుండా గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో కలిపివేయాలని డిమాండు చేయటమే అసంబద్ధంగా ఉంది. అమెరికాకు పక్కనే గ్రీన్‌ల్యాండ్ ఉంటే అలా కలపమనటానికి కనీసం అర్థమైనా ఉంటుంది. అలాస్కా నుంచి లెక్కవేసుకున్నా రెండు దేశాల మధ్య దూరం 3,952 కిలోమీటర్లు ఉంది. ఐక్యరాజ్యసమితి నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత ఇలా స్వయంప్రతిపత్తి ఉన్న ఒక ప్రాంతంపై అగ్రరాజ్యం సార్వభౌమిక ఆధిపత్యం కావాలని పట్టుపట్టటం ఇదే మొదటిసారి. నాటోలో సాటి సభ్యదేశం ప్రాదేశిక సమగ్రతను కాపాడాల్సిన అమెరికా దానికి వ్యతిరేకంగా వ్యవహరించటం, అందుకు యూరప్ యూనియన్ ససేమిరా అనటం అంతర్జాతీయ రాజకీయాలను సంక్షోభంలోకి నెట్టివేస్తోంది. నిజానికి 1951లో అమెరికా–డెన్మార్క్ మధ్య కుదిరిన ఒప్పందంతో అవసరమనుకుంటే అక్కడ సైనిక బలగాన్ని పెంచే అవకాశం ఉంది. అందులో భాగంగానే ఒకప్పుడు అక్కడ పదివేల మంది అమెరికన్ సైనికులు ఉండేవారు. 1990ల నుంచి ఆ సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం అక్కడ 200 మంది మాత్రమే ఉన్నారు. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత నాటో దేశాలకు రష్యా నుంచి ముప్పు ఉండదని గ్రహించిన తర్వాతే అక్కడ బలగాలను తగ్గించారు. నిజానికి జర్మనీ ఏకీకరణ సమయంలో తూర్పు యూరపులో ఒక్క అడుగు కూడా నాటో విస్తరణ ఉండదని ఇచ్చిన హామీని విస్మరించటంతో రష్యానే అభద్రతలోకి వెళ్లింది. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ఇదీ ఒక కారణమే.

చైనాకు దగ్గర అవుతుందనే ఆలోచనతో వెనెజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడిని అరెస్టు చేసి అమెరికాకు తీసుకువెళ్లారు. ఆ దేశ చమురు, సహజవాయువు వ్యవహారాలను నియంత్రించటమే తమ అసలు లక్ష్యమని కూడా అమెరికా నేతలు ప్రకటించారు. ఇక ఆర్కిటిక్ ప్రాంతానికి తాము దగ్గరవుతున్నట్లుగా పేర్కొంటూ 'పోలార్ సిల్క్ రోడ్' అనే భావనను విపులీకరిస్తూ చైనా 2018లో ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. నిజానికి ఆర్కిటిక్ ప్రాంతం చైనాకు చాలా దూరం. రష్యాకు మాత్రం దగ్గర. రష్యాతో కలిసి చైనా ఆ ప్రాంతంలో కార్యకలాపాలకు పాల్పడుతుందనే భావన ఆ శ్వేతపత్రంతో కలిగింది. అప్పటి నుంచి గ్రీన్‌ల్యాండ్‌ను చేజిక్కించుకోటానికి అమెరికా పావులను వేగంగా కదుపుతోంది.

పరోక్షంగా, ప్రత్యక్షంగా ఎన్నో దేశాల్లో సైనికంగా జోక్యం చేసుకుని, తిరుగుబాట్లకు ఊతమిచ్చిన అమెరికా ఒకప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ, కమ్యూనిస్టు ప్రాబల్య నియంత్రణ పేరుతో వాటిని సమర్థించుకునేది. ఇప్పుడు ఆ సమర్థనలూ లేవు. ఆ ప్రజాస్వామ్య ఆదర్శ ప్రకటనలూ లేవు. తాను ప్రధాన భాగస్వామిగా ఉండి సృష్టించిన అంతర్జాతీయ సంస్థలనూ, ఏర్పరిచిన నిబంధనలనూ, రూపొందించిన చట్టాలనూ కాలదన్నుతూ తన ఆధిపత్యానికి అడ్డుగా ఉన్నాయని భావిస్తున్న అన్నిటినీ తోసిపుచ్చటమే ప్రవృత్తిగా మారుతోంది. అందుకే రెండో ప్రపంచయుద్ధం (1945) అనంతరం ఏర్పడిన అంతర్జాతీయ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడిపోతోందంటూ ఎన్నో వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి.

> విపరీత అధికారాలను చలాయించే నేతలను నియంత్రించలేని అశక్తతకు పలుదేశాల్లో వ్యవస్థలన్నీ చేరుకుంటున్నాయి. ఒక వ్యవస్థ దారితప్పితే మరో వ్యవస్థ పరిస్థితిని చక్కదిద్దటం తగ్గిపోతోంది. సామాజిక మాధ్యమాల ఆసరాతో, జనాకర్షణ నినాదాలతో ప్రజాస్వామ్య పద్ధతులను ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చి, వాటికే ఎసరుపెట్టటం పెద్దస్థాయిలో మొదలైంది. 'నేనే ప్రజాస్వామ్యం.. ప్రజాస్వామ్యమే నేను' అనే నియంతృత్వ పోకడ 1945 ముందునాటి ప్రపంచానికి మనల్ని తీసుకువెళుతున్న దృశ్యం లీలామాత్రంగా ప్రస్తుతం కనపడుతోంది.

విపరీత అధికారాలను చలాయించే నేతలను నియంత్రించలేని అశక్తతకు పలుదేశాల్లో వ్యవస్థలన్నీ చేరుకుంటున్నాయి. ఒక వ్యవస్థ దారితప్పితే మరో వ్యవస్థ పరిస్థితిని చక్కదిద్దటం తగ్గిపోతోంది. జనాకర్షణ నేతలు ప్రజాస్వామ్యానికి బలం అనుకునే రోజులూ పోతున్నాయి. సామాజిక మాధ్యమాల ఆసరాతో, జనాకర్షణ నినాదాలతో ప్రజాస్వామ్య పద్ధతులను ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చి, వాటికే ఎసరుపెట్టటం పెద్దస్థాయిలో మొదలైంది. 'నేనే ప్రజాస్వామ్యం.. ప్రజాస్వామ్యమే నేను' అనే నియంతృత్వ పోకడ 1945 ముందునాటి ప్రపంచానికి మనల్ని తీసుకువెళుతున్న దృశ్యం లీలామాత్రంగా ప్రస్తుతం కనపడుతోంది. అది బలపడితే జరిగేది ఆనాటి ఘోర చరిత్ర పునరావృతమే! సామ్రాజ్యాలు తప్పనిసరిగా ప్రతిఘటననూ సృష్టిస్తాయని జాన్సన్ చెప్పినదే నిజమైతే ఆశనిరాశల్లో మొదటిదానికే మనం మొగ్గుతాం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విశ్వాసాన్ని వైద్యాన్ని కలిపితేనే..!

జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 2019 నుంచి ఉత్తరప్రదేశ్‌లో 'దవా సే దువా తక్' (ఔషధం నుంచి ప్రార్థన దాకా) అనే కార్యక్రమం నడుస్తోంది. దేశంలో అధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌లో మానసిక రుగ్మతలతో ఆత్మహత్యలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. కొన్ని ప్రత్యేక మానసిక వ్యాధులు ఉన్నవారిని వారి కుటుంబీకులు ఆసుపత్రులకు తీసుకెళ్లకుండా మతపరమైన స్థలాల (చర్చి, గుడి, దర్గా)కు తీసుకువెళుతుంటారు. అక్కడ మంత్రం, తాయెత్తు లేదా ప్రార్థనల ద్వారా చికిత్స చేస్తారు. ఈ 'దవా సే దువా తక్' కార్యక్రమంలో ముజావర్ల (ప్రీస్టులు)కు శిక్షణ ఇచ్చి, వారి సహకారంతో అక్కడే మానసిక ఆరోగ్య నిపుణులు క్యాంపులు నిర్వహించి మందులు, వైద్య చికిత్స కూడా అందిస్తారు. ఇది గుజరాత్, తమిళనాడులో అమలవుతున్న ఫెయిత్–బేస్డ్, మెడికల్ ఇంటిగ్రేషన్ మోడల్. మూర్ఛరోగం, ఇతర మానసిక రుగ్మతలకు ఈ క్యాంపుల్లో సైకియాట్రిస్ట్‌లతో అవగాహన కల్పించి రోగులను తర్వాతి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రులకు పంపిస్తారు. గుజరాత్‌లోని మీరా దాతార్ దర్గాలో ఈ మోడల్ క్లినిక్‌ను 2008లోనే ప్రభుత్వం ఎన్జీవోల సహకారంతో ప్రారంభించింది. 2014 నుంచి ఇదే పద్ధతిలో తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఎర్వాడి దర్గా



> దేవుడూ దెయ్యమూ లేవు, వాటి ఆధారంగా వైద్యం ఏమిటని కొందరు అనవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని తిరస్కరించడం కంటే, దానిని వైద్యంతో కలపడమే సరైనది. దైవంపై నమ్మకం ఉన్నవారికి 'దవా–దువా' రెండింటి సమతుల్యమే నిజమైన చికిత్స.

అనుబంధ క్లినిక్‌లో రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. ఇక్కడ సైకియాట్రిస్టులు, నర్సులు, సోషల్ వర్కర్లు మతపరమైన నమ్మకాలను గౌరవిస్తూ, ప్రార్థనలతో పాటు మందులు, కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ ప్రదేశాల్లో వేలాది మంది చికిత్స పొందుతున్నారు. ఇక్కడ గొలుసులతో బంధించే పద్ధతి దాదాపు పోయింది. ఈ కార్యక్రమం చికిత్సను సులభతరం చేస్తోంది.

దేవుడూ దెయ్యమూ లేవు, వాటి ఆధారంగా వైద్యం ఏమిటని ప్రశ్న రావడం సహజమే. కానీ ప్రజల విశ్వాసాన్ని తిరస్కరించడం కంటే, దానిని వైద్యంతో కలపడమే సరైనది. దైవంపై నమ్మకం ఉన్నవారికి 'దవా–దువా' రెండింటి సమతుల్యమే నిజమైన చికిత్స. మన జీవితం మొత్తం భక్తి, కుటుంబం, నమ్మకాల చుట్టూ తిరుగుతుంటుంది. చిన్నప్పటి నుంచే 'దేవుడు ఉన్నాడు', "అన్నీ ఆయన చూస్తాడు" అని నేర్పిస్తారు. ఏదైనా కష్టం వస్తే "ఇది దేవుడు పెట్టిన పరీక్ష" అని మనల్ని మనమే ఓదార్చుకుంటాం. నిజమే, ఈ నమ్మకం మనిషిని నిలబెడుతుంది. ప్రార్థన, జపం, ధ్యానం ఇవన్నీ మనలో ప్రశాంతతను కలిగిస్తాయి. శాస్త్రం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. ప్రార్థన చేస్తున్నప్పుడు మెదడులోని ప్రీఫ్రంటల్ కార్టెక్స్ చురుకుగా మారుతుంది. అది మనల్ని శాంతంగా ఉంచుతుంది. అమీగ్డాలా అనే భాగం ప్రశాంతత పొందినప్పుడు స్ట్రెస్ తగ్గుతుంది. సెరోటోనిన్, డోపమైన్ వంటి 'హ్యాపీ కెమికల్స్' పెరిగి మనసు తేలికగా ఉంటుంది. అందుకే ప్రార్థన తరువాత మనసూ శరీరం కూడా తేలికపడినట్టు అనిపిస్తుంది. ఇదేమీ ఊహ కాదు, శాస్త్రీయమైన మార్పు.

మన సమాజంలో 'దైవ చికిత్స' అనేది ఒక పెద్ద భాగం. చాలా కుటుంబాలు సమస్యలతో ముందుగా దేవాలయాలు, మసీదులు, జ్యోతిషుల దగ్గరకే వెళ్తాయి. అయితే దృష్టి, పాప ప్రతిఫలం అనుకుంటూ కొందరు మందులు వాడరు. మానసిక ఆరోగ్యం విషయంలో భక్తి మనసుకు బలం ఇవ్వవచ్చు, కానీ వైద్యానికి ప్రత్యామ్నాయం కాదు. భక్తి మనసుకు బలం అయితే, వైద్యం మనసుకు ఉపశమనం. మసీదు, చర్చి, దేవాలయం దగ్గరే మానసిక ఆరోగ్య బూత్‌లు ఏర్పాటు చేయడం వల్ల రోగులు ప్రార్థన చేస్తూనే కౌన్సెలింగ్ కూడా తీసుకుంటారు. మంచి కుటుంబం, ప్రార్థన, వైద్యం ఈ మూడు కలిసి ఉన్నప్పుడు రోగులు వేగంగా కోలుకుంటారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా మానసిక రుగ్మతల విషయంలో ఈ తరహా వైద్య విధానంపై చర్చ జరగాలి.

● డా. సనా కౌసర్
ఎండీ, సైకియాట్రీ

కారుణ్య నియామకాలు అవసరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోంది. మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ప్రభుత్వ సంకల్పం ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది. వీటితో పాటు ఈ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కలిగించే చర్యలు కూడా అవసరం. ముఖ్యంగా సర్వీస్ రూల్స్ అమలు, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ వంటి అంశాలు ఎంతో కీలకం. అదేవిధంగా, కారుణ్య నియామకాలు కూడా మానవీయమైన, కీలకమైన విషయం. సిబ్బంది మృతిచెందిన సందర్భాల్లో, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించే అవకాశం ప్రస్తుతం లేకపోవడం తీవ్ర ఆవేదనను కలిగిస్తోంది. కారుణ్య నియామకాల అమలుకు అవసరమైన అన్ని రకాల చట్ట సవరణలు, నిబంధనల సడలింపు వంటి అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకొని అమలు చేయాలి.

– బి.సురేష్

శునకాలపై ప్రేమ.. మరి మనుషులపై?

జీవకారుణ్యం– భారతీయ సంస్కృతికి కొత్త విషయం కాదు. ఓ దేవతకు మేకను బలి ఇవ్వబోతున్న కొందరిని చూసి.. దానిని వదిలేయాలని, అంతగా అయితే తనను బలి తీసుకోవచ్చని గౌతమ బుద్ధుడు దాదాపు 2,600 ఏళ్ల కిందటే చెప్పిన చరిత్ర మనది. తనను వేటాడుతున్న డేగ నుంచి కాపాడమని ఓ పావురం శిబి చక్రవర్తిని ఆశ్రయిస్తే.. ఆ పావురానికి సమానమైన బరువున్న మాంసాన్ని తన తొడ నుంచి కోసి డేగకు ఇచ్చిన శిబి చక్రవర్తి కథ మన పురాణాల్లో ఉంది. అరణ్యాలను రక్షించుకోవటానికి 1970ల నాటి చిప్కో ఉద్యమకారులు చెట్లను ఆలింగనం చేసుకొని.. వాటిని కూల్చే ముందు తమను నరికివేయాలని సవాల్ విసిరారు. కానీ, నేడు జంతు ప్రేమికులు, ముఖ్యంగా కొందరు కుక్కల ప్రేమికుల ధోరణి చూస్తుంటే.. తమ ప్రాణాలు అడ్డుపెట్టటం అటుంచి.. సాటి మనుష్యుల ప్రాణాలు పోయినా ఫర్వాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి వాదనలు, మాటలు వింటుంటే అలాంటి అభిప్రాయమే కలుగుతోంది.

వీధి కుక్కల దాడుల్లో అత్యంత దారుణంగా చిన్న పిల్లలు గాయపడుతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. పెద్దలూ కుక్కల దాడికి గురవుతున్నారు. వీధుల్లో రాత్రి పూట సంగతి దేవుడెరుగు.. పగటి పూట నడిచి వెళ్లాలన్నా కుక్కల మందలను చూసి జంకే పరిస్థితి నెలకొంది. నైట్‌షిఫ్టు ఉండే మీడియా, ఐటీ, డెలివరీ వంటి ఉద్యోగులైతే.. ఏ అర్ధరాత్రో ఇంటికి వెళ్తున్నప్పుడు కుక్కల భయానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గత ఐదేళ్లలో ఒక్క తెలంగాణలోనే కుక్క కాటు బాధితులు 14,88,781 అని రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది. తెలంగాణలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామాల్లోని ప్రజలు.. కుక్కల బెడదను తప్పించాలని అభ్యర్థులను కోరారు. ఏపీలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వీధి కుక్కల సమస్య ఓ సామాజిక సమస్యగా మారింది. దీనికి బలవుతున్న వారిలో అత్యధికులు నిరుపేదలు, దిగువ మధ్యతరగతివారు. ఇంటి చుట్టూ ప్రహరీ కట్టుకోలేని గుడిసె వాసి తన పిల్లల్ని కుక్కల బారి నుంచి ఎలా కాపాడుకోగలడు? ఈ సమస్యపై ఇన్నాళ్లకు సుప్రీంకోర్టు దృష్టి పెట్టి.. బడులు, ఆస్పత్రులు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి పబ్లిక్ ప్లేసుల్లో వీధి కుక్కలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను ఆదేశిస్తే.. దానికి వ్యతిరేకంగా బోలెడు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇటీవల విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు జడ్జిల్లో ఒకరు.. వీధి కుక్కల గురించి వాదించే లాయర్లు కోర్టు హాల్లో ఇంతమంది ఉన్నారుగానీ.. మనుష్యుల ప్రాణాల గురించి వాదించేవారు మాత్రం కనిపించటం లేదని ఆశ్చర్యపోయారు.

> అరణ్యాలను రక్షించుకోవటానికి చిప్కో ఉద్యమకారులు చెట్లను ఆలింగనం చేసుకొని.. వాటిని కూల్చే ముందు తమను నరికివేయాలని సవాల్ విసిరారు. కానీ, నేడు జంతు ప్రేమికుల ధోరణి చూస్తుంటే.. తమ ప్రాణాలు అడ్డుపెట్టటం అటుంచి.. సాటి మనుష్యుల ప్రాణాలు పోయినా ఫర్వాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.



విచిత్రమేమిటంటే, కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న వాళ్లు, గాయపడుతున్నవాళ్లు ప్రభుత్వాలకు పన్ను కడుతున్న ప్రజల్లో ఓ భాగం. అంటే ప్రభుత్వాల్ని, ప్రభుత్వ పథకాల్ని వారు పోషిస్తున్నారు. ఓటు వేసి ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నారు. కానీ, వారి ప్రాణాలకు కుక్కల దాడుల నుంచి ఎటువంటి హామీ లేదు. ఏ పన్నూ కట్టని వీధి కుక్కల ప్రాణాలకు మాత్రం జంతు సంరక్షణ చట్టాలున్నాయి. కుక్కను కొడితే కేసు, ప్రాణం తీస్తే కేసు, జైలుశిక్ష. కుక్కలపై దాడి చేసిన వ్యక్తిని చట్టాల ప్రకారం శిక్షిస్తున్నారు. మరి, వీధి కుక్క దాడి చేసి ఓ చిన్న పిల్లాడిని చంపినప్పుడో, అనేక మందిని కరిచినప్పుడో ఎవరినీ శిక్షించటం లేదేం? కుక్కల నుంచి మనుష్యులను రక్షించే చట్టాలు ఉండొద్దా? కుక్క దాడి చేసినప్పుడు శిక్ష ఎవరికి విధించాలి? ఆ కుక్కకా? కుక్కల ప్రేమికులకా? వీధి కుక్కల దాడిలో గాయపడినవారికి ప్రభుత్వాలు, జంతుప్రేమికులు పరిహారం ఇవ్వాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'వీధి కుక్కల మీద అంత ప్రేమ ఉంటే ఇళ్లలోకి తీసుకెళ్లి పెంచుకోండి' అని సూచించింది. కుక్కల ప్రేమికులు ఈ బాధ్యత ఎందుకు తీసుకోరు? కుక్కలపై వారి ప్రేమ కోసం అమాయక చిన్నారులు, జనం తమ ప్రాణాలతో మూల్యం చెల్లించాలా?

వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించి, ఎక్కడి నుంచైతే వాటిని తీసుకెళ్లారో అదే ప్రాంతంలో తిరిగి విడిచిపెట్టాలని కుక్కల ప్రేమికులు చెబుతుంటారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం కూడా ఇదే. దీంట్లో ఉన్న సమస్య ఏమిటో చూద్దాం. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో జనాభా నియంత్రణ కోసం సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించుకోవాలని ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. ఆ ప్రచారం ప్రజలను చేరి, ఫలితాలు రావటానికి దశాబ్దాలు పట్టింది. అది కూడా దక్షిణాది రాష్ట్రాల్లోలాగా ఉత్తరాదిన సమర్థవంతంగా అమలు కాలేదు. మనుష్యుల్లోనే ఈ పరిస్థితి ఉంటే కుక్కల్లో సంతాన నిరోధక ఆపరేషన్లు పూర్తిగా అమలయ్యేది ఎప్పుడు? ఒకవేళ అమలైనా.. ఒక్కో కుక్క జీవితకాలం సగటున పదేళ్లు అనుకుంటే.. ఈ పదేళ్లపాటు అది అప్పుడప్పుడు కరిచినా, చిన్నారుల్ని చంపినా భరించాల్సిందేనా? కుక్కల ప్రేమికుల వాదన ప్రకారం.. వాటికీ జీవించే హక్కు ఉంది. నిజమే! మరి, మనుష్యులకూ ఉంది కదా. కుక్కల ప్రేమికుల మరో వాదన.. 'డెంగ్యూ వంటి దోమకాటు వ్యాధుల్లో, రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది జనం మరణిస్తున్నారు.. వాటి మీద మాట్లాడకుండా వీధి కుక్కల మీదే ఎందుకు ఫోకస్ చేస్తున్నారు?' అన్నది. దీనికి సమాధానం– ప్రతి ఆదివారం మన దేశంలో కొన్ని కోట్ల కోళ్లు, మేకలు ప్రాణాలు కోల్పోయి.. మనుష్యుల ఆహారంగా మారిపోతాయి కదా.. మరి, మాంసాహారాన్ని నిషేధించాలని జంతు ప్రేమికులు ఉద్యమించగలరా? కుక్కల ప్రాణాలకే ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు?!

ఊహా ప్రపంచంలో (ఉటోపియాలో) ఉంటే వాస్తవ ప్రపంచంలో జీవించగలమా? మన దేశంలో, మన రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులేమిటన్నదాన్ని బట్టి కదా ఏదైనా సమస్యకు పరిష్కారాలు ఆలోచించాల్సింది. తీవ్రమైన సామాజిక సమస్యగా మారిన వీధి కుక్కలకు ప్రాక్టికల్ పరిష్కారాలేమిటి? సంతాన నిరోధక ఆపరేషన్లా? బహిరంగస్థలాల నుంచి తొలగించి షెల్టర్లలో పెట్టటమా? లేక, వెనకటి రోజుల్లోలాగా ఏడాదికోసారో రెండుసార్లో మునిసిపల్ సిబ్బంది వీధి కుక్కలను సామూహికంగా నిర్మూలించటమా?.. దీనిపై విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. జనం ప్రాణాల్ని వీధి కుక్కల బారి నుంచి రక్షించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి.

■ కె.రవికుమార్





అమరావతి: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం దంపతులు

10 సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్

- ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యం
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, మౌలిక వసతులపై దృష్టి
- వ్యర్థ రహిత, స్వచ్ఛగ్రామాల సాధనకు కృషి
- సరస్ మేళాతో రూ.25 కోట్ల వ్యాపారం
- వేగంగా తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం
- కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా
- పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు



జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్



మహిళ హెల్ప్‌లైన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



తెనాలి: కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మంత్రి మనోహర్



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్ట్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు



విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు



గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన



గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనలో భాగంగా 10 ప్రధానమైన సూత్రాలను జిల్లాలో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. పేదరికం లేని స్థితి, ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వృద్ధి, సామాజిక భద్రత, ఆరోగ్యం, విద్య, నీటి భద్రత, సుపరిపాలనపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించామన్నారు. వీటితో సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జిల్లాగా మార్చాడానికి ప్రణాళికలు రూపొందిచడం జరిగిందన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సోమవారం మధ్యాహ్నం గుంటూరు నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఘనంగా జరిగింది. కలెక్టర్ అన్సారియా జాతీయ పతాకాన్ని ఎగురవేసి, రక్షణ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. రాబోయే నాలుగేళ్లలో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి 15 శాతం వృద్ధి రేటు సాధించేలా జిల్లా తన వంత కీలక భూమిక పోషిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, గ్రామాలను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు.

పథకాలతో ప్రగతి..

దీపం-2 పథకం కింద 2025 ఏప్రిల్ - జూలై రెండో బ్లాక్ పీరియడ్‌లో 3,98,512 మంది గ్యాస్ వినియోగదారులకు సిలిండర్లు పంపిణీ చేసి.. 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో రూ.33.5 కోట్ల సబ్సిడీ జమ చేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 1.42 లక్షల మందికి శస్త్రచికిత్సలు చేయించి, జీజీహెచ్‌లో రూ.100 కోట్లతో జింకాన ద్వారా ఎంసీహెచ్ బ్లాకు నిర్మించామన్నారు. దీనిని సీఎం చంద్రబాబు ఈ నెల 30న ప్రారంభించనున్నారని తెలిపారు. అమృత్ 2.0, యూఐడీఎఫ్ పథకాల కింద గుంటూరు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి పట్టణాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు రూ.939 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇటీవల డీఆర్‌డీఏ ద్వారా నిర్వహించిన జాతీయ సరస్ మేళాలో రూ.25 కోట్లకు పైగా విక్రయాలు జరిగి పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధి మెరుగుపడిందని కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా ప్రతి నెల 2.55 లక్షల మందికి రూ. 111.24 కోట్లు ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో 72 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన తాగునీటి పథకాన్ని రూ.393.74 కోట్ల అంచన వ్యయంతో చేపట్టడం జరిగిందన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ స్త్రీశక్తి పథకం ద్వారా ఈ నెల 18 నాటికి 291 బస్సుల్లో సుమారు 1.56 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, దీనికి రూ.51.45 కోట్లు ప్రభుత్వం రాయితీగా చెల్లించిందన్నారు. భూముల రీసర్వే ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 86 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయిందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ వాహనాన్ని కలెక్టర్ అన్సారియా ఈ సందర్భంగా జెండా ఊపి ప్రారంభించారు. అమరావతి రాజధానిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు కలెక్టర్ వెళ్లడంతో మధ్యాహ్నం 12.40 గంటలకు జెండా వందనం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనల కోసం మేకప్‌తో వచ్చిన విద్యార్థినులు ఎండ, ఉక్కపోతలో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఇళ్లకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, జేసీ శ్రీవాస్తవ, కమిషనర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఖాజావలి, అదనపు కమిషనర్ ఓబులేసు, గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, అటవీశాఖ అధికారి హిమశైలజ, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు పాల్గొన్నారు.



- ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

ఇటీవలే ఓటీ రక్షక్ వాహనంలో విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందిన బలరాం రెడ్డి తల్లి, వీరమాత విజయలక్ష్మిని కలెక్టర్ సన్మానించారు. ఉత్తమ సేవలకు గాను.. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఎస్వో కోమలి పద్మ, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, ఉద్యానశాఖ అధికారి బి.రవీంద్రబాబు, హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్‌కేవీ ప్రసాదు, ఇరిగేషన్ ఎస్ఈ పి.వెంకటరత్నం, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, మెప్మా పీడీ వి.విజయలక్ష్మి, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీపీవో బీవీ నాగసాయికుమార్, డ్వామా పీడీ వి.శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తి, సర్వే అధికారి ఎ.పవన్‌కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్యకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరితో పాటు మరో 300 మందికి పైగా ఉద్యోగులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.





విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గణతంత్ర వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సెయింట్ లారెల్స్, ఆర్ట్ ఆఫ్ నటరాజ, శారద నికేతన్ విద్యార్థుల ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి.





కార్యక్రమాలను తిలకిస్తున్న అధికారులు, ప్రజలు



కొర్రీల ఫలితం.. తగ్గిన సంతృప్తి



ఖరీఫ్ సీజన్‌కు రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ

- అయినా అన్నదాతల్లో అసంతృప్తి
- దిగువ నుంచి 4వ స్థానంలో బాపట్ల
- ప్రజా సర్వేలో వెల్లడి

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

గడచిన ఆరేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దానిలో భాగంగా ఇప్పటి వరకు 1,39,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. దాదాపు రూ.320 కోట్లు.. 22 వేల మంది రైతుల ఖాతా ల్లో గంటల వ్యవధిలోనే ప్రభుత్వం జమ చేస్తోంది. అయినా.. దీనిపై అన్నదాతల్లో అంతగా ఆమోదం లభించడం లేదు. ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఇటీవల పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పేరిట ఓ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం ధాన్యం సేకరణలో బాపట్ల జిల్లా 62.8 శాతం ఆమోదంతో దిగువ నుంచి 4వ స్థానంలో ఉండడం విస్మయ పరిచింది. అదేవిధంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఆశించిన స్థాయిలో రైతుల నుంచి మద్దతు లభించలేదు. ఈ అసంతృప్తి కి ప్రధాన కారణం నిబంధనల కొర్రీలే నని తెలుస్తోంది. సేకరణలో క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై మరింతగా దృష్టి పెట్టాలని ఈ సర్వే శాతాలు తేట తెల్లం చేస్తున్నాయి.

ఎక్కడ లోపం..

కొనుగోళ్లకు సంబంధించి ఓసారి ఆర్ఎస్కేల్లో ట్రక్‌షీట్ జనరేట్ చేసిన (మిగతా 8వ పేజీలో)

స్థానిక నేతల అతి జోక్యం

ధాన్యం సేకరణ ప్రక్రియపై నెల రోజుల ముందే డేటా ఎంటీ ఆపరేటర్ (డీఈవో), టీఏ (టెక్నికల్ అసిస్టెంట్)సిబ్బందికి ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. ఆయా కేంద్రాల్లో కొనుగోళ్ల అంకం సజావుగా జరిగే విధంగా వీరిని సమా యత్తం చేస్తుంది. కానీ, తీరా కేంద్రాల్లో సేకరణ ప్రారంభమయ్యాక శిక్షణ ఇచ్చిన వారిని తొలగించి స్థానిక నేతల సిఫారసులతో ఏమాత్రం అవగాహన లేని వారిని డీఈవో, టీఏలుగా కూర్చొబెట్టడంతో కొన్ని చోట్ల ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యంగా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో ఇలాంటివి వెలుగుచూశాయి. స్థానికంగా ఉండే దళారీలతో పాటు మిల్లర్లతో వారు అవగాహనకు వచ్చి ఇష్టారీతిన శాతాలతో ట్రక్ షీట్లు జనరేట్ చేయడాన్ని కూడా అన్నదాతలు గతంలోనే తప్పుపట్టారు. క్షేత్రస్థాయి లోని ఈ బాలారి ష్టాలన్నీ తోడవడంతోనే రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణ దిశగా వేగంగా అడుగులు పడుతున్నప్పటికీ సంతృప్తి స్థాయిలో మాత్రం దిగువనే ఉంది.


నష్టపోకుండా సకాలంలో స్పందించారు

మంత్రి మనోహర్ వద్ద రైతన్నల ఆనందం

తెనాలి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నష్టం కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేశారని పలువురు రైతులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. రూరల్ మండలం కంచర్లపాలెంలో సోమవారం రాత్రి గ్రామ రైతులతో మంత్రి సమావేశమయ్యారు. ధాన్యం నూర్పిడి సమయంలో కురిసిన అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో.. అధికారులను ఆదేశించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. డెల్టాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి అధికారులను క్షేత్రస్థాయికి పంపడం వల్ల ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోగలిగామని చెప్పారు. టార్పాలిన్ పట్టాలు కూడా ఇచ్చి ఆదుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ముందుగానే అధికారులను సన్నద్ధం చేశామని, దీంతో ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు మేలు జరిగిందన్నారు. అయితే కొంతమంది రైతుల నుంచి ధాన్యం వ్యాపారులు కొన్నాక ధర పెరగడం దురదృష్టకరమన్నారు. అనంతరం రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రితో మాట్లాడుతున్న రైతు



ఏసు నామమే స్వస్థత
- దేవుని సహవాసమే శాంతి మార్గం
- మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్
8

పదకొండేళ్ల బాలికపై అత్యాచారం
6

అగ్రశ్రేణి డెయిరీలతో సంగం పోటీ

● చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర



సంగం ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అగ్రశ్రేణి సంస్థలతో సంగం డెయిరీ పోటీ పడే విధంగా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. గుంటూరు జిల్లా సంగం డెయిరీలో సోమవారం 10 నూతన ఉత్పత్తులను ఛైర్మన్ నరేంద్ర కుమార్‌కుమార్ మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగం డెయిరీ లక్షలాది రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న సంస్థ అన్నారు. వినియోగదారుల అభివృద్ధిలో ఆరోగ్యానికి అనుగుణంగా ఉత్పత్తులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. షుగర్ లెస్ కళాకండ్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాబోయే రోజుల్లో హైప్రోటీన్ యోగర్ట్, మిల్క్ షేక్, ప్రోబయోటిక్ యోగర్ట్, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ పి.గోపాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు, డెయిరీ అధికారులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం తెలిసిందనే భర్త హత్య

● చిలువూరు హత్య కేసును వివరించిన ఎస్పీ

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే భార్య పథకం ప్రకారం ప్రియుడు, అతని స్నేహితునితో కలిసి భర్తను కడతేర్చింది. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఈ నెల 18న రాత్రి.. లోకం శివ నాగరాజును హత్య చేసిన కేసులో అతని భార్య లక్ష్మీమాధురి, ప్రియుడు కొండవీటి గోపి, స్నేహితుడు ఆర్ఎంపీ కంభంపాటి సురేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి, కేసు వివరాలు వెల్లడించారు. చిలువూరుకి చెందిన లోకం శివ నాగరాజుకు, కృష్ణా జిల్లాకు చెందిన లక్ష్మీమాధురికి 2008లో వివాహం జరిగింది. వారికి ఇరువురు కుమారులు సంతానం. శివనాగరాజు ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. గతంలో లక్ష్మీమాధురి విజయవాడలోని ఓ థియేటర్లో పనిచేసింది. ఈ సమయంలో అక్కడ పనిచేస్తున్న సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన కొండవీటి గోపితో పరిచయం ఏర్పడింది. మూడేళ్లుగా వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇద్దరూ థియేటర్లో పని మానేశారు. ఆ తర్వాత గోపి హైదరాబాదులో కారు ట్రావెల్స్ ప్రారంభించాడు. లక్ష్మీమాధురి ద్వారా ఆమె భర్తకు గోపి పరిచయం అయ్యాడు. కొంత కాలం హైదరాబాదులో గోపి ట్రావెల్స్‌లో భర్త శివ నాగరాజును ఆమె చేర్పించింది. కొద్దిరోజులు అక్కడ పని చేసిన తర్వాత శివనాగరాజు మానేసి తిరిగి ఇంటికి వచ్చేసాడు. తిరిగి ఉల్లిపాయల వ్యాపారం ప్రారంభించాడు. తన భార్యకు గోపితో వివాహేతర సంబంధం ఉన్న విషయం నెల రోజుల క్రితం భర్త శివ నాగరాజుకు తెలిసింది. అప్పటి నుంచి భార్యను వేధించడం తీవ్రం చేశాడు. అంతేకాకుండా హైదరాబాదులోని గోపి ట్రావెల్స్ కస్టమర్స్, సిబ్బందికి ఫోన్ చేసి గోపి తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని చెప్పడం ప్రారంభించాడు. గోపిని కూడా బెదిరించే విధంగా మాట్లాడేవాడు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని భార్య లక్ష్మీమాధురి నిర్ణయించుకుంది. గోపి కూడా లక్ష్మీమాధురికి జత కలిశాడు. శివ నాగరాజును చంపడానికి మత్తుమందు పెట్టాలనుకున్నారు. తనకు స్నేహితుడు ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడుకు చెందిన ఆర్ఎంపీ కంభంపాటి సురేష్‌ని సంప్రదించాడు. సురేష్ అందుకు అవసరమైన మత్తు బిళ్లలు సేకరించాడు. గోపి, సురేష్ ఈ నెల 18న రాత్రి చిలువూరు చేరుకున్నారు. తమ వెంట తీసుకువచ్చిన మత్తు బిళ్లను లక్ష్మీమాధురికి ఇవ్వగా.. ఆమె ఇంట్లో బిర్యానీ వండి అందులో కలిపి భర్తకు పెట్టింది. శివ నాగరాజు మత్తులోకి జారుకున్నాక.. అర్ధరాత్రి గోపి, సురేష్ శివనాగరాజు ఇంటికి చేరుకున్నారు. ఒకరు శివ నాగరాజు కాళ్లు, మరొకరు చేతులు పట్టుకున్నారు. ఇంకొకరు చాతిపై కూర్చుని దిండు ముఖంపై పెట్టి ఊపిరి ఆడకుండా గట్టిగా నొక్కి చంపేశారు. అనంతరం గోపి, సురేష్ వెళ్లిపోగా తెల్లవారుజామున సుమారు నాలుగున్నర గంటల సమయంలో భార్య లక్ష్మీమాధురి చుట్టుపక్కల వాళ్లను నిద్రలేపి తన భర్త గుండెపోటుతో మృతి చెందాడంటూ గగ్గోలు పెట్టి, సాధారణ మరణంగా నమ్మించే ప్రయత్నం చేసింది. స్థానికులు గుండెపోటు మరణంగానే భావించారు. అయితే శివ నాగరాజు చెవి వెంట రక్తం రావడంతో బంధువులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టంలో శివ నాగరాజు రిబ్స్ విరిగిపోయి ఉండడం, అతనిపై బల ప్రయోగం జరిగిన ఆనవాళ్లు కనిపించడంతో హత్యగా నిర్ధారించారు. దీంతో పోలీసులు లక్ష్మీ మాధురిని అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య వ్యవహారం వెలుగు చూసింది. దీంతో శివ నాగరాజు హత్య కేసులో నిందితులైన లక్ష్మీ మాధురి, గోపి, సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, వెనుక నిందితులు

పోర్న్ వీడియోలు చూడలేదు..

భర్తను హత్య చేసిన అనంతరం భార్య లక్ష్మీమాధురి పోర్న్ వీడియోలు చూసిందనడంలో వాస్తవం లేదని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. గతంలో భర్త తన ఫోన్‌లో చూసిన వీడియోల హిస్టరీని మాత్రమే ఆమె పరిశీలించిందని ఎస్పీ తెలిపారు. నిందితులను తెనాలిలో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపచ్చగా రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించారు. ఈ కేసులో పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు. నార్త్ డీఎస్పీ మురళికృష్ణ, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, దుగ్గిరాల ఎస్ఐ వెంకటరవి, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి నాలుగు సెల్ ఫోన్లు, కారు, బుల్లెట్‌తో పాటు హత్యకు ఉపయోగించిన అప్పడాల కర్ర, మత్తు బిల్లలు కలిగిన ఒక షీటు, మూడు ఖాళీ షీట్లను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు

ముగిసిన రాష్ట్రస్థాయి మట్టి కుస్తీ పోటీలు

● ఆంధ్రకేసరిగా విశాఖ పహిల్వాన్ శ్రీలత ● విజేతలకు పతకాలు అందజేసిన ఎమ్మెల్సీ రాజశేఖర్

చిలకలూరిపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలోని పాత మార్కెట్ యార్డు వేదికగా రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగిన రాష్ట్రస్థాయి మట్టి కుస్తీ పోటీలు సోమవారం ముగిశాయి. శ్రీ వీరాంజనేయ మల్లయుద్ధ వ్యాయామ కళాశాల కమి టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 180 మంది పురు ష, మహిళా పహిల్వాన్లు పాల్గొని, తమ సత్తా చాటారు. మహిళల హెవీ వెయిట్ విభాగంలో విశాఖపట్నంకు చెందిన అల్లు శ్రీలత అద్భుత ప్రదర్శనతో ఆంధ్రకేసరి టైటిల్ కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన పహిల్వాన్ పాలపర్తి మహేష్‌గౌడ్ ఆంధ్రకేసరి టైటిల్‌ను గెలుచుకున్నారు. ఇద్దరికీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ బంగారు పతకం, టైటిల్ ప్రదానం చేసి, ప్రత్యేకంగా అభినందించారు.

విజేతల వివరాలు

మహిళల సీనియర్ విభాగం: ఝాన్సీ పావని(48 కేజీలు, కృష్ణా), ఎన్.వాణి(52 కేజీలు, అనంతపురం), ఎల్.పూర్ణశ్రీ(56 కేజీలు,కృష్ణా), వై.జస్వంతి(62 కేజీలు, కడప).

పురుషుల సీనియర్స్ విభాగం: ఎన్.శివకృష్ణారెడ్డి(55కేజీలు, బాపట్ల), పి.లక్ష్మణరావు(60 కేజీలు, పిఠాపురం), మైనస్ 60కేజీల విభాగంలో రాఘవేంద్ర(అనంతపురం), బి.సాయిరాంరెడ్డి(70 కేజీలు,బాపట్ల), ఓపెన్ కేటగిరీలో మహేష్‌గౌడ్(కృష్ణా) విజేతలుగా నిలిచి బంగారు పతకాలు అందుకున్నారు.

మహిళల జూనియర్స్: జె.అనూష(46 కేజీలు, నంద్యాల), కె.హర్షిణి(50 కేజీలు, పిఠాపురం), జె.రాణి(58 కేజీలు, అనంతపురం), ఎస్.స్పందన(62 కేజీలు, అనంతపురం), కె.వెంకటలక్ష్మి(65 కేజీలు, కడప), పి.రత్నం (80 కేజీలు, పిఠాపురం) బంగారు పతకాలు సాధించారు.



ఆంధ్రకేసరిగా ఎంపికైన పహిల్వాన్ పాలపర్తి మహేష్‌గౌడ్‌కు గదను అందజేస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

పురుషులు జూనియర్స్: ఎం.మనోజ్(52 కేజీలు, అనంతపురం), అనంతకుమార్(57 కేజీలు, అనంతపురం), పి. ఉదయ్‌కిరణ్(61 కేజీలు, నెల్లూరు), టి.హేమంత్‌కుమార్(65 కేజీలు, అనంతపురం), జె.రాఖీ(74 కేజీలు, అనంతపురం), బి.శాంతులు(86 కేజీలు, అనంతపురం) బంగారు పతకాలు సాధించారు. వీరంతా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పహిల్వాన్లకు మెమెంటోలు, ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్ ఆర్యా, పాండురంగారావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మావో శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కరిముల్లా, వ్యాయామశాల అధ్యక్షుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాయిజ్యోతిని ఆదర్శంగా తీసుకోవాలి

● కేజేఎస్ఎస్ ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు

గుంటూరు(తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అంధురాలైనప్పటికీ బ్రెయిలీ లిపిలో అనేక నవలలు రచించిన చింతక్రింది సాయిజ్యోతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కమ్మజనసేవా సమితి(కేజేఎస్ఎస్) ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు పేర్కొన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్, కమ్మ బాలికల వసతి గృహంలో సోమవారం సాయిజ్యోతి అభినందన సభ జరిగింది. సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి అధ్యక్షత వహించిన ఈ సభలో మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ మంగళగిరికి చెందిన సాయిజ్యోతి నూతక్కి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, మంచు తాకిన ప్రేమ, ఎవరు అతను.. వంటి నవలలను రచించారన్నారు. ఆమె ఆలోచనను, ప్రతిభను గుర్తించి ఈ సన్మాన సభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సాయిజ్యోతి కోరిక మేరకు సొంత నిధులతో రూ.60వేల ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, అతిథులు వల్లూరి తాండవకృష్ణ, జీవి రాయుడు, గోరంట్ల పున్నయ్య చౌదరి మాట్లాడుతూ వైకల్యం ఉన్నప్పటికి తన మనోనేత్రంతో ఎంఏ వరకు చదవడంతో పాటు ఎన్నో నవలలు రాసిన స్త్రీ మూర్తికి రత్నగిరిబాబు ల్యాప్‌టాప్ బహుకరించడం సంతోషంగా ఉందన్నారు. సాయిజ్యోతి మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి, సన్మానం చేస్తున్న సమితి సభ్యులకు ముఖ్యంగా మాదల రత్నగిరిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, కోశాధికారి కావూరి రవిచంద్ర, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, మర్రిపూడి సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పట్టాభి సీతారామయ్య పాల్గొన్నారు. కమ్మ బాలికల వసతి గృహంలో కేజేఎ స్ఎస్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గృహంలో సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కె. వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు.



సాయిజ్యోతిని సత్కరిస్తున్న మాదల రత్నగిరిబాబు, పాల్గొన్న మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు

దుగ్గిరాల సొసైటీ సేవలకు పురస్కారం

దుగ్గిరాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట సేవలు అందించడంతో.. దుగ్గిరాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఉత్తమ పీఏసీఎస్ పురస్కారం లభించింది. 77వ గణతంతంత్ర వేడుకల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతులమీదుగా అవార్డును ఇన్‌చార్జి సెక్రటరీ నాయుడు కృష్ణారావు అందుకున్నారు. సొసైటీకి నాలుగు పర్యాయాలు ఛైర్మన్‌గా ఉన్న పాటిబండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఏటా రైతులకు రూ.25కోట్లు రుణాలిస్తున్నామని, 95శాతం రికవరీ రేటుతో సొసైటీని లాభాల్లో నడిపిస్తున్నామన్నారు. ఏటా రూ.6 కోట్ల వరకు రైతులకు ఎరువులను విక్రయిస్తున్నామన్నారు. దుగ్గిరాల సొసైటీ కింద 14 గ్రామాలకు చెందిన సుమారు 2,800 మంది రైతులకు అవసరమైన ఎరువులను అందిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్లలో దుగ్గిరాలలో 200 మెట్రిక్ టన్నులు, పెదపాలెంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాములను నిర్మించినట్లు తెలిపారు. తాను ఛైర్మన్ పదవి తొలిసారి స్వీకరించినపుడు, రూ.1.80 కోట్ల వరకూ నష్టాల్లో సొసైటీ ఉందని.. గడచిన ఆరేళ్లలో రుణాలు తీరిపోగా, ప్రస్తుతం పూర్తి లాభాల్లో నడుస్తోందన్నారు.



ఉత్తమ సొసైటీ పురస్కార ప్రశంసాపత్రంతో దుగ్గిరాల సొసైటీ ఛైర్మన్ పాటిబండ్ల హరిప్రసాద్, ఇన్‌చార్జి సెక్రటరి కృష్ణారావు

హోరాహోరీగా ఎడ్లపోటీలు

● నెల్లూరు జిల్లా ఎడ్లజతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని కానుకమాత తిరునాళ్లను పురస్కరించుకొని స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు టచ్‌పళ్ల విభాగంలో నెల్లూరు జిల్లా సైదాపురానికి చెందిన మొక్కపాటి లింగయ్య చౌదరి, అచ్చంపేట మండలం వేమూరుకు చెందిన శ్యావల గోపి కృష్ణ సంయుక్త ఎడ్లజత 4,200 దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. తాడికొండ మండలం బండారుపల్లికి చెందిన కాసుల ఆంజనేయులు ఎడ్ల జత 4122.10 అడుగులతో రెండోస్థానం, ప్రకాశం జిల్లా దర్శి మండలం రాచంపల్లికి చెందిన గోలి శివన్నారాయణకు చెందిన ఎడ్ల జత 4108 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన డాక్టర్ కాకాని వెంకట సురేంద్ర ఎడ్లజత 4084.10 అడుగులతో నాలుగోస్థానం, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామం పీఆర్ మెమోరియల్‌కు చెందిన పులగం త్రిశజ్ఞరెడ్డి, జెషితారెడ్డి ఎడ్లజత 3970.02 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 27 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుగులో ఈ పోటీలు నిర్వహించారు. మొత్తం 9 బహుమతులు అందించారు. నిర్వాహకులు వైఎల్ మర్రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, సుమంత్‌రెడ్డి, శౌరెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి, రాజారెడ్డి, జోసఫ్‌రెడ్డి, వైఎఫ్ మర్రెడ్డి, లింగారెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.



ప్రథమ స్థానం సాధించిన నెల్లూరు జిల్లా ఎడ్లజత

పదకొండేళ్ల బాలికపై అత్యాచారం

● పోక్సో కేసు నమోదు

వినుకొండటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి చదువుతున్న పదకొండేళ్ల మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన ఘటన.. పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానికంగా నివాసం ఉంటున్న ఓ మహిళకు నలుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఆదే కాలనీకి చెందిన షేక్ బాజీవలితో ఆరేళ్లుగా ఆమె సహజీవనం చేస్తోంది. ఆదివారం రాత్రి ఇంటిలో తన మూడో కూతురితో.. అసభ్యకరంగా బాజీవలి ఉండడం చూసి తట్టుకోలేక పోయింది. అతనిని చితకబాది పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. నిందితుడు బాజీవలి సోదరుడు.. బాధిత మహిళ పెద్ద కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

వివా, వీవీఐటీలో ఘనంగా రిపబ్లిక్ డే

పెదకాకాని, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వివా, వీవీఐటీ యూనివర్సిటీలో రిపబ్లిక్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథి 25వ బెటాలియన్ ఎన్‌సీసీ గుంటూరు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సుశాంత్‌కుమార్ మిశ్రా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, వివా ఉద్యోగులు

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జగ్గారపు

మంగళగిరి సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన జగ్గారపు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం పాత మంగళగిరిలోని తమ్మిశెట్టి రామకృష్ణ వీధిలో సోమవారం జరిగింది. ఏప్రిల్‌లో సంఘం రాష్ట్ర మహాసభ మంగళగిరిలో పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఈ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఇతర ప్రముఖులను ఆహ్వానించాలని నిర్ణయించారు. మహాసభ తేదీ ఖరారైన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్య టించి జన సమీకరణ చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఏపీ పద్మశా లి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు, మాజీ అధ్యక్షుడు మునగపాటి వెంకటేశ్వరరావు, నేతలు చిలువేరు దశరథ రామయ్య, వెంకటేష్, రుద్ర మహేష్, సంగరి లక్ష్మీనారాయణ, గుర్రం రాజప్ప, సాయిరామ్, అప్పారావు, బెనర్జీ, కల్లూరి సూరిబాబు, పంచుమర్తి శ్రీనివాసరావు, బట్టు శ్రీనివాసరావు, క ల్లూరి సూర్యనారాయణ, మునగాల నాగేశ్వరరావు, బుద్దంటి రవికిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	162, 171, 183
చికెన్ విత్ స్కిన్(కిలో)	314.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	324.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

విద్యా సంస్థలలో గణతంత్ర వేడుకలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న విజ్ఞాన్ ఇన్‌చార్జ్ వీసీ కృష్ణకిషోర్

గుంటూరు(విద్య), జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పలు యుద్ధాల్లో వీర మరణం పొందిన సైనికులకు నివాళిగా ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్థూపానికి ముందుగా నివాళులర్పించి జ్యోతి వెలిగించారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ, ఎన్‌సీసీ పరేడ్ ఎంతగానో ఆకర్షించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. 'వందేమాతరం' గేయాన్ని రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని ఉట్టిపడేలా సమూహగానంగా ఆలపించగా సభ మొత్తం దేశభక్తి భావాలతో నిండిపోయింది. కార్యక్రమంలో సీఈవో కూరపాటి మేఘన, ఇన్‌చార్జ్ వీసీ కేవీ కృష్ణకిషోర్, రిజిస్ట్రార్ పిఎంవిరావు పాల్గొన్నారు.

● స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గౌరవ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు చేసిన పిరమిడ్ విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ పాతూరి రాధిక, డాక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య), జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో జరిగిన గణతంత్ర వేడుకలకు కళాశాల పాలకు మండలి అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సోమయాజి ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా వందనం చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన హవల్దార్ షేక్ సుభానిపి కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. 15 మంది బెస్ట్ క్యాడెట్స్ కు మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యాపకులకు, విద్యార్థులకు గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ గణాంక శాస్త్రవేత్త డాక్టర్ వెంకట్ ఇక్కుర్తి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపల్ నాగభూషణం, ఎ.ప్రత్యూష, ఫార్మ్.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, ఎన్‌సీసీ అధికారి సీహెచ్ అజిత్ బాబు పాల్గొన్నారు.

● స్థానిక కొత్తపేటలోని శ్రీమేథ విద్యాసంస్థలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ మాట్లాడుతూ ఎందరో మేధావుల కృషితో లిఖించిన రాజ్యాంగాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

● చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలకుటీర్ పూర్వ విద్యార్థి, అవీహ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి. అజయ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో మరో పూర్వవిద్యార్థి గ్లోబల్ ట్రయల్స్ అసోసియేట్, బ్రిస్టల్ మైయర్స్‌స్క్విబ్ ఆర్.భవ్యశ్రీ, చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


శ్రీ వికాస్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

● స్థానిక నెహ్రూ నగర్ శ్రీవికాస్ పాఠశాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు, శ్రీ వికాస్ డీన్ చదలవాడ శ్రీదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెన్స్ స్కూల్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో విశ్రాంత ఉపాధ్యాయులు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, బాబురావు, పాఠశాల కార్యదర్శి రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ శేషకుమారి, డైరెక్టర్ సాయి శ్రీకర్ పాల్గొన్నారు.


జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న అభ్యుదయ విద్యార్థినులు

● స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ డిగ్రీ కళాశాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ఆర్‌కె ప్రసాద్, బి.రోహిణిదేవి పాల్గొన్నారు.

● స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్‌వీఆర్ బీఈడీ కళాశాలలో గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోటూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ బ్రాడీపేట బ్రాంచ్‌లో గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డాక్టర్ మోదిని శ్రీవల్లి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం డాక్టర్ మోదిని, డాక్టర్ ఇతిహాస్ గోపాల్‌లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తితో జాతీయ భావాలు అలవరుచుకోవాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్ మంగాదేవి, సహ కార్యదర్శి జయశ్రీ, సీఈవో రఘురామ్, డీన్ ప్రణయజ, ప్రిన్సిపల్ రమణ తదితరులున్నారు.

● గుంటూరుకార్పొరేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో గణతంత్ర వేడుకలు, వార్షిక ఇంటర్ హౌస్ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ కోవెలమూడి రవీంద్ర హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఎన్‌సీసీ, స్కౌట్స్ గైడ్స్ కవాతును తిలకించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతి ని వెలిగించారు. మేయర్ మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు జీవితంలో ఎంతో ముఖ్యమని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే పౌరులుగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలక వర్గ సభ్యులు మాదల రాజేంద్రప్రసాద్, యలమంచిలి వాసుదేవరావు, ముక్తా ప్రభాకర్, ప్రముఖ ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, గడిపూడి రాయుడు, మదమంచి రవీంద్ర, గింజుపల్లి వరప్రసాదరావు, దేవినేని శేషగిరిరావు, వల్లూరి తాండవ కృష్ణ, రావెల సాంబశివరావు పాల్గొన్నారు.

● గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావు నగర్‌లోని మునిసిపల్ బాలికొన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. హైస్కూలు ప్రధానోపాధ్యాయని కటారి ప్రమీల జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పీ రమేష్, విద్యా కమిటీ వైస్ చైర్మన్ యెహోషువా, త్రివేణి, చందు పవన్ కుమార్, ఆరుమళ్ళ చెంచు, లండ జ్యోతి పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తులో విద్యార్థుల పాత్ర కీలకం

గుంటూరు(విద్య), జనవరి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు భారత నిర్మాణంలో కీలక భూమిక పోషించాలని శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ విశ్రాంత ఇంజనీర్ దేశి రాజు వివిఎస్ఎల్ కాంతారావు పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్లో 81వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ కాలేజ్ హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు శివ రామకృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. త్రివేండ్రం ఇస్రో సెంటర్ ప్రతినిధి, పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.యజ్ఞనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని యం.శారదాదేవి, విశ్రాంత సంస్కృత పండితులు .సీతారామానుజాచార్యులు, కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ప్రాణత్యాగమే స్వేచ్ఛాజీవితం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు, మేయర్ రవీంద్ర


టీడీపీ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ నాని, పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగమే మన స్వేచ్ఛాయుత జీవితం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావుతో కలిసి వారిరువురు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాణిక్యరావు మాట్లాడుతూ భారతదేశం ఇతర దేశాలకు ఆదర్శమని, కులామతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, గోళ్ళ ప్రభాకర్, వెంకట మహాలక్ష్మి, కొత్తూరి వెంకట్, లక్ష్మి శైలజ, కోటేశ్వరరావు, శోభారాణి, పోతురాజు సమత, కొల్లి అనీల్, శ్రీవల్లి, గంటా మౌళిక, సోపాటి రత్నం, లామ్ నవమి, వెంకటరమణ, శంకర్, వాణి, అనిత, వెంకటయ్య, చంద్రశేఖర్, సత్యవాణి, రత్నకుమారి, సింధు, మాధవి పాల్గొన్నారు.


గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయుడికి భారత రాజ్యాంగమే పవిత్ర గ్రంథమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆమె ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలతో కలిసి ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులపై ప్రజల్లో అవగాహన కల్పించేలా రూపొందించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి భారతీయుడికి పవిత్ర గ్రంధం వంటిదని, మన హక్కుల తో పాటు మనం నిర్వర్తించాల్సిన విధులను కూడా రాజ్యాంగం స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.


కార్పొరేషన్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్, కార్పొరేటర్లు, అధికారులు

● గుంటూరు కార్పొరేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన యోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జిన్నాటవర్ సెంటర్లలో జాతీయ జెండా ఆవిష్కరణ, హిమని సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహానికి, జిఎంసి ప్రధాన కార్యాలయంలో బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విధుల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులు, కార్మికులు, సచివాలయ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్ మల్లి షరీల్‌బాబు


● గుంటూరు సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్ మల్లి షరీల్‌బాబు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ వెంకట్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ కార్యాలయం లో సీఈఓ వీర్ల జ్యోతి బసు జాతీయ జెండాను ఎగురవేసి, స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి. శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.


రైల్ విహార్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

● గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని రైల్ విహార్‌లో గుంటూరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డీఆర్ఎం సుధేష్ణ సేన్ జాతీయ పతాకావిష్కరణ చేసి ఓపెన్ టాప్ వాహనంలో పరేడ్‌ని సందర్శించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి గుంటూరు డివిజన్ రూ. 539 కోట్ల ఆదాయం సాధించిందని, ఇది గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 16 శాతం వృద్ధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, ఏసీఎం వినయ్‌కాంత్ పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ, పాల్గొన్న బీజేపీ నాయకులు

● గుంటూరు (తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావు పేట, భరతమాత విగ్రహం వద్ద సోమవారం జిల్లా కార్యదర్శి నారదాసు వీర మణీంద్ర ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కేంద్ర స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, 8వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఉల్లి గోపాల్, ఆళ్లహరి, ప్రదీప్, శ్రావణీ, తోట రామకృష్ణ, భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్ గౌడ్, రాజేష్, రాధా మాధవి, జూపూడి దుర్గాభవాని, స్వాతి పాల్గొన్నారు.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, లింగంశెట్టి తదితరులు

● గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా రాజీవ్ గాంధీ భవన్‌లో సోమవారం కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు యన్నం సుధీర్‌బాబు, ఎండీ ఖలీల్‌ల నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, జాన్‌బాబు, రత్తయ్య, సందీప్, కరిముల్లా, బోడపాటి నాగేశ్వరరావు, మైలా కిరణ్ తదితరులున్నారు.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

● జిల్లా కోర్టురోడ్డులోనున్న జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. చైర్మన్ హరిబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, మేనేజర్ శ్రీనివాస్ తదితరులున్నారు.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన, సీఈవో ఫణికుమార్ తదితరులు

● బ్రాడీ పేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చైర్మన్ మక్కెన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంతో మంది మహనీయులు త్యాగఫలితమే రాజ్యాంగ ఫలాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, డీసీవో వీరాచారి తదితరులున్నారు.

● గుంటూరు(తూర్పు),జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట, సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక లక్ష్యాలను కాలరాస్తే సహించం, ప్రజల హక్కులను కాపాడుతామని కార్యకర్తలతో ప్రతిజ్ఞ గావించారు. ఈ కార్యక్ర మంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, సురేష్, మేడా హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయం వద్ద జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ హాజరై తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై 1947కు ముందు పుట్టిన సీనియర్ సిటిజన్స్ 11 మందిని ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ మండలపు రవి, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం ఘనంగా సత్కరించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మన్నే సుబ్బారావు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో కార్యదర్శి నందికేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కట్టా వలరాజు, నాగమల్లేశ్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

● గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిన్నాటవర్ సెంటర్‌లోని ది ఇండియన్ చాంబ ర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో చాంబర్ శాశ్విత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యెల్చూరి వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. కార్యక్రమంలో చాంబర్ సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, గొల్లపూడి కాశీ రాంబాబు, గార్లపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లో సోమవారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, ప్రజాసంఘాల నాయకులు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్‌బాబు, అంబేద్కర్, బత్తుల అనీల్, బెంజిమెన్, శాంతిరాజు తదితరులున్నారు.

● ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో డీపీటీవో డి.సాంబ్రాజ్యం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ కే.సత్యనారాయణ, ఏటీఎం జి సాంబశివ, గుంటూరు-1, 2 డిపో మేనేజర్‌లు పి మాలతి, రామకృష్ణ తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, డాక్టర్ పి.సుబ్బారెడ్డి, జమదగ్ని, పింగళి భాగ్యలక్ష్మి, ఆర్‌వీ సింగరయ్య, రామాంజనేయసూరి తదితరులున్నారు.

రేంజ్ ఐజీ కార్యాలయంలో


రేంజ్ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేసి, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఐజీ పోలీసు సిబ్బందికి మిఠాయిలు పంచి, గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐజీ కార్యాలయ మేనేజర్ హిమమంతరావు, లైజనింగ్ ఆఫీసర్ సీఐ వినోద్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది, ఐజీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో....


జాతీయ జెండా ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ వకుల్ జిందాల్, అధికారులు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ జాతీయ జెండా ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. అనంతరం పోలీస్ కార్యాలయ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ అత్యున్నత రాజ్యాంగాన్ని రచించడంలో విశేష కృషి చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జివి రమణమూర్తి (అడ్మిన్), ఏ.హనుమంతు (ఏఆర్), నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఏఆర్ డీఎస్పి సంకురయ్య, ఎస్బి సీఐ అళహరి శ్రీనివాస్, జగన్నాథరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. క్యాంపెనింగ్ షిప్ సంస్థ ఆధ్వర్యంలోని అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా కాంపెయినింగ్ షిప్ సంస్థ తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. తలసీమియా చిన్నారుల కోసం చేపట్టిన ఇలాంటి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో 222 మంది రక్తదానం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పటిష్టం చేసేందుకు ఏడాదిన్నరగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తోన్న సేవలతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతగా నిలవడం మంచి విషయమని చెప్పారు. కార్యక్రమంలో కాంపెయినింగ్ షిప్ డైరెక్టర్ వసీం ఆలీ చౌదరి, పీ మినీర్ ఖాన్, షేక్ ముజీ, సమీముల్లా బేగ్ షేక్, నిజాముద్దీన్, రియాజుద్దీన్, షేక్ షన్ను తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పట్ల నిజాయితీ, నిబద్ధతే నిజమైన దేశభక్తి


జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న సుబ్బారావు, రసూల్

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నిజమైన దేశభక్తి మన వృత్తి పట్ల నిజాయితీ, నిబద్ధత చూపడంలోనే ఉంటుందని గుంటూరు వైద్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు ఉద్బోధించారు. సోమవారం పొత్తూరులోని కేర్ దంత వైద్య కళాశాలలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగాహాజరై ప్రసంగించారు. తొలుత జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. కేర్ దంత వైద్య కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతల కృషి వల్లే మనం ఈనాడు స్వేచ్ఛ వాయువులు పీలుస్తున్నామని తెలిపారు. కేర్ దంత వైద్య కళాశాల సీఈవో డాక్టర్ ముజాహిద్ ఆలీ మాట్లాడుతూ తారతమ్యాలు లేని సమాజం వల్ల మాత్రమే యువతలో దేశభక్తి పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేర్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, ఓరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మెహబూబ్, పలువురు వైద్య బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

భారత పాలకుల లొంగుబాటు విధానాలను ప్రతిఘటించాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్యవాదానికి భారత పాలకులు అనుసరించే లొంగుబాటు విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక అరండల్‌పేట, మాదాల నారాయణ స్వామి భవనంలో సోమవారం ఐఎఫ్‌టీయూ సీనియర్ నాయకుడు నూతల ఫణి సంస్మరణ సభ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయని అన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వి కృష్ణ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు యు.గని రాజు మాట్లాడుతూ అనేక భూ, ఇళ్ల స్థలాల పోరాటాల్లో ఫణి క్రియాశీలకంగా పని చేశారని అన్నారు. ఈ సభలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ, ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. పోతురాజు, జి.శంకర్, అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, నాగలక్ష్మి, రజియా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

గుంటూరు(క్రీడలు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి) గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా 28 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన దివంగత మోఖమాటం వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన మోఖమాటం వెంకటేశ్వరరావు మెమోరియల్ టి 20 లీగ్ క్రికెట్ పోటీలు గుంటూరు నగరంలో ఘనంగా ముగిసాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జట్టు విజేతగా నిలిచింది. జి పి ఎం సి సి జట్టు రన్నరప్ టైటిల్‌ని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి లభించగా ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి లభించింది. దివంగత మోఖమాటం వెంకటేశ్వరరావు సతీమణి మహాలక్ష్మి చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సింగ రాజు లక్ష్మీకాంత్, జీడీ సీఏ అధ్యక్షుడు చుక్కపల్లి రాకేష్, కార్యదర్శి శ్రీధర్, కౌన్సిలర్ ఎన్.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోనుగుంట్ల జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు సోమవారం గుంటూరులోని ఒక ప్రైవేటు హోటల్ గెస్ట్ హౌస్‌లో ఘనంగా జరిగాయి. గోనుగుంట్ల అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. గోనుగుంట్ల మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆశించారు. కార్యక్రమంలో ఏపీ శిల్పకళ వేదికల మంజులతారెడ్డి, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనాదేవి, సత్తెనపల్లి టీడీపీ నేత మన్నెం శివనాగ మల్లేశ్వరరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ పద్మజ, పాల్గొన్నారు.

ఘనంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వార్షికోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వారి 32వ వార్షిక మహోత్సవం ఘనంగా జరిగింది. నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు ధార్మిక ప్రాంగణంలో హోమాలు, సాదు సన్మానాలు, లలితా పారాయణాలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ నిర్వహణలో పౌరాణిక నాటకాలలోని రెండు ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలకమండలి వారు కళాకారులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీ విజయ గణపతి స్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం వాస్తు పూజ, వాస్తు హోమం, తదితర కార్యక్రమాలను వేద పండితులు పరాశరం కృష్ణ ప్రసాదు బృందం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో సిద్ధి, బుద్ధి సమేత శ్రీ విజయ గణపతి స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్తంభాల గరువు సెంటర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు మారుతీ నగర్ 4వ లైనుకు చెందిన కడియాల బాలాజీని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న మొత్తం 67 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిల్స్‌ను, నిందితుడు కడియాల బాలాజీని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏసు నామమే స్వస్థత

● దేవుని సహవాసమే శాంతి మార్గం ● మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దైవ సంకల్పంతో నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయని, సమాజ మార్పులో ప్రభావం చూపాయని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జే శామ్యూల్ కిరణ్ అన్నారు. వర్సిటీ ఎదుట జరుగుతున్న మహోత్సవాల్లో ఫాదర్ ఎం.దేవదాసు బయలపరిచిన ఆధారంగా దేవాలయాలు నిర్మించడం ద్వారా ఆధ్యాత్మిక విలువలు బలపడతాయని, పరమ దేవుడే మన పక్షమై ఉండగా భయపడవలసిన అవసరం లేదన్నారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు ప్రసంగిస్తూ.. దేవుని చిత్తానుసారంగా ప్రయాణిస్తూ, విధేయత, విశ్వాసం, సేవాభావంతో ముందుకు సాగాలని, అప్పుడు మాత్రమే క్రైస్తవ సమాజం బలంగా




మహోత్సవాలకు హాజరైన క్రైస్తవ భక్తజన సందోహం

88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజు జరిగాయి. శామ్యూల్ కిరణ్ వాక్యోప దేశం చేస్తూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ధా ర్మిక జీవన మార్గంలో ప్రోత్సహించాల్సిన బాధ్య త కలిగి ఉన్నారని తెలిపారు. మారు మనసే స్వస్థతకు మొదటిమెట్టు అని, ఏసు నామములో సంపూర్ణ స్వస్థత లభిస్తుందని బోధించారు. బైబి ల్ నిలబడుతుందని అన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపించారు.

ప్రముఖుల హాజరు

బైబిల్ మిషన్ మహోత్సవాలకు నంబూరు వీవీఐటీ విశ్వవిద్యాలయం ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కర్ణాటక ఐపీఎస్ అధికారి సంగీత, ఐఎఫ్ఎస్ అధికారి రాధా, ఐఆర్ఎస్ అధికారి



వాక్యోపదేశం చేస్తున్న శామ్యూల్ కిరణ్

వినయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. వారికి నిర్వాహకులు ఆశీర్వాదాలు అందజేశారు.

నేటితో మహోత్సవాల ముగింపు

బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం మధ్యాహ్నంతో ముగియనున్నాయి. తెల్లవారుజామున ధ్యానం, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు క్రైస్తవ కీర్తనల ఆలాపన, దైవ సందేశాలు, మహోత్సవాల కన్వీనర్ నివేదిక సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ట్రాక్ మరమ్మతులు.. ప్రయాణికులకు తిప్పలు

వేమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే పనులు చేపట్టిన అధికారులు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వని కారణంగా వాహన చోదకులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తెనాలి - కొల్లూరు ప్రధాన రహదారిపై ఉన్న వేమూరు ప్రాంతీయ రైల్వే గేటు మధ్యన ట్రాక్ పనులను హడావుడిగా ప్రారంభించారు. రైల్వే గేటు మూసివేయడంతో.. వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వాహనదారులు, వ్యవసాయ పొలాలకు వెళ్లాల్సిన రైతులు ఇబ్బందులు పడ్డారు. కొల్లూరు నుంచి తెనాలి వైపునకు వెళ్లాల్సిన వాహనాలు క్రాప గ్రామం నుంచి, కొల్లూరు వైపునకు గ్రామం మీదుగా వాహనాలు చేరుకున్నాయి. ఉదయం 11 నుంచి 3 వరకు 4 గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే శాఖ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టే ముందు పత్రికా ప్రకటన ఇచ్చి, ఆయా ప్రాంతాల్లో బోర్డులు ముందస్తుగా ఏర్పాటు చేసి సమాచారాన్ని ప్రజలకు తెలియచేయాలి. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వేరు మార్గాలను కూడా ముందుగానే సూచిస్తారు.



వేమూరు రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

కొర్రీల ఫలితం.. తగ్గిన సంతృప్తి

(5వ పేజీ తరువాయి)

తర్వాత మిల్లర్లు ఎటువంటి అభ్యంతరాలు పెట్టడానికి వీల్లేదు. కానీ, మిల్లుల వద్దకు ధాన్యాన్ని తీసుకెళ్లిన అన్నదాతలకు అక్కడ మళ్లీ తేమ శాతం తీయడం, దానికి అంగీకరిస్తేనే లోడ్ దించుతామనే షరతులు విధిస్తున్నారు. దీంతో రైతు లు అయిష్టంగానే ధాన్యాన్ని అప్పగించినట్లు తెలుస్తోంది. పైకి క్వింటాలు మద్ద తు ధర మొత్తం రైతు బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు కనిపించినా మిల్లర్ల తో అనధికారిక ఒప్పందాలతో బస్తాకు దాదాపు 5 నుంచి 10 కేజీల వరకు కోత పడింది. సేకరణ మొత్తం ఇదే రీతిలో జరగకపోయినా విక్రయా లలో 25శాతం ఈ తంతు నడవడమే సంతృప్త స్థాయి పడిపోవడానికి కారణం గా తెలుస్తోంది ఎవరైతే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకున్నారో వారి నుంచే ఫోన్‌ల ద్వారా ప్రభుత్వం సంతృప్తస్థాయి వివరాలు సేకరించింది. ఈ గణాంకాలు ఆధారంగానే రాష్ట్రంలో టాప్ 5 జిల్లాలతోపాటు, కింద నుంచి ఉన్న 5 జిల్లాల వివరాలను బహిర్గతం చేసింది. ఇంత పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నా టాప్ 5లో బాపట్ల జిల్లాకు చోటు దక్కకపోగా. దిగువ నుంచి 4 వ స్థానంలో నిలవడం లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిన విషయాన్ని చాటిచెప్పింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా రైతుల సంతృప్తస్థాయి విషయంలో టాప్ 5లో చోటు దక్కలేదు. గన్నీ సంచుల లభ్యత, రవాణా సౌకర్యాలు, ధర విష యంలో సహే తుకంగా వ్యవహరించారా అనే అంశాల ప్రాతిపదికనే ఈ సర్వే ను ప్రభుత్వం నిర్వహించింది. రాండమ్‌గా అన్నదాతలకు కాల్స్ చేయగా.. 70 శాతం మంది మిల్లుల వద్ద తమకు న్యాయం జరగలేదనేది ప్రధాన ఫిర్యాదుగా ఉన్నట్లు సమాచారం. మద్దతు ధర విషయంలో కూడా కొర్రీ పెట్టకుండా పూర్తిస్థాయి ధర అందకపోవడమే రైతుల అసంతృప్తికి కారణంగా తెలుస్తోంది.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

రాష్ట్ర రాజధాని అమరావతిలో మొదటి సారిగా నిర్వహించిన 77వ గణతంత్ర వేడుకలు సోమవారం అట్టహాసంగా సాగాయి. రాయపూడిలోని 25 ఎకరాల పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ పబ్లిక్ గ్యాలరీలకు వేలాదిగా రైతులు, ప్రజలు, విద్యార్థులు విచ్చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రక్షక దళాల గౌరవ వందనం స్వీకరించారు. కవాతులతో ప్రాంగణం దద్దరిల్లింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ దంపతులు, మంత్రి నారా లోకేశ్, అధికారులు పాల్గొన్నారు. ఈ వేడుకలు రాష్ట్ర ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించాయి. ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ప్రథమం.. ఘనం



ఆకట్టుకుంటున్న అమరావతి శకటం





సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ మాటామంతి



పీ4 శకటం



విద్యార్థినుల సెల్ఫీ..



స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర శకటం



గణతంత్ర వేడుకలకు హాజరైన రైతులు, ప్రజలు, విద్యార్థులు



వేడుకలకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థినులు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తరహా కథాంశం



నితిన్ కథానాయకుడిగా 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'డిస్కో రాజా', 'ఊరి పేరు భైరవకోన' చిత్రాల ఫేమ్ వీఐ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఇది నితిన్ నటించనున్న 36వ చిత్రం. ఇటీవలే ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. శ్రీనివాస సిల్వర్ స్ర్కీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో రూపొందనున్న ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకులకు విభిన్నమైన సినిమాటిక్ అనుభూతిని అందించనుందని మేకర్స్ తెలిపారు. నితిన్ కెరీర్‌లోనే ఆసక్తికరమైన సినిమాగా నిలవనుందని పేర్కొన్నారు. త్వరలోనే ఇతర వివరాలను ప్రకటించనున్నారు.

బ్రిటిష్ కాలంనాటి కథ.. రెండు సినిమాలు

తెలుగు సినీరంగంలో బ్రిటిష్ కాలంనాటి చిత్రాలకు ఆదరణ ఎప్పుడూ ఉంటోంది. గతంలో వచ్చిన 'సైరా నరసింహారెడ్డి', 'ఆర్ఆర్ఆర్','రజాకార్' చిత్రాలు మొదలు.. ఇటీవల విడుదలైన 'ఛాంపియన్' వరకు తెలుగు ప్రేక్షకుల ఆదరణను పొందాయి. తాజాగా ఇదే నేపథ్యంలో మరో రెండు చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి.



'రణబాలి'గా విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం పేరును 'రణబాలి' అని ఖరారు చేశారు. ఈ మేరకు చిత్రబృందం గ్లింప్స్‌ని విడుదల చేసింది. టీసీరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. గ్లింప్స్‌లో 'రణబాలి' అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు ఆకట్టుకుంది. కథానాయిక రష్మిక మందన్న జయమ్మగా కనిపించారు. ప్రతినాయకుడు సర్ థియోడోర్ హెక్టార్ పాత్రలో 'మమ్మీ' ఫేమ్ నటుడు ఆర్నార్డ్ వోస్లూ నటించారు. 19వ శతాబ్దం నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుగా 'రణబాలి' రూపుదిద్దుకుంటోంది.



'డేవిడ్ రెడ్డి'గా మంచు మనోజ్

మంచు మనోజ్ నటిస్తున్న తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. 1897 -1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలం నేపథ్యంలో జరిగిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యోధుడి పాత్రలో మనోజ్ నటిస్తున్నారు. ఇందులో ఆయన గెటప్ చాలా విభిన్నంగా ఉంది. క్రూరమైన బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచి పోరాడే యోధుడిగా మనోజ్ నటన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని చెబుతున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా మనోజ్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.టెర్రిఫిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మరియా ర్యబోషష్క హీరోయిన్‌గా నటిస్తున్నారు.

నిజంగానే చెంపదెబ్బ కొట్టారు

జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు హీరోయిన్ ఈషా రెబ్బా. తరుణ్ భాస్కర్‌తో కలసి ఆమె నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఏ.ఆర్.సజీవ్ దర్శకత్వంలో ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్లపై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివరపు నిర్మించారు. ఈనెల 30న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా చిత్రవిశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఈ చిత్రంలో శాంతి పాత్రలో నటించడం నాకు గొప్ప అనుభూతినిచ్చింది. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కెరీర్‌లో ఒక్కసారైనా ఇలాంటి పాత్ర వస్తే చేయాలని అనుకునేదాన్ని. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది.



ఈషా రెబ్బా

- నేను యాక్షన్ సన్నివేశాలను ఇష్టపడతాను. ఈ చిత్రంలో చెంపదెబ్బలు తినే సన్నివేశాలుంటాయి. చేతికున్న చట్నీ చెంపకు అంటుకునేలా ఒక సీన్ ఉంది. ఆ సన్నివేశం పండాలంటే చెంపపై కొట్టాల్సిందే. అలా నిజంగానే ఒక చెంపదెబ్బ గట్టిగా కొట్టారు.. దాంతో నా కళ్లలో నీళ్లొచ్చాయి. మరో సన్నివేశంలో తరుణ్‌కి, నాకు ఇద్దరికీ దెబ్బలు తగిలాయి.
- ఇది రీమేక్ చిత్రమే అయినప్పటికీ మన తెలుగుదనానికి అనుగుణంగా పాత్రల్లో చాలా మార్పులు చేశారు. సినిమా చూస్తున్నంతసేపూ రీమేక్ అనే భావన ఎక్కడా రాదు. ఇందులోని అన్ని క్యారెక్టర్లకూ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు.
- తరుణ్ భాస్కర్ గారితో చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. ఆయన స్వతహాగా దర్శకుడు. అలాగని ఏ రోజు కూడా డైరెక్టర్‌కి సలహాలు ఇవ్వడం నేను చూడలేదు.
- సబ్జెక్టుపై మంచి అవగాహన ఉన్న దర్శకుడు సజీవ్. ఆయన చాలా మొండి మనిషి. తాను అనుకున్న సన్నివేశం సరిగ్గా వచ్చేవరకూ వదిలిపెట్టడు.

పద్మశ్రీ విజేతలకు సత్కారం



పద్మశ్రీ అవార్డులకు ఎంపికయిన సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ నివాసాలకు మెగాస్టార్ చిరంజీవి సోమవారం స్వయంగా వెళ్లి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించారు. తెలుగు సినిమాకు లభించిన ఈ జాతీయ గౌరవం ఒక మైలురాయిగా చిరంజీవి పేర్కొన్నారు

పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ లేదు

తెలుగు చిత్రపరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనే కల్చర్ లేదని, అది వ్యక్తులను బట్టి, వారి ప్రవర్తనను బట్టి ఉంటుందని చిరంజీవి అభిప్రాయం వ్యక్తం చేశారు. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'చిత్రపరిశ్రమ ఒక అద్దంలాంటిది మనం ఏది ఇస్తే అది తిరిగి ఇస్తుంది. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉంటే ఎదుటి వ్యక్తి కూడా అలాగే ఉంటాడు. నువ్వు స్ట్రిక్ట్‌గా ఉంటే ఎదుటి వ్యక్తి అవకాశం తీసుకోవడానికి ప్రయత్నించడు. ఇది చాలా మంచి పరిశ్రమ. ఎటువంటి సంకోచాలు పెట్టుకోవద్దు. ధైర్యంగా రండి. మా అమ్మాయి సుష్మితను పరిశ్రమకు వచ్చేందుకు ప్రోత్సహించాను. మీ ప్రతిభను ప్రదర్శించి నిరూపించుకోండి. తప్పకుండా రాణిస్తారు' అని ఆయన పిలుపు ఇచ్చారు.



సందేశాత్మక ప్రేమకథ

జయశివసూర్య, నిఖితశ్రీ, ఇషా మనోహరి ప్రియ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతోన్న సందేశాత్మక ప్రేమ కథ '100 డేస్ లవ్ స్టోరీ'. 'అతి ప్రేమ భయానకం' అనేది ఉపశీర్షిక. విజయమిత్ర దర్శకత్వంలో పురిపండ వీ వెంకటరమణ మూర్తి శర్మ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 13న చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత సాయివెంకట్ విడుదల చేశారు.

ఎన్నో వసంతాలు...



భూమిక ప్రధాన పాత్రధారురాలిగా గుణశేఖర్ తెరకెక్కించిన చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'ఎన్నో వసంతాలు' అనే పాటను ఆవిష్కరించారు. దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ 'మనల్ని మనం నియంత్రించుకోకపోతే జీవితం అదుపు తప్పి నాశనం అవుతుంది. తల్లిదండ్రుల పెంపకం సరిగా లేకపోతే పిల్లలు ఎలా చెడిపోతారో ఈ చిత్రంలో చూపించాం' అని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటి భూమిక, నీలిమ గుణ తదితరులు పాల్గొన్నారు.

మాస్ గీతం



హాస్య నటుడు సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా వేదవ్యాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'గోట్'. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్. చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణంతర కార్యక్రమాల్లో ఉంది. ఫిబ్రవరిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తాజాగా ఈ చిత్రం నుంచి 'రైజ్ ఆఫ్ గణ' అనే పాటను విడుదల చేశారు. శక్తిమంతమైన మాస్ గీతంగా ఇది ఆకట్టుకుంటోంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లోనే ఇదో ప్రత్యేక చిత్రంగా నిలవనుందని వేదవ్యాస్ తెలిపారు. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.



పంథా మార్చిన రవితేజ

మాస్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించడం వైపు మొగ్గు చూపే రవితేజ ఈ సారి తన పంథా మార్చారు. ఓ విభిన్న తరహా టైటిల్‌తో ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రవితేజ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఈ చిత్రం టైటిల్‌ను 'ఇరుముడి'గా ప్రకటించి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. 'నిన్ను కోరి', 'మజిలి' ఫేమ్ శివ నిర్వాణ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకుడు. ఇందులో అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న భక్తునిగా రవితేజ కనిపించనున్నారు. సరికొత్త కథాంశంతో ఆధ్యాత్మికత నేపథ్యంలో చిత్రం తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. 'జీవితంలో సరైన సమయంలో కొన్ని కథలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. అలాంటి ఈ కథలో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా. నమ్మకమే మార్గదర్శకంగా ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. స్వామియే శరణం అయ్యప్ప' అని రవితేజ పేర్కొన్నారు. మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రియా భవాని శంకర్ కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీఓపీ: విష్ణు శర్మ, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

మోహన్‌లాల్ కొత్త చిత్రం



విలక్షణ నటుడు మోహన్‌లాల్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించనున్నట్లు గోకులం మూవీస్ అధినేత గోకులం గోపాలన్ ప్రకటించారు. తన తొలి చిత్రం 'మెప్పాడియన్'తో జాతీయ అవార్డ్ సాధించిన విష్ణు మోహన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. గోకులం మూవీస్ సంస్థ చరిత్రలోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ నటీనటులే కాకుండా కొంత మంది విదేశీ నటులు కూడా నటించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత చెప్పారు.

కీస్ అవుట్


పెగులా

- ఫ్రిట్జ్, రూడ్ కూడా..
- క్వార్టర్ ఫైనల్లో పెగులా, సినర్, స్వియాటెక్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో వారం తొలి రోజు పలు సంచనాలు చోటు చేసుకున్నాయి. మహిళల డిఫెండింగ్ చాంపియన్ మాడిసన్ కీస్, పురుషుల్లో తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 12వ సీడ్ కాస్పెర్ రూడ్‌కు నాలుగో రౌండ్‌లో చుక్కెదురైంది. ఇక..రెండుసార్లు డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ మెల్‌బోర్న్ పార్క్‌లో 18వ వరుస విజయం నమోదు చేశాడు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో అమెరికాకు చెందిన ఆరో సీడ్ జెస్సికా పెగులా 6-3, 6-4తో తన దేశానికే చెందిన గత ఏడాది విజేత, తొమ్మిదో సీడ్ మాడిసన్ కీస్‌కు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ స్వియాటెక్ 6-0, 6-3తో ఇన్‌గ్లిస్‌ను వరుస సెట్లలో చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. అనిసిమోవా 7-6 (4), 6-4తో వాంగ్‌ని, రిబకినా 6-3, 6-1తో 21వ సీడ్ మెర్టెన్స్‌ని ఓడించింది. సినర్ 6-1, 6-3, 7-6 (2)తో ఇటలీకే చెందిన 22వ సీడ్ డార్డెరీపై నెగ్గాడు. తద్వారా ఇటలీ స్టార్ వరుసగా తొమ్మిదోసారి గ్రాండ్‌స్లామ్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్ 3-6, 6-4, 6-3, 6-4తో 12వ సీడ్ కాస్పెర్ రూడ్‌కి ఝలకిచ్చి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ఐదో సీడ్ ముసేటి 6-2, 7-5, 6-4తో తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ని కంగుతినిపించి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. కాగా పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రీ ద్వయం ఓటమితో ఈ టోర్నీలో భారతపోరు ముగిసినట్టయింది.

వెస్టిండీస్ కెప్టెన్ హోప్

వరల్డ్‌కప్ జట్టు ఎంపిక



సెయింట్‌జాన్స్ (ఆంటిగ్వా): టీ20 ప్రపంచ కప్‌లో తలపడే వెస్టిండీస్ జట్టును సోమవారం ప్రకటించారు. 15 మంది సభ్యుల జట్టుకు షాయ్ హోప్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బ్యాటర్ క్వెంటిన్ శాంసన్‌కు తొలిసారి జట్టులో చోటు కల్పించారు. అలాగే పేసర్ షమార్ జోసెఫ్‌నూ ఎంపిక చేశారు. మాజీ కెప్టెన్ హోల్డర్, రొమారియో షెఫర్డ్, రోవ్‌మన్ పొవెల్ పునరాగమనం చేశారు.

జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్, కీపర్), జాన్సన్ చార్లెస్ (కీపర్), రోస్టన్ ఛేజ్, మాథ్యూ ఫోర్డ్, హెట్‌మయెర్, హోల్డర్, అకీల్ హొసేన్, షమార్ జోసెఫ్, బ్రెండన్ కింగ్, మోటీ, పొవెల్, షెర్ఫానె రూథర్‌ఫోర్డ్, క్వెంటిన్ శాంసన్, జేడెన్ సీల్స్, రొమారియో షెఫర్డ్.



బీసీసీఐ మాజీ అధ్యక్షుడు
ఐఎస్ బింద్రా మృతి

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో బీసీసీఐని బలీయమైన శక్తిగా తీర్చిదిద్దిన కొద్దిమందిలో ఒకరైన ఇందర్‌జిత్ సింగ్ బింద్రా (84) ఆదివారం కన్నుమూశారు. 1993-1996 మధ్య ఐఎస్ బింద్రా బోర్డు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) చీఫ్‌గా 36 ఏళ్లపాటు పనిచేశారు. 1987 వరల్డ్‌కప్‌నకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం వెనుక మాజీ అధ్యక్షులు ఎన్‌కేపీ సాల్వే, జగ్‌మోహన్ దాల్మియాతోపాటు బింద్రా పాత్ర ఎంతో ఉంది. ఆసియా దేశాలైన పాకిస్థాన్, శ్రీలంకతో సమన్వయం చేసుకొంటూ వరల్డ్‌కప్‌ను ఉపఖండానికి తీసుకురావడంలో బింద్రా ఎంతో కృషి చేశారు. ఇంగ్లండ్ ఆవల జరిగిన తొలి మెగా టోర్నీ కూడా ఇదే కావడం విశేషం. 1986లో ఇండో-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు భారత్‌లో పర్యటించేందుకు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, అప్పటి పాక్ నియంత జనరల్ జియా ఉల్ హక్‌ను భారత్‌లో పర్యటించాలని సూచించడం ద్వారా ప్రతిష్టంభనకు బింద్రా తెరదించినట్టు టీమిండియా మాజీ మేనేజర్ అమృత్ మాథుర్ తెలిపారు. దాల్మియా-బింద్రా హయాంలోనే 1996 వరల్డ్‌కప్ కూడా ఉపఖండంలో జరిగింది. బింద్రా మృతికి బీసీసీఐ సంతాపం వ్యక్తం చేసింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ X ఢిల్లీ (రా. 7.30)

చివరి రెండు టీ20లకూ
తిలక్ దూరం



- జట్టుతో పాటే శ్రేయాస్

న్యూఢిల్లీ: భారత మిడిలార్డర్ ఆటగాడు తిలక్ వర్మ న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. ఈ సిరీస్‌కు ముందే గాయపడిన తను శస్త్రచికిత్స చేయించుకుని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఏ) పునరావాస శిబిరంలో కోలుకుంటున్నాడు. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు మరింత సమయం పడుతుందని బీసీసీఐ ప్రకటించింది. మొదట తొలి మూడు మ్యాచ్‌లకు తిలక్ అందుబాటులో ఉండడని ప్రకటించిన సెలెక్టర్లు అతడి స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. తాజా పరిస్థితుల్లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు కూడా అయ్యర్ జట్టుతో పాటే ఉండనున్నాడు. మరోవైపు మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాక టీ20 వరల్డ్‌కప్ కోసం వచ్చే నెల మూడున భారత జట్టుతో పాటు కలవనున్నాడు. ముంబైలో 4న దక్షిణాఫ్రికాతో జరిగే ఏకైక వామప్ మ్యాచ్‌లో అతను ఆడే అవకాశం ఉంది.



బ్రాడ్‌మన్ క్యాప్‌నకు రికార్డు ధర

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా లెజెండ్ సర్ డాన్ బ్రాడ్‌మన్ ధరించిన క్యాప్ వేలంలో భారీ ధర పలికింది. 'ఆస్ట్రేలియా డే' సందర్భంగా సోమవారం గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన వేలంలో రూ. 2.90 కోట్లకు (4,60,000 ఆస్ట్రేలియా డాలర్లు) ఈ క్యాప్ అమ్ముడైంది. ఈ క్రమంలో వేలం వేసిన బ్రాడ్‌మన్ క్యాప్‌ల్లో ఇదే అత్యధిక ధర. 1947-48లో భారత్‌తో ఆసీస్ గడ్డపై జరిగిన సిరీస్‌లో ధరించిన ఈ క్యాప్‌ను టీమిండియా ఆల్‌రౌండర్ శ్రీరంగ వాసుదేవ్ సోహోనికి బ్రాడ్‌మన్ బహూకరించాడు. సోహోనీ కుటుంబం వద్దే 75 ఏళ్లపాటు ఈ క్యాప్ ఉంది. అయితే, సోహోనీ ఆఖరికోరిక మేరకు దీన్ని మళ్లీ ఆస్ట్రేలియా చేర్చినట్టు వేలం నిర్వాహకులు తెలిపారు. ఈ టోపీని తయారుచేసిన సిడ్నీకి చెందిన ఫార్మర్స్ అనే సంస్థ 1970 తర్వాత క్యాప్‌ల తయారీని నిలిపివేసింది. కాగా ఈ సిరీస్ ఆస్ట్రేలియా గడ్డపై బ్రాడ్‌మన్‌కు ఆఖరిది. సిరీస్‌లోని ఐదు టెస్టుల్లో డాన్ నాలుగు శతకాలతో మొత్తం 715 పరుగులు చేశాడు.

సివర్ రికార్డు శతకం

ముంబై కీలక విజయం


సివర్ బ్రంట్ (57 బంతుల్లో 100 నాటౌట్)

- బెంగళూరుకు మరో ఓటమి
- పోరాడిన రిచా ఘోష్
- మహిళల ప్రీమియర్ లీగ్


రిచా ఘోష్ (90)

వడోదర: డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ వరుస ఓటములకు బ్రేక్ పడింది. డబ్ల్యూపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన వేళ ఆల్‌రౌండ్‌షో కనబర్చింది. టోర్నీ చరిత్రలోనే నాట్ సివర్ బ్రంట్ (57 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్‌తో 100 నాటౌట్) తొలి శతకం సాధించి రికార్డు సృష్టించగా, రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై 15 రన్స్ తేడాతో నెగ్గింది. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ 82వ మ్యాచ్‌లో ఈ సెంచరీ నమోదు కావడం విశేషం. అటు బ్రంట్ కెరీర్‌లో కూడా ఇదే తొలి టీ20 శతకం. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. మాథ్యూస్ (39 బంతుల్లో 9 ఫోర్లతో 56) వేగంగా ఆడింది. బెల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 184 పరుగులు చేసి ఓడింది. రిచా ఘోష్ (50 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 90) ఒంటరి పోరాటం చేయగా డిక్లెర్క్ (28) ఫర్వాలేదనిపించింది. మాథ్యూస్‌కు మూడు, షబ్నింకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సివర్ బ్రంట్ నిలిచింది.

వణికించిన రిచా: ముంబై బౌలర్లను ఎదుర్కోవడంలో ఆర్‌సీబీ బ్యాటర్లు దారుణంగా తడబడ్డారు. అయితే రిచా మాత్రం భారీ షాట్లతో చివరి వరకు నిలిచి ముంబైని భయపెట్టింది. పేసర్లు మాథ్యూస్, షబ్నింల ధాటికి పవర్‌ప్లే ముగిసేలోపే టాప్-5 బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరారు. అప్పటికి స్కోరు కేవలం 35 పరుగులే. ఈ స్థితిలో రిచా ఘోష్.. డిక్లెర్క్‌తో ఆరో వికెట్‌కు 42 పరుగులు, అరుంధతి (14)తో కలిసి ఏడో వికెట్‌కు 52 రన్స్ అందించింది. ఇక చివరి రెండు ఓవర్లలో 59 రన్స్ కావాల్సిన వేళ రిచా విరుచుకుపడింది. 19వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు, శ్రేయాంక (12 నాటౌట్) రెండు ఫోర్లతో 27 రన్స్ అందాయి. ఇక సమీకరణం ఆరు బంతుల్లో 32 రన్స్‌కు మారడంతో సంచలనం చోటుచేసుకుంటుందా.. అనిపించింది. అయితే 4,4,6 బాది ఆఖరి బంతికి అవుటైన రిచా కొద్దిలో శతకాన్ని కోల్పోయింది.

సివర్-మాథ్యూస్ శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్ ఆచితూచి ఆరంభమైంది. ఓపెనర్ సజన (7) మూడో ఓవర్‌లోనే వెనుదిరగ్గా.. పవర్‌ప్లేలో 38 పరుగులు చేయగలిగింది. కానీ ఆ తర్వాతే ఆర్‌సీబీ బౌలర్లకు కష్టాలు ఆరంభమయ్యాయి. సివర్ బ్రంట్ జోరుకు ఓపెనర్ మాథ్యూస్ మెరుపులు జత కలవడంతో స్కోరు ఊపందుకుంది. వీరి ధాటికి పేసర్ లారెన్ బెల్ మినహా అంతా ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. వరుస ఓవర్లలో బౌండరీలు బాదేస్తూ రన్‌రేట్‌ను అమాంతం పెంచేశారు. ఇదే క్రమంలో సివర్ 32 బంతుల్లో, మాథ్యూస్ 34 బంతుల్లో తమ అర్ధసెంచరీలను కూడా పూర్తి చేశారు. 15వ ఓవర్‌లో మాథ్యూస్‌ను బెల్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో కాస్త జోరు తగ్గి హర్మన్ (20), అమన్ (4) వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అయితే ఆఖరి ఓవర్‌లో సింగిల్‌తో సివర్ 57 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు: ముంబై: 20 ఓవర్లలో 199/4 (సివర్ బ్రంట్ 100 నాటౌట్, మాథ్యూస్ 56, బెల్ 2/21) **బెంగళూరు:** 20 ఓవర్లలో 184/9 (రిచా 90, డిక్లెర్క్ 28; మాథ్యూస్ 3/10, షబ్నిం 2/25, కెర్ 2/37)

విజేత సన్‌రైజర్స్

సౌతాఫ్రికా 20 లీగ్

కేప్‌టౌన్: సౌతాఫ్రికా20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ (ఎస్ఈపీ) మూడోసారి టైటిల్ నెగ్గింది.. ఆదివారం ప్రిటోరియా క్యాపిటల్స్ (పీసీ)తో ఫైనల్లో రైజర్స్ 6 వికెట్లతో నెగ్గి టైటిల్ అందుకుంది. 2022-23లో ఆరంభమైన ఈ లీగ్‌లో సన్‌రైజర్స్ మొత్తం నాలుగుసార్లూ ఫైనల్‌కు చేరింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రిటోరియా 158/7 స్కోరు సాధించింది. బ్రెవిస్ (101) శతకం సాధించాడు. ఛేదనలో సన్‌రైజర్స్ 48/4 స్కోరుతో ఓటమి దిశగా వెళ్లినా బ్రీట్‌స్కే (68 నాటౌట్), కెప్టెన్ స్టబ్స్ (63 నాటౌట్) పోరాటంతో ఆదుకున్నారు. దీంతో 19.2 ఓవర్లలో 162/4 స్కోరుతో గెలిచి చాంపియన్‌గా నిలిచింది.

భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్?

- యోచిస్తున్న పాక్ క్రికెట్ బోర్డు
- తుది నిర్ణయం నాలుగు రోజుల్లో..

లాహోర్: బంగ్లాదేశ్‌కు మద్దతు పేరిట పాకిస్థాన్ వక్రబుద్ధిని ప్రదర్శిస్తోంది. టీ20 వరల్డ్ కప్ ప్రతిష్ఠను దెబ్బ తీయాలని కుటిల పన్నాగాలు పన్నుతోంది. ప్రపంచ కప్‌లో పాల్గొనాలా..వద్దా..అనేది తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిర్ణయిస్తారని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రధానిని..నక్వీ సోమవారం కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..టోర్నమెంట్ తాము ఆడే విషయమై చర్చలు జరుగుతున్నాయన్నారు. తుది నిర్ణయాన్ని వచ్చే శుక్రవారం లేదా సోమవారం వెల్లడిస్తామని తెలిపారు. అయితే టోర్నీ మొత్తాన్ని కాకుండా..వరల్డ్ కప్ బ్లాక్‌బస్టర్ భారత్‌తో పోరును బహిష్కరించాలని పీసీబీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక..బంగ్లాదేశ్‌కు పూర్తి సహకారం అందించాలని నక్వీకి షెహబాజ్ సూచించినట్టు సమాచారం.

పాసివ్ ఫండ్స్‌తో విశ్వసనీయ రాబడులు

ఖర్చులు తక్కువ, పారదర్శకత ఎక్కువ


హేమన్ భాటియా, సీఈఓ, ఏంజెల్ వన్ ఏఎంసీ

ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. బ్లూచిప్ కంపెనీల షేర్లు సైతం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోవుతున్నాయి. దీంతో మదుపరులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఆటుపోట్లను ఎదుర్కొని మదుపరులకు ఇండెక్స్ ఆధారిత రాబడులు ఇచ్చేందుకు మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు అందించే పాసివ్ ఫండ్స్ చక్కని అవకాశం అంటున్నారు ఏంజెల్ వన్ ఏఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ హేమన్ భాటియా. పాసివ్ ఫండ్స్, ఇతర ఎంఎఫ్ పథకాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు..

యాక్టివ్ ఫండ్స్‌తో పోలిస్తే పాసివ్ ఫండ్స్ బెటర్

పాసివ్ ఫండ్స్ పెట్టుబడులు పూర్తి పారదర్శకతతో స్పష్టమైన నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయి. ఇక్కడ పెట్టుబడి నిర్ణయాలు ఆయా ఇండెక్స్‌ల పనితీరు ఆధారంగా జరుగుతాయి. ఇందులో ఫండ్ మేనేజర్ల నిర్ణయాల ప్రభావం ఏ మాత్రం ఉండదు. దీనికి తోడు కంపెనీల షేర్ల ఎంపిక ప్రక్రియ అంతా ఇండెక్స్ పనితీరు ఆధారంగా ఆటోమేటిగ్గా జరిగిపోతుంది. కాబట్టి యాక్టివ్ ఫండ్స్‌తో పోలిస్తే ఖర్చులు కూడా తక్కువ.

ఆశించిన స్థాయిలోనే రాబడులు

షేర్ల ఎంపికలో ఫండ్ మేనేజర్ల పక్షపాతానికి, పొరపాట్లకు కూడా తావు ఉండదు. బెంచ్‌మార్క్‌గా పెట్టుకున్న ఇండెక్స్‌లోని షేర్లలోనే పెట్టుబడులు ఉంటాయి. దీంతో ఆ ఇండెక్స్ పనితీరును బట్టి రాబడులపైనా ముందే ఒక అంచనాకు రావచ్చు. దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులు ఆశించే మదుపరుకు పాసివ్ ఫండ్స్ అత్యంత అనువైనవి. కొన్ని సందర్భాల్లో యాక్టివ్ ఫండ్స్ మంచి రాబడులు పంచినా.. దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులకు పాసివ్ ఫండ్స్ చక్కటి పెట్టుబడి మార్గం.

పాసివ్ ఫండ్స్‌కు మంచి భవిష్యత్

ఈ పథకాల నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) వేగంగా పెరుగుతున్నాయి. మదుపరుల పెట్టుబడుల ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులకు ఇది స్పష్టమైన సంకేతం. తక్కువ ఖర్చులు, పారదర్శకత, నిబంధనల ప్రకారం పెట్టుబడులు పెట్టడమే ఇందుకు ప్రధాన కారణం. ముందు ముందు రిటైల్ మదుపరులతో పాటు అన్ని తరగతుల మదుపరుల నుంచి పాసివ్ ఫండ్స్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని భావిస్తున్నాం.

పోర్టుఫోలియోలో విభిన్న ఫండ్స్

ప్రస్తుతం ఈక్విటీ, స్థిర ఆదాయం, కమోడిటీస్‌కు సంబంధించి తొమ్మిది ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ నిర్వహిస్తున్నాం. ఇందులో ఆరు ఈక్విటీ ఆధారిత పథకాలు, రెండు కమోడిటీస్ ఫండ్స్, ఒక డెట్ ఫండ్ ఉన్నాయి. ఏంజెల్ గోల్డ్ వన్ ఈటీఎఫ్, ఏంజెల్ గోల్డ్ వన్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పేరుతో రెండు గోల్డ్ ఈటీఎఫ్‌లను నిర్వహిస్తున్నాం. త్వరలో సిల్వర్ ఈటీఎఫ్ ప్రారంభించాలని చూస్తున్నాం.

రూ.464 కోట్లకు ఏయూఎం

ఏంజెల్ వన్ ఏఎంసీ ఇప్పుడిప్పుడే వృద్ధి బాట పడుతోంది. గత ఏడాది నవంబరు నాటికి పథకాల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) మొత్తం రూ.464 కోట్లకు చేరింది. మదుపరుల్లో అవగాహన, పంపిణీ వ్యవస్థను పెంచుకోవడం ద్వారా మరింతగా విస్తరిస్తాం.

కీలకంగా తెలుగు రాష్ట్రాలు

ఏంజెల్ వన్ ఏఎంసీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముఖ్యమైన మార్కెట్లు. ఈ రెండు రాష్ట్రాల్లోని మదుపరుల్లో పెట్టుబడులపై అవగాహన ఎక్కువ. రిటైల్ మదుపరుల్లో యువకులు, తొలిసారిగా పెట్టుబడులకు దిగే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. వీరిలో చాలా మంది డిజిటల్ ఫైనాన్షియల్ పెట్టుబడులకు మారుతున్నారు. కంపెనీ మధ్య, దీర్ఘకాలిక వృద్ధిలో తెలుగు రాష్ట్రాలు కీలక పాత్ర పోషించబోతున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,60,260 ▲	1,46,900 ▲	3,65,000 ▲
విజయవాడ	1,62,800 ▲	1,52,000 ▲	3,45,000 ▲
విశాఖపట్నం	1,61,950 ▲	1,48,450 ▲	3,75,000 ▲
రాజమండ్రి	1,58,620 ▼	1,45,400 ▼	3,22,000 ▼
ప్రొద్దుటూరు	1,65,500 ▲	1,52,260 ▲	3,56,000 ▲
ముంబై	1,54,310 ▲	1,41,348 ▲	3,17,705 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	550
వరంగల్	507	గోదావరి	505
చిత్తూరు	573	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	135	విజయవాడ	143
వరంగల్	135	గుంటూరు	147
కరీంనగర్	135	ఒంగోలు	147
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	132
కర్నూలు	135	నెల్లూరు	137
విశాఖపట్నం	135	అనంతపురం	137
గోదావరి	143		

బిజినెస్



భారత వృద్ధికి 'ఏఐ' చోదక శక్తి

2035 నాటికి జీడీపీలో 15 శాతం

అదనంగా రూ.55.84 లక్షల కోట్లు: పీడబ్ల్యూసీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోవడం పక్కన పెడితే మన ఆర్థిక వ్యవస్థకు మాత్రం ప్రధాన చోదక శక్తిగా మారనుంది. పెద్దఎత్తున ఏఐ వినియోగం ద్వారా 2035 నాటికి మన దేశ వ్యవసాయ, ఆరోగ్య రక్షణ, ఇంధనం, విద్య, తయారీ రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత లేదన్నా 60,700 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.55.84 లక్షల కోట్లు) వరకు అదనంగా జోడిస్తాయని పీడబ్ల్యూసీ అనే సంస్థ ఒక నివేదికలో తెలిపింది. అప్పటి దేశ జీడీపీలో ఇది దాదాపు 15 శాతానికి సమానం. ఏఐకి తోడు ప్రభుత్వ ప్రత్యేక విధానాలు, పెట్టుబడులతో ఈ రంగాల్లో ఉత్పాదకత కూడా బాగా పెరగనుందని తెలిపింది. వర్ధమాన దేశాలు సక్రమ వినియోగం ద్వారా, ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను మార్చివేసే సాధనంగా ఏఐని ఎలా ఉపయోగించుకోవచ్చనే దానికి కూడా భారత్ చక్కటి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొంది.

వ్యవ'సాయ'మే

పారిశ్రామిక, సేవల రంగాలు ఎంతగా అభివృద్ధి చెందినా 2047 వరకు భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముకగా ఉంటుందని పీడబ్ల్యూసీ నివేదిక తేల్చి చెప్పింది. ఇందుకోసం 2025 మార్చి నాటికి 63,700 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.58.60 లక్షల కోట్లు) ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల విలువను 2047 నాటికి 2,35,900 కోట్ల డాలర్లకు పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే చిన్న కమతాలు, తక్కువ ఉత్పాదకతలు పెద్ద సవాళ్లుగా మారతాయని తెలిపింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారత్‌లో వ్యవసాయ దిగుబడులు 40 నుంచి 50 శాతం తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. భారత రైతుల్లో నూటికి 86 శాతం సన్న, చిన్నకారు రైతులు కావడం, వారి సగటు కమతాల పరిమాణం ఒక హెక్టారు కంటే తక్కువ ఉండడం ప్రధాన సమస్యలని పేర్కొంది. అయితే ఏఐ, డిజిటల్ టెక్నాలజీల వినియోగం ద్వారా ఈ సమస్యలను చాలా వరకు అధిగమించవచ్చని అంచనా వేసింది. ఏఐ, డిజిటల్ టెక్నాలజీల వినియోగం ద్వారా విద్య, ఇంధనం, ఆరోగ్య, తయారీ రంగాల్లోనూ భారత్ ఆర్థికంగా దూసుకుపోతుందని పోతుందని పీడబ్ల్యూసీ పేర్కొంది.



మార్కెట్లోకి మళ్లీ రెనో డస్టర్

చెన్నై: రెనో ఇండియా మార్కెట్లోకి మళ్లీ తన పాపులర్ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ డస్టర్‌ను తీసుకువచ్చింది. 2022లో డస్టర్ ఎస్‌యూవీని కంపెనీ మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంది. తాజాగా 'రెనో.రీథింక్' వ్యూహంలో భాగంగా కంపెనీ సోమవారం చెన్నైలో సరికొత్త తరం డస్టర్‌ను ఆవిష్కరించింది. డస్టర్ ఎస్‌యూవీని హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌తో రెండు కొత్త టర్బో ఇంజన్స్‌తో తీసుకువచ్చింది. ఈ ఏడాది మార్చిలో డస్టర్ ధరలను ప్రకటించనున్నట్లు రెనో తెలిపింది. కాగా ఏప్రిల్ ద్వితీయార్ధం నుంచి టర్బో వేరియంట్ డస్టర్, దీపావళి నుంచి హైబ్రిడ్ వేరియంట్స్ డెలివరీలను ప్రారంభించనుంది.

ఆల్‌టైం రికార్డు స్థాయికి బంగారం, వెండి దిగుమతుల వ్యయం

2025లో 6,800 కోట్ల డాలర్లకు పెరుగుదల

న్యూఢిల్లీ: గత ఏడాది బంగారం, వెండి దిగుమతుల వ్యయం సరికొత్త జీవితకాల రికార్డు స్థాయికి పెరిగింది. లండన్‌కు చెందిన పరిశోధన సంస్థ మెటల్ ఫోకస్ డేటా ప్రకారం.. 2025లో భారత్ బంగారం దిగుమతుల బిల్లు 5,880 కోట్ల డాలర్లకు, వెండి దిగుమతుల వ్యయం 920 కోట్ల డాలర్లకు (రెండు కలిపి 6,800 కోట్ల డాలర్లు) చేరుకుంది. గత ఏడాది మొత్తం దిగుమతుల వ్యయం 75,000 కోట్ల డాలర్లలో ఈ రెండింటి వాటా 9 శాతంగా ఉంది. ఈ విలువైన లోహాల ధరలు భారీగా పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణం. 2025లో గోల్డ్ రేటు దాదాపు 76 శాతం ఎగబాకగా.. వెండి ధర మూడు రెట్లయింది. కాగా, వీటి దిగుమతుల పరిమాణం మాత్రం తగ్గింది. గత ఏడాది దేశంలోకి 630 టన్నుల బంగారం దిగుమతైందని అంచనా. 2024తో పోలిస్తే 27 తక్కువ. వెండి దిగుమతులు కూడా 6.5 శాతం తగ్గి 7,158 టన్నులకు పరిమితం అయ్యాయి.

ఆటుపోట్లలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లలో సాగే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లతో పాటు జియో పొలిటికల్ పరిణామాలే ఇందుకు ప్రధాన కారణంగా ఉండనున్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లు పూర్తిగా బేర్ పట్టులో కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి సందర్భాల్లో ఇన్వెస్టర్లు ఎంపిక చేసిన షేర్లలో కచ్చితమైన స్టాప్‌లాస్‌తో పెట్టుబడులు పెట్టడం మంచిది. నెగటివ్ సెంటిమెంట్ ఇలాగే కొనసాగితే నిఫ్టీ మరింత పతనం కావచ్చు. ప్రస్తుతం మెటల్స్, కమోడిటీస్ రంగ షేర్లు కాస్త మెరుగ్గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

టెక్ మహీంద్రా: స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత ఈ కౌంటర్ మంచి మూమెంటమ్‌ను కనబరుస్తోంది. సమీప నిరోధాన్ని అధిగమించేందుకు సిద్ధమైంది. పైగా నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. మూడు నెలల్లోనే 25 శాతం లాభాన్ని అందించింది. గత శుక్రవారం రూ.1,701 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,840 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,650.

ఓఎన్‌జీసీ: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 45 శాతం మేర పతనమైన ఈ కౌంటర్ ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.230 పై స్థాయిలో కదలాడుతోంది. పది రోజులుగా మంచి వాల్యూమ్‌తో మార్కెట్ ఒత్తిళ్లను తట్టుకుని నిలబడ్డాయి. గత శుక్రవారం రూ.245 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.240 శ్రేణిలో ఎంటరై రూ.290 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.225.

హిందాల్కో: గత ఏడాది మే నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. దాదాపుగా 65 శాతం మేర లాభాన్ని అందించింది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో తక్కువ వాల్యూమ్ నమోదవడాన్ని బట్టి చూస్తే ఇన్వెస్టర్లు ఈ షేరును వదులుకోవటానికి ఇష్టపడటం లేదని అర్థమవుతోంది. గత శుక్రవారం రూ.950 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.930 శ్రేణిలో ప్రవేశించి రూ.990 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.910.

వేదాంత లిమిటెడ్: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. చిన్నచిన్న పుల్‌బ్యాక్స్ తప్ప బుల్లిష్ ట్రెండ్ కొనసాగుతోంది. నిఫ్టీతో పోలిస్తే రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.684 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.680 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.760 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.660 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

డాక్టర్ రెడ్డీస్: కొన్ని నెలలుగా స్తబ్దుగా, డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు కీలకమైన మద్దతు స్థాయి వద్ద కదలాడుతోంది. చివరి రెండు సెషన్లలో ఈ షేరు భారీ వాల్యూమ్‌తో గణనీయంగా పెరిగింది. ట్రెండ్ రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,235 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,200 స్థాయిలో ప్రవేశించి రూ.1,320 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,170.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

హస్తిన.. త్రివర్ణ శోభితం



వందేమాతరం ఇతివృత్తంతో రూపొందించిన శకటం

ప్రత్యేక ఆకర్షణగా వందేమాతరం

సైనిక శక్తితోపాటు అద్భుత సాంస్కృతిక వైభవానికి కర్తవ్యపథ్ సోమవారం వేదికగా నిలిచింది. 'వివిధ్ తా మే ఏక్ తా' (భిన్నత్వంలో ఏకత్వం) నినాదంతో వేడుకల ఆరంభంలో సాగిన 3 నిమిషాల కళాకారుల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారుల వాయిద్యాలతో సాగిన 'వందేమాతర' గీతం అలరించింది. మొత్తం 270 మంది కళాకారులు ఈ కవాతులో పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన ప్రముఖ ఒగ్గుడోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందం ఇందులో పాల్గొంది. కళాకారుల ప్రదర్శనను రాష్ట్రపతి, ప్రధానమంత్రితోపాటు ముఖ్య అతిథులు ఆసక్తిగా తిలకించారు.



భోపాల్‌లో తన బిడ్డతో ఓ పోలీస్ అధికారిణి

వందేమాతరానికి కీరవాణి కొత్త బాణీలు..

వందేమాతరం గీతం 150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ తెలుగు సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి కొత్తగా స్వరపరిచిన వందేమాతరం గీతం గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరేడ్ చివరలో ఆయన సమకూర్చిన కొత్త బాణీలకు అనుగుణంగా 2,500 మంది కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అలాగే తొలిసారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 133 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ వేడుకల్లో కవాతు చేశారు.

గణతంత్ర దినోత్సవం దేశ గౌరవానికి ప్రతీక: మోదీ

దేశ ప్రజలకు ప్రధాని మోదీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ గౌరవానికి, గర్వానికి, వైభవానికి ప్రతీక అయిన మహోన్నతమైన ఈ రోజు అందరి జీవితాల్లో కొత్త శక్తి, నూతన ఉత్సాహాన్ని నింపాలని ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలపై నిలిచిన ఒక చైతన్యవంతమైన గణతంత్ర దేశం భారత్ అని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. భారత గణతంత్రానికి రాజ్యాంగమే పునాది అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



గుర్రపు బగ్గీలో కర్తవ్యపథ్‌కు ముర్ము, ఆంటోనియో కోస్టా, ఉర్సులా

అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

- కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



గణతంత్ర దినోత్సవంలో భాగంగా కర్తవ్య పథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో బ్రహ్మోస్ క్షిపణుల ప్రదర్శన



న్యూఢిల్లీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. తొలిసారి బ్యాటిల్ ఆరే ఫార్మాట్‌లో సైన్యం నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. సైనిక శక్తి, త్రివిధ దళాల ఐక్యత, సాంస్కృతిక వైభవం ఒకే వేదికపై కలిసిన ఈ వేడుక దేశ ప్రజల్లో నూతనోత్తేజం నింపింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్ సహా ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యుద్ధ భూమిలో జరిగే ప్రతి దశను సైన్యం ఈ పరేడ్‌లో తొలిసారి ప్రదర్శించింది. గూఢచర్యం నుంచి ప్రధాన దాడి, రక్షణ చర్యలు, మద్దతు వ్యవస్థల వరకు యుద్ధ క్రమాన్ని ప్రదర్శించారు. భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ తొలిసారి పరేడ్‌లో పాల్గొంది. నిగ్రహ, భైరవ్, భువిరక్ష, కృష్ణ వంటి స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలు కూడా మొదటిసారి పరేడ్‌లో పాల్గొన్నాయి. ముఖ్యంగా పరేడ్‌లో ఆపరేషన్ సిందూర్ ప్రదర్శన చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. విక్టరీ త్రూ జాయింట్‌నెస్ పేరుతో సైన్యం, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్త ఆపరేషన్‌ను రిపబ్లిక్ డే వేదికపై తొలిసారి ఆవిష్కరించాయి. మహిళలతో కూడిన ఇండియన్ కోస్ట్‌గార్డ్ బృందం కూడా ప్రదర్శన ఇచ్చింది. డీఆర్‌డీవో ప్రదర్శన ఈసారి అందరి దృష్టిని ఆకర్షించింది. బాక్ట్రియన్ ఒంటెలు, జాన్స్కర్ పోనీలు, రాప్టర్స్, దేశీయ శునకాలకు బుల్లెట్‌ప్రూఫ్ గేర్, కెమెరాలు, జీపీఎస్ అమర్చిన విధానాన్ని తొలిసారి పరేడ్‌లో ప్రదర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం థీమ్‌తో కళాకారులు దేశవ్యాప్తంగా వాడుకలో ఉన్న వాయిద్యాలతో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. 2,500 మంది కళాకారులతో జరిగిన 'వందేమాతరం - ది ఎటర్నల్ రెజోనెన్స్ ఆఫ్ భారత్' నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, 13 కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన 30 శకటాలు దేశ సంస్కృతి, వారసత్వం, ఆత్మనిర్భరత, పాలనలో పురోగతిని ప్రతిబింబించాయి. 29 యుద్ధ విమానాలతో నిర్వహించిన ఫ్లై పాస్ట్ ఆకట్టుకుంది. రఫేల్, సుఖోయ్ 30 ఎంకేఐ, మిగ్ 29, జాగ్వార్ వంటి యుద్ధ విమానాల విన్యాసాలు చూపరులను కట్టి పడేశాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. కాగా, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు మూడో వరుసలో సీట్లు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ సహా విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

లోకం తీరు



మనది చారిత్రక బంధం!

- ట్రంప్, జిన్‌పింగ్ గణతంత్ర సందేశాలు

న్యూఢిల్లీ, జనవరి 26: భారత 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా, చైనా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా దేశాల ప్రజల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తమ సందేశాల్లో పేర్కొన్నారు. "భారత్-అమెరికాలది చారిత్రక బంధం. ఇరు దేశాలు.. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక, ఈ సందేశాన్ని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే వేడుకలు ముగిసిన అనంతరం.. సోమవారం మధ్యాహ్నం 2.14 గంటలకు భారత్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం పోస్టు చేయడం గమనార్హం. "మనం మంచి స్నేహితులం. మంచి భాగస్వాములం. మంచి ఇరుగు పొరుగు వారం. డ్రాగన్-ఏనుగు కలిసి నృత్యం చేయడం ఇరు దేశాలకు సరైన ఎంపిక" అని జిన్‌పింగ్ తన సందేశంలో పేర్కొన్నారు.

తగ్గనున్న యూరోపియన్ కార్ల ధరలు!

- 15 వేల యూరోలకు మించి ఉన్న కార్లపై సుంకాలు
- 110% నుంచి 40 శాతానికి.. ఆ తర్వాత 10 శాతానికి!



గణతంత్ర వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఆంటోనియో కోస్టా, రాష్ట్రపతి ముర్ము, ఉర్సులా, మోదీ

న్యూఢిల్లీ, జనవరి 26: యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను భారీగా తగ్గించేందుకు భారత్ సిద్ధమైనట్టు సమాచారం. యూరప్ నుంచి దిగుమతి అవుతున్న కార్లపై ఇండియా ప్రస్తుతం 110% సుంకాలను విధిస్తోంది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)లో భాగంగా.. 15 వేల యూరోలకు (దాదాపు రూ.16 లక్షలకు) మించి ఖరీదు ఉన్న కార్లపై ఆ సుంకాలను 110% నుంచి 40 శాతానికి (అంటే ఏకంగా 70% మేర) తగ్గించనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాలక్రమంలో ఆ సుంకాన్ని దశలవారీగా 10 శాతానికి తగ్గించే ఆలోచన కూడా ఉన్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఈ తగ్గింపును ఏడాదికి 2 లక్షల కార్ల ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ కార్లకు వర్తింపజేస్తామని.. చర్చల్లో భాగంగా భారత్ ప్రతిపాదించినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సంఖ్యలో, సుంకాల శాతంలో చివరి నిమిషంలో మార్పులు ఉండే అవకాశం కూడా ఉందని తెలిపాయి. దేశీయ కార్ల తయారీ సంస్థలు విద్యుత్ వాహనాల రంగంలో పెట్టిన పెట్టుబడులకు రక్షణ కల్పించేందుకుగాను.. యూరప్ నుంచి దిగుమతి అయ్యే విద్యుత్ వాహనాలకు మాత్రం ఐదేళ్లపాటు సుంకాలు తగ్గించకూడదని భారత్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత దశలవారీగా ఈవీలపై కూడా సుంకాలు తగ్గించనున్నట్టు తెలిసింది. అమెరికా, చైనాల తర్వాత మన దేశం ప్రపంచంలోనే మూడో అతి పెద్ద కార్ల మార్కెట్ అయినప్పటికీ.. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమను కాపాడేందుకు మన ప్రభుత్వాలు రక్షణాత్మక విధానాలను అనుసరిస్తూ, విదేశీ కార్లపై అత్యధిక దిగుమతి సుంకాలను విధిస్తున్న సంగతి తెలిసిందే. భారత్-ఈయూ ఎఫ్‌టీఏలో భాగంగా ఆ సుంకాలను తగ్గిస్తే.. రెనో, ఫోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఔడీ, స్కోడా, వోల్వో, వంటి ఖరీదైన కార్ల ధరలు మనదేశంలో గణనీయంగా తగ్గనున్నాయి. నిజానికి ఈ కంపెనీలు తమ కార్లలో చాలా మోడళ్లను సీకేడీ (కంప్లీట్‌లీ నాక్‌డ్ డౌన్) విధానంలో విడిభాగాల రూపంలో ఇక్కడికి తీసుకొచ్చి, ఇక్కడ అసెంబుల్ చేయడం ద్వారా తక్కువ దిగుమతి సుంకాలకు అర్హత పొందుతున్నాయి. ఎఫ్‌టీఏ వల్ల.. బీఎండబ్ల్యూ ఎం, మెర్సిడెస్-ఏఎంజీ, ఔడీ-ఆర్‌ఎస్ వంటి కార్ల ధరలు బాగా తగ్గే అవకాశం ఉంది. లాండ్ రోవర్, డిఫెండర్ కార్ల ధరలు కూడా బాగా తగ్గే అవకాశం ఉంది. కాగా, ఏడాదికి దాదాపు 44 లక్షల యూనిట్లుగా ఉన్న భారత కార్ల మార్కెట్‌లో యూరోపియన్ కార్ల వాటా కేవలం 4 శాతమే! భారత కార్ల మార్కెట్‌లో.. జపాన్‌కు చెందిన సుజుకీ కంపెనీతోపాటు, దేశీయ తయారీ సంస్థలైన టాటా, మహీంద్రాల ఆధిపత్యం కొనసాగుతోంది.

రూ.2 లక్షలు దాటనున్న తులం బంగారం

అంతర్జాతీయ విపణిలో తొలిసారి 5000 డాలర్ల మార్కును దాటిన ట్రాయ్ ఔన్సు బంగారం ధర

- ఈ ఏడాదే 7000 డాలర్ల మైలురాయినీ దాటే చాన్స్



న్యూఢిల్లీ, జనవరి 26: "బంగారం ధర తులం రూ.1.6 లక్షలకు చేరింది.. ఇంకేం కొంటాం" అని వెనకడుగు వేస్తున్నారా? ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. కాస్తో కూస్తో కొనే ఆలోచన ఏమైనా ఉంటే ఇప్పుడే కొనేసుకోండి. ఎందుకంటే.. పసిడి పరుగు ఇప్పట్లో ఆగేలా కనిపించట్లేదు! ఒక ట్రాయ్ ఔన్సు పుత్తడి విలువ తొలిసారిగా సోమవారం 5000 డాలర్ల మైలురాయిని దాటింది. ఇది ఇంకా పెరుగుతుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ 'యాన్యువల్ ప్రెసిషన్ మెటల్స్ ఫోర్‌క్యాస్ట్ సర్వే' ప్రకారం ఈ ఏడాది బంగారం(ఔన్సు) విలువ అంతర్జాతీయ విపణిలో 7000 డాలర్ల(దాదాపు రూ.6.42 లక్షలు) మార్కును దాటే అవకాశం ఉంది. మనదేశంలో బంగారం ధర 2007లో తొలిసారి ఐదంకెల మార్కు.. అంటే, తులం రూ.10 వేలకు చేరింది!! అది రూ.20 వేల మార్కుకు చేరడానికి దాదాపు 3-4ఏళ్లు పట్టింది. అక్కణ్నుంచీ రెట్టింపు కావడానికి.. అంటే రూ.40 వేల మార్కు దాటడానికి తొమ్మిదేళ్లు పట్టింది. రూ.80 వేల మార్కు చేరడానికి ఐదేళ్లు పట్టింది. రూ.80 వేల నుంచి రెట్టింపు కావడానికి.. అంటే రూ.1.6 లక్షల మార్కుకు చేరడానికి పట్టిన సమయం ఎంతో తెలుసా..? కేవలం 1-2 ఏళ్లు! సాధారణంగా మనం బంగారాన్ని కాసులు, సవర్లు, తులాల్లో లెక్కిస్తాం. అంతర్జాతీయ మార్కెట్లో ఆ లెక్క ఔన్సుల్లో.. విలువ డాలర్లలో ఉంటుంది. ఔన్సు అంటే 28.3495 గ్రాములు. అయితే, బంగారం, వెండి వంటి లోహాలను లెక్కించేటప్పుడు మామూలు ఔన్సు కాకుండా.. ట్రాయ్ ఔన్సుల్లో లెక్కిస్తారు. ఒక ట్రాయ్ ఔన్సు 31.10.35 గ్రాములు. సోమవారం నాటి ధర 5000 డాలర్లంటే దాదాపుగా రూ.4.6 లక్షలు. అదే 7000 డాలర్లకు(ఒక ట్రాయ్ ఔన్స్ ధర దాదాపుగా రూ.6.42 లక్షలు!) పెరిగితే.. అప్పుడు తులం బంగారం ధర.. రూ.2.2 లక్షలకు చేరుతుంది.


ఆర్‌బీఐ వద్ద 880 టన్నుల బంగారం

ప్రపంచంలోని పలు ఇతర దేశాల కేంద్ర బ్యాంకుల్లాగానే.. 2022 నుంచి (రష్యాపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో) మన రిజర్వ్ బ్యాంకు కూడా పసిడి కొనుగోళ్లను భారీగా పెంచింది. ప్రస్తుతం మన రిజర్వ్ బ్యాంకు వద్ద 880 టన్నులకు పైగా బంగారం ఉంది. అందులో దాదాపు 512 టన్నుల బంగారం దేశీయంగా ఉండగా.. దాదాపు 348 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ కస్టడీలో ఉంచింది. మిగతా బంగారాన్ని గోల్డ్ డిపాజిట్ల రూపంలో దాచి ఉంచింది. ప్రపంచం మొత్తమ్మీదా అత్యధిక గోల్డ్ రిజర్వులు ఉన్న దేశాల్లో.. 8000 టన్నుల బంగారంతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. మన భారత్ 880 టన్నులతో ఎనిమిదో స్థానంలో నిలవడం గమనార్హం.

కారణాలేంటి?

కొత్త సంవత్సరం (2026) ప్రారంభమై ఇప్పటికి కేవలం 26 రోజులు మాత్రమే గడిచాయి. ఈ 26 రోజుల్లోనే బంగారం ధర ఏకంగా 18% పెరిగిందంటే.. దాని దూకుడు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి నేపథ్యంలో.. అమెరికా, యూరప్ దేశాలు రష్యాపై కఠిన ఆంక్షలు విధించి, డాలర్లలో ఉన్న రష్యా విదేశీ నిల్వలను స్తంభింపజేయడంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఒక భయం పుట్టింది. "రేపు మాపై కూడా ఇలాగే ఆంక్షలు విధిస్తే పరిస్థితేంటి?" అనే భయంతో పలు దేశాల కేంద్ర(రిజర్వ్) బ్యాంకులు డాలర్లపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడానికి పెద్ద ఎత్తున పసిడి కొనుగోళ్లను ప్రారంభించాయి. అప్పుడు మొదలైన పుత్తడి ధరల అసాధారణ దూకుడు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న విపరీతమైన నిర్ణయాలతో మరింతగా పెరిగింది. బంగారం ధరలు నానాటికీ ఎగబాకుతుండడంతో.. పెట్టుబడిదారుల్లో పుత్తడి కొనుగోళ్లపై ఆసక్తి పెరిగింది. 'ఇప్పుడు తక్కువ ధరలో కొనకపోతే.. బంగారం రేట్లు ఇంకా పెరిగిపోతాయేమో.. అలా పెరడగం ద్వారా వచ్చే లాభాలను కోల్పోతామేమో' అనే ఉద్దేశంతో చాలా మంది బంగారం కొంటున్నారు. దీనికితోడు డాలర్ బలహీనపడుతోంది. డాలర్ బలహీనమైనప్పుడు ఇన్వెస్టర్లు చూసేది బంగారం వైపే. పుత్తడి ధరలకు రెక్కలు రావడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

మశూచి నివారణకు కృషి చేసిన.. డాక్టర్ విలియం ఫేగీ మృతి



అట్లాంటా, జనవరి 26: ప్రపంచ వ్యాప్తంగా మశూచి వ్యాధిని నిర్మూలించేందుకు ఎంతో కృషి చేసిన డాక్టర్ విలియం ఫేగీ(89) అమెరికాలోని అట్లాంటాలో శనివారం మృతి చెందారు. ఆయన అమెరికా వ్యాధి నివారణ, నియంత్రణ కేంద్రాల డైరెక్టర్‌గా 1970-1980లో పని చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పలు వ్యాధుల నివారణ కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది మరణాలకు కారణమైన మశూచి వ్యాధి నివారణకు ఆయన తీవ్రంగా కృషి చేశారు. ఫేగీ, ఆయన సహచరులు నైజీరియా దేశంలో మశూచి నివారణకు అనుసరించిన విధానం చక్కని ఫలితాలనిచ్చింది. భారత్‌లోనూ ఆయన మశూచి నివారణకు పనిచేశారు.

బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులకే అనుమతి

డెహ్రాడూన్, జనవరి 26: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందూయేతరులను అనుమతించరు. అంతేకాదు ఈ 2పుణ్యక్షేత్రాల కమిటీ పరిధిలోకి వచ్చే మరో 46 ఆలయాల్లోకి కూడా హిందూయేతరులను అనుమతించరాదని బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి తదుపరి సమావేశంలో ప్రతిపాదనను ఆమోదిస్తామని కమిటీ చైర్మన్ హేమంత్ ద్వివేదీ తెలిపారు. చార్‌ధామ్ యాత్రలో భాగమైన మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గంగోత్రిలో ఇప్పటికే హిందూయేతరులను అనుమతించరాదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాలకు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ మద్దతు పలకగా కాంగ్రెస్ తప్పుబట్టింది.

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..నేడే

న్యూఢిల్లీ, జనవరి 26: చరిత్రాత్మక 'భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'పై మంగళవారం అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఢిల్లీలో జరిగే భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సు ఇందుకు వేదిక కానుంది. గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాల నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత బృందం ఈ సదస్సులో సమగ్రమైన చర్చలు నిర్వహించనుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలతో భారత్‌తోపాటు యూరప్ దేశాలు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్న నేపథ్యంలో.. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. ఈ ఒప్పందంతో 200 కోట్ల జనాభాతో కూడిన అతిభారీ మార్కెట్ ఆవిర్భవిస్తుందని, ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు 25 శాతానికి సమానమని ఇటీవల ఉర్సులా వ్యాఖ్యానించటం ఈ ఒప్పందానికి ఉన్న ప్రాముఖ్యతను తెలుపుతోంది. సరుకుల వాణిజ్యానికి సంబంధించి భారత్‌కు ఈయూ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024-25లో ఈయూతో భారత్ 13,600 కోట్ల యూరోల (రూ.14,79,136 కోట్లు) వాణిజ్యం జరిపింది.

గణతంత్ర వేడుకల్లో రాహుల్‌కు మూడో వరుసలో సీటా?

- ఇది ఆయన్ను అవమానించేందుకే: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 26: ఢిల్లీ కర్తవ్య పథ్‌లో గణతంత్ర దినోత్సవాల కవాతును వీక్షించేందుకు విపక్ష నేతలకు కేటాయించిన సీట్ల కేటాయింపుపై రగడ జరుగుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు మూడో వరుసలో సీట్లు కేటాయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. ఇది కేంద్ర ప్రభుత్వ అసహనాన్ని సూచిస్తోందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుర్జేవాలా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బీజేపీ కావాలనే రాహుల్ గాంధీని అవమానించిందంటూ కాంగ్రెస్ ఎంపీ మాణికమ్ ఠాగోర్ ఆరోపించారు. 2014లో అద్వానీ లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేత కాకున్నా ముందు వరుసలో సీటు కేటాయించామంటూ ఆయన పాత ఫొటోను ఎక్స్‌లో జత చేశారు. అయితే ప్రొటోకాల్ వ్యవహారాలను రాష్ట్రపతి సచివాలయం నిర్ణయిస్తుందని బీజేపీ స్పష్టం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం విపక్ష నేతలు ఏడో ర్యాంక్ కిందకు వస్తారని, కాంగ్రెస్ కావాలనే రాజకీయం చేస్తోందని తెలిపింది.

ఈ అసెంబ్లీ ఎన్నికలు.. ఆర్య-ద్రావిడుల మధ్య సరికొత్త సమరం!

- తమిళనాడుపై మోదీ దుష్ప్రచారం: స్టాలిన్



చెన్నై, జనవరి 26: తమిళనాడులో నాలుగు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఆర్యులు, ద్రావిడుల మధ్య సరికొత్త యుద్ధంగా మారతాయని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ అన్నారు. ప్రధాని మోదీ, ఆయన పార్టీ బీజేపీ తమిళనాడు భాషా సంస్కృతులను న్యూనత పరచాలని చూస్తున్నట్లు ఆరోపించారు. 1960ల్లో రాష్ట్రంలో హిందీ భాషకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో హిందీని బలవంతంగా రుద్దడాన్ని నిరసిస్తూ తిరుచిరాపల్లికి చెందిన చిన్నసామి అనే వ్యక్తి ప్రాణత్యాగం చేశాడు. దీనిని పురస్కరించుకుని రాష్ట్రంలో ఏటా జనవరి 25న 'భాషా అమరవీరుల దినం' నిర్వహిస్తుంటారు. ఆదివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో స్టాలిన్ ప్రసంగిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. సోమవారం తంజావూరు సమీపంలోని సెంగిపట్టి మైదానంలో జరిగిన డీఎంకే మహిళా విభాగం డెల్టా జోన్ మహానాడు సభలో కూడా ప్రసంగించారు. ఇండో-ఆర్యన్ తెగలు ఉత్తరాది నుంచి స్వదేశీ ద్రావిడులను దక్షిణాదికి తరిమివేసి ఉత్తర భారతంలో స్థిరపడ్డారని తమిళనాడులో ఓ వాదన ప్రచారంలో ఉంది. ఆర్య-ద్రావిడ సమరం వ్యాఖ్యలతో స్టాలిన్ మరోసారి వాటిని తెరపైకి తెచ్చారు.

అమెరికాను ముంచెత్తిన మంచు తుఫాను

- అడుగులోతులో పేరుకుపోయిన హిమం
- స్తంభించిన జనజీవనం..13 మంది మృతి
- విమానం కూలి మరో ఏడుగురి దుర్మరణం

వాషింగ్టన్, జనవరి 26: మంచు తుపాను కారణంగా అమెరికా గడ్డకట్టింది. ఆది, సోమవారాల్లో ఎడతెరిపి లేకుండా మంచు కురుస్తుండడంతో పాటు, చలిగాలులు వీస్తుండడంతో జనజీవనం స్తంభించింది. వర్షం కూడా మంచు రూపంలోనే పడుతుండడం మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. రోడ్లపై మంచు పేరుకు పోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చెట్లు, కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్తు సరఫరా కూడా ఆగిపోయింది. అమెరికాలోని తూర్పు, దక్షిణ రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. మంచు తుపాను కారణంగా 13 మంది ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం అందింది. ఆర్కానస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు 2,100 కి.మీ. మేర అడుగులోతులో మంచు పేరుకుపోవడంతో వాహనాలను నడిపేందుకు అవకాశమే లేకుండా పోయింది. కొన్ని చోట్లయితే రెండు అడుగుల లోతులో మంచు గడ్డలు ఉండడంతో నడవడమే కష్టంగా మారింది. మసాచ్యుయెట్స్ రాష్ట్రంలోని ఫాల్ మౌత్ వద్ద మంచు పెద్ద షీట్లు రూపంలో కనిపిస్తోంది. ఈ కారణంగా 19,000 విమాన సర్వీసులను రద్దు చేయడమో, ఆలస్యంగా నడపడమో జరిగిందని ఆ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మయినేలోని బాన్‌గోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయివేటు విమానం కూలి ఏడుగురు మరణించగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. ఆదివారం రాత్రి టేకాఫ్ అవుతున్న సమయంలో భారీగా గాలివీయడంతో ఆ విమానం కుప్పకూలింది. న్యూయార్క్‌లో తీవ్రమైన చలితో కనీసం అయిదుగురు మరణించినట్టు మేయర్ జోహ్రాన్ మమ్దానీ చెప్పారు.



అమెరికాలోని ఒక్లహోమా రాష్ట్రంలో ఇళ్లను పూర్తిగా కప్పేసిన మంచు



'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో తిరంగా రెపరెపలు

- సంస్థ ప్రధాన కార్యాలయంలో జెండా ఎగరేసిన ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో సోమవారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఫిలింనగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్ కోగంటి భానుప్రకాష్, ఉభయ సంస్థల్లోని అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర గర్భంలో మువ్వన్నెల జెండా

సాగర్‌నగర్ (విశాఖపట్నం), జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలో స్కూబా డైవర్లు సముద్రగర్భంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. రుషికొండ బీచ్‌లో లైవ్ ఇన్ అడ్వంచర్స్ వ్యవస్థాపకుడు బలరామ్‌నాయుడు ఆధ్వర్యంలో ఐదుగురు స్కూబా డైవర్లు, రుషికొండ ఐటీ హబ్ జంక్షన్ సమీపాన ఉన్న సముద్ర గర్భంలో డైవ్ అడ్డా సీఈఓ భద్రం రామిశెట్టి ఆధ్వర్యంలో ఐదుగురు స్కూబా డైవర్ల బృందం 77 అడుగుల లోతులో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జెండాకు వందనం చేశారు.



అమరావతిలో గణ..తంత్రం

- రాష్ట్ర రాజధానిలో తొలిసారి వేడుకలు
- పోటెత్తిన ప్రజలు, రైతులు, విద్యార్థులు
- గ్యాలరీలు సరిపోక బయటే నిలబడిన వైనం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్
- హాజరైన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్

గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి తొట్టతొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలకు వేదిక అయింది. రెట్టింపు జనంతో, రెట్టించిన ఉత్సాహంతో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇప్పటి వరకూ విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలోనే గణతంత్ర వేడుకలు జరిగేవి. ఈసారి అమరావతిలోని రాయపూడిలో ఏర్పాటు చేసిన పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ ఏర్పాట్లు ప్రభుత్వం చేసింది. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించింది. దీంతో రాజధాని, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో రైతులు, సామాన్య ప్రజలు గణతంత్ర వేడుకలకు హాజరయ్యారు. వందల సంఖ్యలో విద్యార్థినీవిద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో అనుకున్న దానికంటే కూడా రాజధానిలో రిపబ్లిక్ డే వేడుకలు అట్టహాసంగా జరిగాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, రక్షణ దళాల వందనాన్ని స్వీకరించారు. అనంతరం పౌరులను ఉద్దేశించి సందేశాన్ని అందించారు. ఈ వేడుకల్లో కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్, సీఆర్పీఎఫ్, కేరళ రాష్ట్ర పోలీస్, విశాఖ ఏపీఎస్పీ 16వ బెటాలియన్, ఎన్‌సీసీ (బాలురు), ఎన్‌సీసీ (బాలికలు), ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాల, బాలికలు), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బాల, బాలికలు), యూత్ రెడ్ క్రాస్ (బాలురు) కంటింజెంట్స్ కవాతును నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇండియన్ ఆర్మీ కంటింజెంట్‌కు మొదటి స్థానం, విశాఖ ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు రెండో స్థానం, కాన్సులేషన్ ప్రైజ్‌ను కేరళ పోలీస్ కంటింజెంట్‌కు అందించారు. పరేడ్‌లో ప్రధానంగా బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ ఆహుతులను అలరించాయి. పరేడ్‌కు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీ బి. రాజకుమారి నోడల్ మహిళా అధికారిగా, డీఐజీ కె.ఫకీరప్ప కో ఆర్డినేటింగ్ అధికారిగా వ్యవహరించారు.



అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భద్రతాదళాల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, దళాలకు నేతృత్వం వహించిన ఐపీఎస్ అధికారి సుస్మిత



వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ దంపతులు

గణతంత్ర వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దంపతులు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, హైకోర్టు న్యాయమూర్తులు,

రాజకీయ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, గుంటూరు కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న ప్రగతి రథాలు

వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక అవగాహన తదితర అంశాలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు కనువిందు చేశాయి. వందే మాతరం- 150 సంవత్సరాల ఇతివృత్తంగా రూపొందించిన సాంస్కృతిక శాఖ శకటానికి ప్రథమ బహుమతి వచ్చింది. 'మహిళా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం' అనే ఇతివృత్తంతో రూపొందిన సెర్ప్ శకటానికి ద్వితీయం, పెట్టుబడుల ద్వారా ఉపాధి ఇతివృత్తంగా రూపొందిన పరిశ్రమల శాఖ శకటానికి తృతీయ స్థానం లభించింది. వీటితోపాటు 'జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి'- ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య, విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ; 'నైపుణ్యం, ఉపాధి'- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పాఠశాల విద్యా శాఖ; 'నీటి సంరక్షణ' పర్యాటక శాఖ, జలవనరుల అభివృద్ధి శాఖ, మైక్రో ఇరిగేషన్, అటవీ శాఖలు; 'రైతు- వ్యవసాయ సాంకేతికత'- వ్యవసాయ శాఖ, మత్స్య శాఖలు, మౌలిక వసతులు- పెట్టుబడులు, సముద్ర, వైమానిక రంగాలు, సీఆర్డీఏలు; 'ఖర్చు తగ్గింపు'- శక్తి, ఇంధనం నెడ్‌క్యాప్ (ఇంధనం); 'ఉత్పత్తి పరిపూర్ణత'- చేనేత, జౌళి శాఖ, ఉద్యానవన శాఖ; 'స్వచ్ఛ ఆంధ్ర'- పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్టీజీఎస్ శాఖల శకటాలు ప్రభుత్వ సంకల్పం, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ఆవిష్కరించాయి. ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ కళారూపాల మేళవింపుతో రూపొందిన శకటాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పరేడ్ గ్రౌండ్ కిటకిట..

అమరావతిలో నిర్వహిస్తున్న తొలి గణతంత్ర వేడుకలు కావడంతో ప్రభుత్వం, సీఆర్డీఏ భారీ ఏర్పాట్లు చేసింది. రాయపూడిలో 25 ఎకరాల స్థలంలో భారీ స్థాయిలో గ్యాలరీలను ఏర్పాటు చేసి పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేసింది. దాదాపు 13వేల మంది వరకూ వేడుకల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు. అయితే, అంతకు మించిన స్థాయిలో ప్రజలు, ప్రధానంగా స్థానిక రైతులు, విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు, యువకులు హాజరయ్యారు. ఈ కారణంగా పబ్లిక్ గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. కొంచం ఆలస్యంగా వచ్చినవారికి లోపలికి వెళ్లేందుకు అవకాశం కూడా దక్కలేదు. దీంతో వారంతా బయటే నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ ఏర్పాట్లు చేయడంతో రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు వాటిల్లలేదు.



రిపబ్లిక్‌డే వేడుకలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దంపతులు



వేడుకలకు హాజరైన నారా భువనేశ్వరి, గవర్నర్ సతీమణి సమీరా నజీర్



గణతంత్ర వేడుకలకు హాజరైన రాజధాని రైతులు



ఎట్ హోమ్‌లో గవర్నర్, హైకోర్టు సీజే, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు



జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఎం

సీఎం క్యాంపు కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన చంద్రబాబు
- పార్టీ కార్యాలయంలో పల్లా ఆధ్వర్యంలో వేడుకలు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భద్రతా సిబ్బంది, అధికారులకు స్వీట్లు పంచి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన 105 అడుగుల ఎత్తైన జాతీయ జెండాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆటోమేటిక్ మూవింగ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను రిమోట్ సాయంతో ఆవిష్కరించేలా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పర్చూరి అశోక్‌బాబు, దారపనేని నరేంద్ర, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మంత్రి మనోహర్ తదితరులు

జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు. పార్టీ నేతలకు సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఇతర నేతలు పాల్గొన్నారు.

ప్రజల్లో తిరిగి విశ్వాసం!

అమరావతిలో మొదటి రిపబ్లిక్‌డే వేడుకలు చరిత్రాత్మకం: గవర్నర్

- కొన్నేళ్లు రాష్ట్రానికి దశ, దిశ లేదు
- రాజధాని పనులు నిలిచిపోయాయి
- పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లింది
- ఈ సవాళ్ల మధ్య కూటమి ప్రభుత్వం తిరిగి పనులు ప్రారంభించింది
- గణతంత్ర వేడుకల్లో అబ్దుల్ నజీర్



అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో త్రివర్ణ పతాకం ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న గవర్నర్ నజీర్, డీజీపీ గుప్తా తదితరులు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు జరుపుకోవడం చరిత్రాత్మకమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కొన్నేళ్ల పాటు రాష్ట్రానికి దశ, దిశ లేకుండా రాజధాని ప్రాజెక్టు పనులు నిలిచిపోయి, ఆర్థిక విశ్వాసం దెబ్బతిందని.. రాజధాని నిర్మాణం కొనసాగించకపోవడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లిందని చెప్పారు. ఈ సవాళ్ల మధ్య కూటమి ప్రభుత్వం తిరిగి పనులు ప్రారంభించి రాష్ట్ర ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఫలితాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రాజెక్టులు ముందుకు కదులుతున్నాయని.. జనంలో తిరిగి నమ్మకం కలిగిస్తున్నామని తెలిపారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతిలోని నేలపాడులో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. వీడియో సందేశం కూడా విడుదల చేశారు. 'ప్రియమైన ఆంధ్రప్రదేశ్ సోదర, సోదరీమణులందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు, అభినందనలు. భగవంతుడి ఆశీస్సులు మీ అందరికీ ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఎంచుకున్న పది సూత్రాల అమలుతో లక్ష్యాలను నెరవేరుస్తామన్న నమ్మకం కలుగుతోందన్నారు. 'తెలుగు ప్రజలు ప్రగతి శిల్పులు.. లక్షల మందిని పోషిస్తున్న మన రైతులు, ప్రమాదాలను లెక్కచేయకుండా సముద్రపు అలలతో పోరాడే మత్స్యకారులు, మనసులను వెలిగించే ఉపాధ్యాయులు, కరుణతో సేవ చేసే ఆరోగ్య కార్యకర్తలు, కొత్త ఆలోచనలకు రూపమిచ్చే మేధావులు, భవిష్యత్‌ను నిర్మిస్తున్న మహిళలను, జీవనోపాధులను సృష్టిస్తున్న వ్యాపారవేత్తలను ఇక్కడ చూస్తున్నాను' అని ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబానికి సాధికారిత కల్పించేందుకు ప్రభుత్వం సూపర్‌సిక్స్ అమలు చేస్తోందని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సంపద సృష్టితో సంక్షేమం..

సంపద సృష్టితో విస్తృత సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అందరి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది. వృద్ధులకు నెలవారీ పెన్షన్ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, డయాలసిస్, కిడ్నీ బాధితులకు రూ.10 వేలు, ప్రమాద బాధితులకు రూ.15 వేలు చొప్పున అందిస్తున్నాం. దీపం 2.0 ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు 1.08 కోట్ల పేద లబ్ధిదారులకు అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభించాం. ఎస్సీ వర్గీకరణ చేశాం. బీసీలకు ఈ ఏడాదిలో బీసీ కార్పొరేషన్ల ద్వారా రూ.11,620 కోట్లు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. వారికి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతిస్తూ, స్థానిక సంస్థల్లో 34 శాతం కోటాకు కృషి చేస్తున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సాయం, సమాచారం, న్యాయం సత్వరమే ప్రజలకు అందిస్తున్నాం. అందరం కలిసి ఆరోగ్య, సంపద, ఆనందకరమైన సమాజాన్ని నిర్మిద్దాం.

2047 నాటికి రూ.3.8 లక్షల కోట్ల ఎకానమీ!

రాష్ట్రప్రభుత్వం పేదరికాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచుతోంది. ఇప్పటికే జీరో పావర్టీ, పీ-4 పాలసీని చేపట్టింది. 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసింది. 2047 నాటికి రూ.3.8 లక్షల కోట్ల ఎకానమీ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. వికసిత్ భారత్ విజన్-2047తో కలిసి రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 55 లక్షలకు పెంచాలని టార్గెట్ పెట్టుకుంది. 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు వ్యవసాయం, పరిశ్రమలు, సంక్షేమం, పెట్టుబడుల రంగాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. పెట్టుబడిదారుల అనుకూల విధానాలు తీసుకొచ్చింది. ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. 2025-26లో దేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో నాలుగో వంతు సాధించింది. - గవర్నర్



మంత్రి లోకేశ్‌ను ఆశీర్వదిస్తున్న గవర్నర్ సతీమణి సమీరా నజీర్



శకటాల ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన సాంస్కృతిక శాఖ శకటం
గవర్నర్ నుంచి బహుమతి అందుకుంటున్న జీఏడీ ముఖ్యకార్యదర్శి శ్యామల రావు (ఇన్‌సెట్)



ద్వితీయ బహుమతి పొందిన సెర్ప్-ఏపీ శకటం
గవర్నర్ నుంచి బహుమతి అందుకుంటున్న ఆ శాఖ అధికారి (ఇన్‌సెట్)

లోక్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోమ్

- అతిథుల వద్దకు వెళ్లి పలుకరించిన గవర్నర్
- లోకేశ్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన అబ్దుల్ నజీర్



లోక్‌భవన్‌లో గవర్నర్, హైకోర్టు సీజే, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం సాయంత్రం విజయవాడలోని లోక్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఆయన భార్య గుడియా ఠాకూర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజెనెవా, విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తదితరులు హాజరయ్యారు. సాయంత్రం 4.32 గంటలకు లోక్‌భవన్‌కు చేరుకున్న చంద్రబాబు, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పవన్ కల్యాణ్.. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి.. ఎట్ హోం వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం జాతీయగీతాలపన జరిగింది. గవర్నర్ అతిథుల వద్దకు స్వయంగా వెళ్లి పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన, సీఎం, సీజే, డిప్యూటీ సీఎం కాసేపు చర్చించుకున్నారు. సీఎంతో చర్చ మధ్యలో లోకేశ్‌ను కూడా గవర్నర్ పిలిచి ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. గంట తర్వాత జాతీయ గీతాలాపనతో ఎట్ హోమ్ ముగిసింది. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకీయా ఖానం, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మంత్రులు పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్.సవిత, రాంప్రసాద్‌రెడ్డి, కె.శ్రీనివాస్. హైకోర్టు న్యాయమూర్తులు, పద్మ అవార్డు గ్రహీతలతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, జీఏడీ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) శ్యామలరావు, అధికారులు పాల్గొన్నారు.

ఏం సార్.. సన్నబడిపోతున్నారు?

- బొత్సను ఆప్యాయంగా పలుకరించిన లోకేశ్
- శారీరకంగా తగ్గుతున్నా.. ఫైటింగ్ స్పిరిట్ తగ్గలేదు: బొత్స



మంత్రి లోకేశ్‌తో సరదాగా ముచ్చటిస్తున్న బొత్స. చిత్రంలో బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్

రాజకీయాల్లో ఉప్పు, నిప్పులా వ్యవహరిస్తున్న టీడీపీ, వైసీపీ మధ్య ఆప్యాయ పలకరింపులకు లోక్‌భవన్ వేదికైంది. గత ఏడాది ఎట్ హోం కార్యక్రమానికి వైసీపీ దూరంగా ఉంది. ఈ ఏడాది మాత్రం ఆ పార్టీ తరఫున బొత్స, మరో ఎమ్మెల్సీ ఎం.డి.రుహుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స లోకేశ్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. బొత్సను చూస్తూనే... 'ఏం సార్.. సన్నబడిపోతున్నారు..! నీరసంగా కనిపిస్తున్నారు. ఆరోగ్యం ఎలా ఉంది' అని లోకేశ్ కుశల ప్రశ్నలు వేశారు. ఆ సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పక్కనే ఉన్నారు. బొత్స స్పందిస్తూ... 'శారీరకంగా కొంచెం వీక్‌గా ఉన్నా.. రాజకీయంగా ఫైటింగ్ స్పిరిట్ తగ్గలేదు' అని సమాధానమిచ్చారు. 'ఆరోగ్యం జాగ్రత్త సార్' అని లోకేశ్ మరోసారి ఆప్యాయంగా చెప్పారు. కార్యక్రమం మధ్యలోనే బొత్స రుహుల్లా వెళ్లిపోయారు.

రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలు రాజ్యాంగ పరిధికి లోబడే ఉండాలి

▸ సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గోపాలగౌడ సూచన



మదనపల్లె టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలు రాజ్యాంగ పరిధికి లోబడే ఉండాలని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అభిప్రాయపడ్డారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో బార్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రసంగం అనంతరం న్యాయవాదులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన వివరంగా సమాధానాలు ఇచ్చారు. గవర్నర్ల స్థానాల్లో ఉన్నవారు గౌరవ, మర్యాదలను కాపాడుకోవాలని జస్టిస్ గోపాలగౌడ సూచించారు. న్యాయాధికారులు ఎగ్జిక్యూటివ్ ఒత్తిళ్లకు లోనుకాకుండా రాజ్యాంగం, చట్టాలకు అనుగుణంగా, ధైర్యంగా తీర్పులు ఇవ్వాలని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత న్యాయాధికారులు ప్రభుత్వ పదవులు స్వీకరించడం తగదన్నారు. పదవీ విరమణ తర్వాత తనకూ లోకాయుక్త పదవిని పలు రాష్ట్రాల సీఎంలు ఆఫర్ చేయగా తిరస్కరించానని చెప్పారు.

బండ్ల గణేశ్‌కు లోకేశ్ ఫోన్

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కాలినొప్పితో బాధపడుతున్న సినీ నిర్మాత బండ్ల గణేశ్‌ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఫోనులో పరామర్శించారు. వైసీపీ హయాంలో అక్రమ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లిన చంద్రబాబు, జైలు నుంచి విడుదలైతే కాలినడకన తిరుమలకు వస్తానని బండ్ల గణేశ్ మొక్కుకున్నారు. మొక్కు చెల్లించుకునేందుకు వారం క్రితం గణేశ్.. షాద్‌నగర్ టు తిరుమల పాదయాత్ర ప్రారంభించారు. ఈ క్రమంలో తీవ్రమైన కాలినొప్పికి లోనవడంతో లోకేశ్ ఫోన్ చేసి... పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మార్క్ టులీ మృతికి సీఎం సంతాపం

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్టు, బీబీసీ మాజీ బ్యూరో చీఫ్ మార్క్ టులీ మృతికి సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతదేశ రాజకీయ పరిణామాలను కొన్ని దశాబ్దాలపాటు సమర్థవంతంగా ఆవిష్కరించిన ఘనత టులీకి దక్కుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. టులీ కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలిపారు. మార్క్ టులీ మృతికి మంత్రి లోకేశ్ కూడా సంతాపం తెలిపారు.

పెరుగుతున్న ఎండలు.. నందిగామలో 33.6 డిగ్రీలు

విశాఖపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సోమవారం నందిగామలో 33.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో మాత్రం చలి ప్రభావం కొనసాగుతోంది. ఉత్తరకోస్తాలోని పలు జిల్లాల్లో పొగమంచు కురిసింది. రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న 24గంటల్లో కోస్తా, సీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని, ఉత్తర కోస్తాలో పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఈ ఏడాదే గగన్‌యాన్-జీ1 ప్రయోగం

▸ షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్

సూళ్లూరుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టు పనులు కీలక దశకు చేరుకున్నాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ తెలిపారు. గగన్‌యాన్-జీ1 ప్రయోగం ఈ ఏడాదే ఉంటుందన్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఏడాది తొలుత మానవ రహితంగా గగన్‌యాన్-జీ1, గగన్‌యాన్-జీ2, గగన్‌యాన్-జీ3 ప్రయోగాలు చేపడతామన్నారు. ఇక చివరగా వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ ప్రయోగం 2027లో ఉంటుందని వెల్లడించారు. పీఎస్ఎల్వీ-సీ61, పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగాల వైఫల్యానికి కారణాలను అన్వేషిస్తున్నామని పద్మకుమార్ చెప్పారు.

అమరావతిలో వేడుకలతో వైసీపీకి వణుకు: కలిశెట్టి



న్యూఢిల్లీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ వైభవాన్ని చూసి వైసీపీ నేతల్లో గుబులు మొదలైందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత అమరావతిలో గణతంత్ర వేడుకలు తొలిసారి ఇంత ఘనంగా జరగడంపై హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలో పండగ వాతావరణాన్ని చూసి జగన్మోహన్ రెడ్డిసహా వైసీపీ నాయకులకు వణుకు పుట్టిందన్నారు.

రైతు సేవలో పునరంకితం కావాలి: అగ్రి వర్సిటీ వీసీ

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వరాజ్యం కోసం పోరాడిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని, భారత రాజ్యాంగం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ విధులకు పునరంకితం కావాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ శారదా జయలక్ష్మీ దేవి అన్నారు. సోమవారం గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని లాంలోని వర్సిటీ ప్రాంగణంలో ఆమె జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్య, పరిశోధన, విస్తరణ విభాగాలు రైతు సేవలో నిమగ్నం కావాలని అన్నారు. రిజిస్ట్రార్ ఎంవీ రమణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, సేవా దృక్పథంతో పని చేస్తున్న విపత్తు నిర్వహణ సంస్థ ఉద్యోగులను అభినందించారు.

రాజ్యాంగ పీఠిక ఆశయాలకు బద్ధులవ్వాలి: సీపీఐ

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరం పునరంకితమవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 'రాజ్యాంగ పీఠిక ప్రకటించిన ఆశయాలకు అందరూ బద్ధులై ఉండాలి. రాజ్యాంగంలోని సామ్యవాద, లౌకిక అనే పదాలను కనుమరుగు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాల నేతృత్వంలో కుట్ర జరుగుతోంది' అని ఈశ్వరయ్య ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

హింసను ప్రశ్నించినా బెదిరింపులే!

▸ ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై తీవ్ర హింస

▸ ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె.టీచర్



హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలని, ఆ విషయం దేశవ్యాప్తంగా ఇప్పుడు సామాన్య ప్రజలకు కూడా తెలిసిపోయిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలె అన్నారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై హింస జరుగుతున్నా.. దానికి వ్యతిరేకంగా పోరాటం చేయలేని భయంకర పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఉద్యమకారులను బీజేపీ నాయకులు పదేపదే బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఐద్వా 14వ మహాసభల సందర్భంగా హైదరాబాద్‌లో ఆమె మాట్లాడారు. మణిపూర్‌లోని సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రగిలిస్తున్నారని విమర్శించారు. పుదుచ్చేరిలో రేషన్‌కు బదులు నేరుగా నగదు ఇస్తుండటంతో పేదల ఆహార భద్రతకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ.. పాలస్తీనా, వెనెజువెలాకు సంఘీభావం తెలుపుతూ మహాసభల్లో తీర్మానాలు ఆమోదించినట్లు ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు పి.కె.టీచర్ తెలిపారు.

సుజలాం.. సస్యశ్యామలాం!

(మొదటి పేజీ తరువాయి)



ఆర్టీజీఎస్‌పై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక, వ్యవసాయ-అనుబంధ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జల వనరుల శాఖలను ఆదేశించారు. దీనిపై మంగళవారం ఆయా శాఖలతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి అందే నిధులు, చేపట్టే పనులపై ఈ భేటీలో పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశముంది. 'సుజలాం - సస్యశ్యామలాం' లేదా మరో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా జలగలగలలు వినిపించేలా బృహత్తర ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిసింది.

ఉద్యాన వన'సీమ'

ఒకప్పుడు కరువు సీమగా పేరొందిన రాయలసీమ ఇప్పటికే పండ్ల తోటలకు (హార్టికల్చర్) చిరునామాగా మారింది. ఇప్పుడు రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం, ప్రకాశం జిల్లాలనూ కలిపి 'హార్టికల్చర్ హబ్'గా మార్చేందుకు కేంద్ర నిధులను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. దీనికోసం కేంద్రం రెండు దశల్లో రూ.10వేల కోట్లు ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఆ జిల్లాల్లో పండ్లతోటలకు, పొలాలకు నీరందించడతోపాటు, వాటి రవాణా కోసం గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తారు. దీనికోసం 'జీరామ్‌జీ' (ఉపాధి హామీ)పథకం, వాటర్ షెడ్, బిందు సేద్యం సంబంధిత కేంద్ర ప్రాజెక్టుల నుంచి నిధులు రాబడతారు. పండ్ల తోటలకు నీరందించడం నుంచి మార్కెటింగ్‌కు అవసరమైన రవాణా దాకా ప్రతి దశలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తారు.

'పూర్వోదయ' ద్వారా...

తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, ఒడిసా, పశ్చిమ బెంగాల్‌తోపాటు బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం 'పూర్వోదయ' పథకం పరిధిలోకి తెచ్చింది. ఈ ఐదు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, ఆర్థికాభివృద్ధికి నిధులు కేటాయించి... వేగవంతమైన అభివృద్ధికి బాటలు పరచడం, 'వికసిత్ భారత్'లో తూర్పు భారత భాగస్వామ్యాన్ని కీలకంగా మార్చడమే ఈ పథకం లక్ష్యం. దీని ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఈ పథకం ద్వారా అందే నిధులతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. అదే జరిగితే 3,97,339 ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పాటవుతుంది. 25 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. తోటపల్లి బ్యారేజీ, తారకరామతీర్థ సాగర్, వంశధార రెండో దశలో స్టేజ్-2, గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల నుంచి హిరమండలం దాకా నీటి తరలింపు, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్, గజపతినగరం బ్రాంచి కెనాల్, వంశధార-నాగావళి లింక్ కెనాల్, నాగావళి - చంపావతి అనుసంధానం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాల పూర్తికి రూ.5వేల కోట్లు అవసరమని జల వనరుల శాఖ అంచనా వేసింది. గోదావరి డెల్టా సిస్టమ్ కాలువల అభివృద్ధి, కృష్ణా డెల్టా సిస్టమ్ కాలువల అభివృద్ధి, బుడమేరు, ఉప్పుటేరు కాలువల అభివృద్ధి, బుడమేరు కాలువ మళ్లింపు, వరికెలపూడిశెల, ఏఎస్ఆర్ సోమశిల హెచ్ఎల్‌సీ ప్రాజెక్టు తొలి దశ... ఈ పనుల పూర్తికి రూ.9100 కోట్లు అవసరం. అంటే... మొత్తంగా రూ.14,100 కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయవచ్చు. 'పూర్వోదయ' నిధులను ఈ ప్రాజెక్టుల పూర్తికి ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రాజెక్టులపై ఫోకస్

2024లో అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోనే హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువను అభివృద్ధి చేయడం ద్వారా కుప్పం దాకా నీటిని తీసుకు వెళ్లగలిగారు. ప్రాజెక్టులలో సమర్థ నీటి యాజమాన్య విధానాలను ఆచరించడం ద్వారా భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ప్రాజెక్టులను పూర్తి చేసి.. వరదల కాలంలో నీటిని ఎత్తిపోతల పథకాలు, చెరువుల్లోకి పంపించడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని గడచిన రెండేళ్లుగా అమలు చేస్తున్న నీటి యాజమాన్య విధానాలు రుజువు చేశాయి. దీంతో... పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

'ప్రణాళికా' బద్ధంగా...

'సుజలాం - సస్యశ్యామలం' కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి కొన్నాళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. తన ఢిల్లీ పర్యటనల్లో దీనిపైనే దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో... రెండు దశల్లో రూ.10వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. అలాగే... పెండింగ్ ప్రాజెక్టుల కోసం 'పూర్వోదయ' నిధులను గరిష్ఠ స్థాయిలో రాబట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారంనాటి సమావేశంలో శాఖల వారీగా సమగ్ర నివేదికలను యుద్ధ ప్రాతిపదికన తయారు చేయాలని సూచించే అవకాశముంది.

పాలనలో సాంకేతికత వినియోగం

▸ ఉద్యోగులపై పనిభారం తగ్గించేందుకు చర్యలు

▸ కృత్రిమ మేధతో త్వరితగతిన సమస్యల పరిష్కారం

▸ టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా 2026

▸ ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పరిపాలనలో సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉద్యోగులపై పనిభారం తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఉన్నతస్థాయి అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్షించారు. సాంకేతికతలో ఉద్యోగులకు సమర్థవంతమైన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సీఎం సూచించారు. శిక్షణ సమయంలో ఉద్యోగులు అందుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించాలన్నారు. టెక్నాలజీని అధికారులు, ఉద్యోగులు వినియోగించుకునే విధంగా ప్రోత్సహించాలని నిర్దేశించారు. 2026ను టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా చంద్రబాబు అభివర్ణించారు. కృత్రిమ మేధను వినియోగించడం ద్వారా ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తామని వెల్లడించారు. కాగా, మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటి వరకూ కోటీ 43 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు.

చట్టసభలే ప్రజాస్వామ్యానికి గుండెకాయ

▸ ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలి: స్పీకర్ అయ్యన్న

▸ మహోన్నతమైనది భారత రాజ్యాంగం: మండలి చైర్మన్ మోషేన్‌రాజు

అమరావతి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి చట్టసభలే గుండెకాయ అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం అసెంబ్లీ భవనం ముందు మహాత్మాగాంధీ చిత్ర పటానికి ఆయన నివాళి అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ 'గణతంత్ర రాజ్యానికి మూలం ప్రజలే. ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరముంది. శాసనసభ్యులకు నో వర్క్-నో పే విధానం ఉండాలి. తీరు మార్చుకోని సభ్యులపై ప్రజలకు రీకాల్ హక్కు కల్పించాల్సిన అవసరం ఉంది' అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, జాయింట్ సెక్రటరీ విజయరాజు, డిప్యూటీ సెక్రటరీలు రాజ్‌కుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కౌన్సిల్ భవనం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో శాంతియుతంగా జీవించే హక్కును కల్పించిన భారత రాజ్యాంగం అన్ని గ్రంథాల కన్నా మహోన్నతమైనదన్నారు. సచివాలయం మొదటి బ్లాక్ వద్ద జాతీయ పతాకాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో రాష్ట్రాన్ని, దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగమంతా లక్ష్యసాధనకు కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, సచివాలయ భద్రతాధికారి మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాసన సభ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

మన రాజ్యాంగం... న్యాయ వ్యవస్థకు దీప స్తంభం



హైకోర్టు ఆవరణలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రగతిశీల భారత నిర్మాణానికి కృషి చేద్దాం: హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్

అమరావతి, తుళ్లూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 'భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మార్గదర్శి. న్యాయ వ్యవస్థకు దీప స్తంభం' అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆవరణలో 77వ భారత గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'చట్టాధిపత్యం, వివక్ష రహిత సమాజం, పౌర హక్కుల పరిరక్షణ, ప్రజల సంకల్పాధిపత్యం అనే మూల సూత్రాలు భారత ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. భారత ప్రజల ఆశ, విశ్వాసం, పునరుద్ధరణకు గణతంత్ర దినోత్సవం ప్రతీకగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, హక్కుల సమన్వయంగా ప్రతి పౌరుడికి నిర్భయంగా జీవించే, స్వప్నాలను సాకారం చేసుకునే హక్కును ఇస్తుంది. బలమైన, ఐక్యమైన సుస్థిరమైన, ప్రగతిశీల భారత నిర్మాణానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలి' అని సీజే పిలుపునిచ్చారు. అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, అడ్వకేట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్ తదితరులు ప్రసంగించారు. ఈ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, పలువురు రిజిస్ట్రార్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా న్యాయ సేవలు

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జెండాను ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా న్యాయసేవలు ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా సోమవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (లీగల్ సెల్ అథారిటీ) కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా న్యాయసేవాధికార సంస్థలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హిమబిందు, రాష్ట్ర న్యాయసేవల కమిటీ కార్యదర్శి మాలతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నా.. నా భూమిని ఆక్రమించారు

▸ విమానాశ్రయంలో పవన్ వద్ద మహిళ కన్నీరు

▸ కాకినాడ రియల్టర్‌పై ఫిర్యాదు

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వెంచర్‌కు దారి కోసం ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన పొలాన్ని ఆక్రమించుకున్నాడని కాకినాడకు చెందిన ప్రేమకుమారి అనే మహిళ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ఎదుట కన్నీరుమున్నీరైంది. పవన్ దంపతులు రాజధాని నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి సోమవారం గన్నవరం విమానాశ్రయానికి రాగా, ఆయనను కలవడానికి చాలామంది మహిళలు అప్పటికే అక్కడికి చేరుకున్నారు. అయితే వారు పవన్ సమీపానికి రాకుండా పోలీసులు రోప్ పార్టీలను, బారికేడ్లను పెట్టి అడ్డుకున్నారు. వీఐపీ ప్రవేశద్వారం వైపు నుంచి పవన్ దంపతులు లోపలకు వెళ్తుండగా మహిళలు పవన్ అన్నా.. అని పెద్దగాకేకలు వేశారు. ఆయన గమనించి వెనుదిరిగి వారి వద్దకు వచ్చారు. వారితో కరచాలనం చేశారు. కాకినాడకు చెందిన ప్రేమకుమారి అనే మహిళ ఆయన వద్ద కన్నీళ్లు పెట్టుకుంది. కాకినాడలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తన పొలాన్ని రియల్ వ్యాపారి ఆక్రమించి రహదారి నిర్మించుకున్నాడని, దీనిపై పోలీసులకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గొడవ వద్దన్నాడని..!

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి

మునునూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వేల్పుచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తపై వైసీపీ సర్పంచ్ తోపాటు మరికొంత మంది కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనపై మునునూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వేల్పుచర్ల గ్రామానికి చెందిన బడుగు రంజిత్ కుమార్ ఆదివారం రాత్రి గ్రామ శివారు సింగవరం సెంటర్‌లో ఉన్నాడు. సమీపంలోని మద్యం దుకాణం వద్ద.. అదే గ్రామానికి చెందిన కొయ్యూరి నాగరాజుకు, మరికొంత మందికి మధ్య గొడవ జరుగుతోంది. రంజిత్‌కుమార్ అదిచూసి గొడవలు ఎందుకంటూ వారికి సర్దిచెప్పబోయాడు. దీంతో అతడితో నాగరాజు వాదనకు దిగి చెయ్యిచేసుకున్నాడు. అక్కడి నుంచి రంజిత్‌కుమార్ వెళ్లిపోయిన కొద్దిసేపటికి నాగరాజుతోపాటు సర్పంచ్ పుట్ట మోహన్ రావు, దుర్గారావు, కొయ్యూరి ఏడుకొండలు, నాని, స్వామియేలు మరికొంత మంది కర్రలు, కత్తులు పట్టుకుని బైక్‌లపై రంజిత్‌కుమార్ ఇంటి వద్ద అతన్ని చంపేస్తామని హల్‌చల్ చేశారు. గ్రామ పెద్దలు కలుగజేసుకుని ఇరువర్గాలతో మాట్లాడుతుండగా నాగరాజుతోపాటు మరో ఐదుగురు రంజిత్‌పై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రంజిత్‌కు గాయాలు కావడంతో నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ వివాదంలో పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు.

చైనా మాంజాకు ఐదేళ్ల బాలిక బలి

▸ తల్లిదండ్రులతో కలిసి బైక్ మీద వెళుతుండగా గొంతుకు తగిలిన మాంజా.. లోతుగా తెగి తీవ్ర గాయం

▸ ఆస్పత్రికి తరలించేలోపు తండ్రి చేతుల్లోనే మృతి



మూసాపేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మృత్యుపాశంగా మారిన చైనా మాంజాకు మరో నిండు ప్రాణం బలైంది. తల్లిదండ్రులతో కలిసి ఐదేళ్ల బాలిక బైక్ మీద వెళుతుండగా.. ఎక్కడి నుంచి వచ్చిందో గానీ మాయదారి చైనా మాంజా ఆ చిన్నారి మెడకు బిగుసుకుంది. తగిలీ తగలగానే గొంతు కోసుకుపోయింది. ధారగా రక్తం పోతుండగా అపస్మారక స్థితికి చేరుకున్న బిడ్డను ఆ తండ్రి చేతుల్లోకి తీసుకొని.. ఆస్పత్రికి తరలించేలోపే చిన్నారి మృతిచెందింది. ఈ హృదయవిదారకమైన ఘటన కూకట్‌పల్లిలో జరిగింది. గోకుల్‌ఫ్లాట్స్‌కు చెందిన ప్రేమ్‌సాగర్ అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయనకు భార్య ఇద్దరు కూతుళ్లున్నారు. ప్రేమ్‌సాగర్ సోమవారం భార్యాపిల్లలతో కలిసి బైక్‌పై నిజాంపేట కొత్త ఇంటి పనులు జరుగుతున్న సైట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ఓ జ్యువెలరీ దుకాణంలో స్కీం డబ్బు కట్టేందుకు బయలుదేరారు. జువెలరీ దుకాణం దాటి కాస్త ముందుకు వెళ్లినట్లు గుర్తించిన ప్రేమ్‌సాగర్ యూటర్న్ తీసుకున్నాడు. కూకట్‌పల్లి వివేకానందనగర్ పిల్లర్ నంబర్ 781 వద్దకు రాగానే బైక్ పెట్రోలు ట్యాంక్ మీద కూర్చున్న చిన్న కూతురు నిశ్విక ఆదిత్య (5) గొంతుకు చైనా మాంజా చుట్టుకుంది. తీవ్రంగా గాయపడిన బాలికను సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే చిన్నారి మృతిచెందిందని వైద్యులు తెలిపారు. కంటికీమంటికి ధారగా రోదిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవ్వరివల్లా కాలేదు.

అక్రమాల గుట్టు తేల్చరా!?

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నేతలు భారీగా ఇసుక వ్యాపారాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అమ్మకాల్లో ఎండీసీకి డబ్బులు వచ్చాయి కానీ, ఇసుక రవాణా చేసిన వారికి, కాంట్రాక్టులు చేసిన మరికొందరికి బిల్లులు చెల్లించలేదు. తమకు బిల్లులు చెల్లించాలని కొందరు కోర్టును ఆశ్రయించారు. బిల్లులను ఎందుకు పెండింగ్ పెట్టారని హైకోర్టు పలుమార్లు చీవాట్లు పెట్టింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు సెటిల్ చేశారు. కానీ ఇంకా భారీగానే సెటిల్ చేయాల్సి ఉంది. ఇందులో నాటి వైసీపీ నేతలు, లోగడ కీలక ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన వారి ప్రధాన అనుచరుల బకాయిలు కూడా ఉన్నాయి. ఇసుక అమ్మకాలకు సంబంధించి పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారు కోర్టుకు వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ బిల్లులు చెల్లించాలన్న ఒత్తిళ్లు రకరకాల పద్ధతుల్లో వచ్చినా స్పందించలేదు. ఇప్పుడు కొందరు వైసీపీ నేతలు తమకు తెలిసిన అధికారుల ద్వారా ఇసుక బకాయిల చెల్లింపు అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అనూహ్యంగా ఈ అంశంపై ఏపీఎండీసీలోనూ కదలిక వచ్చింది. నాడు ఇసుక అమ్మకాల్లో ఏం జరిగిందో నిగ్గు తేల్చకుండా, ఇప్పుడు ఆ బకాయిల చెల్లింపుపై అధ్యయనానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

నూతన కమిటీలకు దిశానిర్దేశం!

▸ నేడు టీడీపీ వర్క్‌షాపు.. హాజరుకానున్న చంద్రబాబు, లోకేశ్, పల్లా

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించింది. ఇటీవలే జిల్లా కమిటీల నియామకం పూర్తి చేసిన నాయకత్వం.. వాటికి దిశానిర్దేశం చేసేందుకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో వర్క్‌షాపు నిర్వహిస్తోంది. 25 పార్లమెంటు నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు, కమిటీ సభ్యులందరినీ దీనికి ఆహ్వానించారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో 40 మందికి పిలుపులందాయి. వీరందరికీ పార్టీ సిద్ధాంతాలు. గతంలో ఎదుర్కొన్న సవాళ్లు, సంక్షోభాలు.. వాటిని పార్టీ ఎలా ఎదుర్కొందో వివరించేందుకు 30 మందికిపైగా సీనియర్ నేతలు హాజరవుతున్నారు. ఇందులో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారు. లోకేశ్ ఉదయం 8 గంటలకే పార్టీ కార్యాలయానికి వస్తారు. చంద్రబాబు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటారు. ఇద్దరూ సాయంత్రం వరకు ఇక్కడే ఉంటారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.